
'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 146

బుధవారం 16-8-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేటి నుంచి ఆంధ్ర ప్రీమియర్ లీగ్

విశాఖపట్నంలో జరిగే టోర్నీ బరిలో ఆరు జట్లు... ఆగస్టు 27న ఫైనల్ - 12లో



ఇన్ఫీకి 13,650 కోట్ల కాంట్రాక్ట్

లిబర్టీ గ్లోబల్‌తో డీల్.. అయిదేళ్ల పాటు ఐటీ సేవలు - 13లో

న్యూస్‌రీల్

'సులభ్' వ్యవస్థాపకుడు పాఠక్ కన్నుమూత



సులభ్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు, సామాజిక కార్యకర్త బిందేశ్వర్ పాఠక్(80) కన్నుమూశారు. ప్రజా మరుగుదొడ్లను నిర్మించడంలో ఆద్యుడిగా ఆయనకు పేరుంది.

- వివరాలు 6లో

ఓటమి భయంతోనే కేసీఆర్ రైతు రుణమాఫీ



ఓటమి భయంతోనే సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు రైతు రుణమాఫీ అమలు చేస్తున్నట్టు ప్రకటించారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు.

- వివరాలు 3లో

మిమ్మల్ని 'నల్ల డైరీ'ల్లో ఎక్కిస్తారు



'రేవంత్‌రెడ్డిగారూ.. మమ్మల్ని మీరు 'ఎర్ర డైరీ'లో ఎక్కిస్తే, ప్రజలు మిమ్మల్ని 'నల్ల డైరీ'ల్లో ఎక్కిస్తారు' అంటూ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి అన్నారు.

- వివరాలు 3లో

మళ్లీ నేనే!

ఎర్రకోటపై నుంచి ఎన్నికల భేరీ మోగించిన ప్రధాని మోదీ



- వచ్చే ఏడాదీ ఇక్కడి నుంచి నేనే జాతినుద్దేశించి ప్రసంగిస్తా
- అవినీతి, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలు.. మూడు చీడ పురుగులు
- ప్రజలంతా వాటిని తప్పనిసరిగా వదిలించుకోవాలి
- ప్రజలంతా నా వాళ్లే.. ప్రజల నుంచే వచ్చా.. ప్రజల కోసమే జీవిస్తా
- అవినీతి పార్టీల కూటమి 'ఇండియా'.. ఎన్డీయే పాలనలో 'న్యూ ఇండియా'
- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి మోదీ

6లో

"2047 నాటికి సౌభాగ్యవంతమైన భారత్ అనే కలను సాకారం చేసుకునే దిశగా రాబోయే ఐదేళ్ల కాలం ఒక స్వర్ణయుగమే అవుతుంది. మరో ఐదేళ్లలో ప్రపంచంలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. ప్రజలకు ఇది 'మోదీ కీ గ్యారంటీ'.

దేశంలో 5జీ టెక్నాలజీ శరవేగంగా విస్తరిస్తోంది. ఇక 6జీ టెక్నాలజీ కోసం భారత్ సన్నద్ధమవుతోంది. ఈ విషయంలో ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం. అవినీతి అరికట్టడానికి ప్రభుత్వం టెక్నాలజీని ఉపయోగించుకుంటోంది.

-ప్రధాని మోదీ



ఢిల్లీలోని ఎర్రకోటలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

ఆశీర్వదించండి!

రాష్ట్ర పురోగమనం కొనసాగేలా ప్రజలు సంపూర్ణ బలాన్ని ఇవ్వాలి

ముఖ్యమంత్రి కేసీఆర్ విజ్ఞప్తి

- సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం సువర్ణాధ్యాయాన్ని లిఖిస్తోంది... నిరంతర విద్యుత్తు వెలుగులు, పంట కాల్వలు, పచ్చని చేలతో కళకళలాడుతోంది
- ప్రధాన అభివృద్ధి సూచికల్లో దేశంలోనే అగ్రస్థానం
- గృహలక్ష్మి కింద ప్రతి నియోజకవర్గంలో 3 వేల మందికి లబ్ధి చేకూరుస్తాం... త్వరలో కొత్త పీఆర్సీ.. వేతనాలు పెంచే వరకు మధ్యంతర భృతి
- తెలంగాణ అపూర్వ ప్రగతిని చూసి యావద్దేశం సంభ్రమాశ్చర్యాలకు గురవుతోంది
- దేశం మాత్రం ఇప్పటికీ పేదరికంలోనే మగ్గుతోంది
- గోల్కొండపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సీఎం


సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ నేడు నిరంతర విద్యుత్తు వెలుగులు, పంట కాల్వలు, పచ్చని చేలతో కళకళలాడుతోంది. మండే ఎండల్లో సైతం చెరువులు మత్తడి దుంకుతున్నయి. చెక్ డ్యాములు నీటి గలగలలతో తొణికిసలాడుతున్నాయి. కాళేశ్వర జలధారలతో గోదావరి సతత జీవధారయై తెలంగాణ భూములను తడుపుతోంది. ఇరవైకి పైగా రిజర్వాయర్లతో తెలంగాణ పూర్ణకలశం వలె తొణికిసలాడుతోంది. దేశానికి అన్నంపెట్టే అన్నపూర్ణగా విలసిల్లుతోంది. సంక్షేమం, అభివృద్ధిలో సువర్ణాధ్యాయాన్ని లిఖిస్తోంది. తెలంగాణ అపూర్వ ప్రగతిని చూసి యావద్దేశం సంభ్రమాశ్చర్యాలకు లోనవుతోంది. ఈ పురోగమనం మిగతా 2వ పేజీలో ▶



గోల్కొండ కోటలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న సీఎం కేసీఆర్

ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌తోనే వైద్య సీట్ల భర్తీ

- ప్రైవేట్ యాజమాన్యాల సీట్ల బ్లాకింగ్‌కు ఎన్ఎంసీ చెక్
- మిగిలిపోయిన సీట్లకు ప్రత్యక్ష కౌన్సెలింగ్ రద్దు... సీట్లు మిగిలిపోతే అలాగే వదిలేయాలని సూచన
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శికి లేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీట్ల బ్లాకింగ్‌కు చెక్ పెట్టే దిశగా జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) కీలక నిర్ణయం తీసుకుంది. అందుకోసం పటిష్ట కార్యాచరణ చేపట్టింది. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారానే అన్ని సీట్లను భర్తీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రత్యక్ష (ఫిజికల్) కౌన్సెలింగ్ చేపట్టవద్దని స్పష్టం చేసింది. పలుమార్లు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లు నిర్వహించాలని, అప్పటికీ సీట్లు మిగిలిపోతే వాటికి ప్రత్యక్ష కౌన్సెలింగ్ మిగతా 5వ పేజీలో ▶



రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై, సీజే జస్టిస్ అలోక్ అరాధే, సీఎస్ శాంతికుమారి తదితరులు

ఎట్ హోంకు సీఎం దూరం

గవర్నర్ తేనీటి విందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ముఖ్య నేతలూ గైర్హాజరు.. పాల్గొన్న హైకోర్టు సీజే, సీఎస్, డీజీపీ

సాక్షి, హైదరాబాద్: దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మంగళవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన తేనీటి విందుకు ఎప్పటిలాగే సీఎం కేసీఆర్ గైర్హాజరయ్యారు. బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ముఖ్య నేతలు సైతం ఈసారి హాజరు కాలేదు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, సీపీఐ మహిళా నేత పశ్య పద్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గవర్నర్ అతిథులందరి వద్దకు స్వయంగా వెళ్లి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్‌గా ఇదే చివరి తేనీటి విందా? అని ఓ విలేకరి ప్రశ్నించగా, అంతా దేవుడి చేతిలో ఉందని గవర్నర్ తమిళిసై స్పందించారు. రాజ్‌భవన్‌లో పెండింగ్ బిల్లులతో పాటు ఇతర ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు విముఖత చూపారు.

లైంగిక వేధింపులు ధైర్యంగా ఎదుర్కోవాలి

ఆడపిల్లలకు మార్షల్ ఆర్ట్స్ జాతీయ స్థాయి క్రీడాకారిణి పిలుపు

- ఈ విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి
- తనను కూడా వేధిస్తే గట్టి వార్నింగ్ ఇచ్చానని వెల్లడి

బంజారాహిల్స్ (హైదరాబాద్)/సాక్షి, కామారెడ్డి: క్రీడారంగంలోనైనా, ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురవుతున్నట్లైతే ఆడపిల్లలు వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని కామారెడ్డి జిల్లాకు చెందిన మార్షల్ ఆర్ట్స్ జాతీయ స్థాయి క్రీడాకారిణి సూచించారు. అదే సమయంలో క్రీడారంగంలోకి ఎంతో ఇష్టంగా వస్తున్న ఆడపిల్లలను వేధిస్తూ వారి మనోధైర్యాన్ని దెబ్బతీసే వారిపై ప్రభుత్వం, అధికారులు కఠిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని ఆమె అన్నారు. తెలంగాణ జిల్లాల నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్న క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభించకపోగా, కొందరు అమ్మాయిలను వేధింపులకు గురిచేస్తున్న ఘటనలు బాధిస్తున్నాయని చెప్పారు. ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదని, వారిని ప్రోత్సహించాల్సిందిపోయి వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటీవల హాకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో బాలికలపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. క్రీడాకారిణులు, ఆడపిల్లలు ఆత్మవిశ్వాసం, ధైర్యంతో వ్యవహరించినట్లైతే మిగతా 2వ పేజీలో ▶

ఇంకాజోక్



ఇటు చూడండి! భారీగా పెంచాల్సింది ఆయుధాల ఉత్పత్తి కాద్సార్ ఆహార ఉత్పత్తి!!


వారసులు రెడీ

వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా సుమారు 30 మంది

- అధినేతకు వినతిపత్రాలు సమర్పిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు
- తలసాని కుమారుడు సాయి, మల్లారెడ్డి అల్లుడు మర్రి అసెంబ్లీకి ?
- తనతో పాటు కుమారుడికీ టికెట్ అడుగుతున్న మైనంపల్లి
- తనకు విరామం ఇచ్చి వారసుడికి చాన్స్ ఇవ్వాలని కోరుతున్న బాజిరెడ్డి
- హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా గెలుపు గుర్రాలపై కేసీఆర్ కసరత్తు
- త్వరలో జాబితా విడుదలకు సన్నాహాలు... ఆశావహుల్లో ఉత్కంఠ



సాక్షి, హైదరాబాద్: ఏడాది చివర్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి తరఫున పోటీ చేసే అభ్యర్థుల జాబితాపై పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. వరుసగా మూడోసారి రాష్ట్రంలో అధికారం చేపట్టే దిశగా వ్యూహరచన చేస్తున్న సీఎం.. పార్టీ అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఎక్కువ సాగదీయకుండా వీలైనంత త్వరగా అభ్యర్థుల జాబితాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి తమ వారసులకు అవకాశం ఇవ్వాలంటూ సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్న పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కొందరు అధినేతకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. అవకాశం చిక్కితే తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని, అసెంబ్లీ ఎన్నికల ద్వారా అరంగేట్రం చేయాలని సుమారు 30 మంది నేతల వారసులు ఉత్సాహం చూపుతున్నట్లు సమాచారం. కాగా ఎమ్మెల్యేల వినతులను పరిశీలిస్తున్న కేసీఆర్..కొందరి వినతిని పరిగణనలోకి తీసుకోవడంపై తర్జనభర్జన పడుతున్నట్లు తెలిసింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పెద్దపీట వేస్తూ మిగతా 3వ పేజీలో ▶



కౌన్సెలింగ్ తర్వాతే క్లాసులు..

- విద్యార్థుల బలవన్మరణాల కట్టడికి కేంద్ర విద్యాశాఖ నిర్ణయం
- మనోధైర్యంతో ముందుకు సాగేలా ప్రతీ సంస్థలోనూ కౌన్సెలింగ్ కేంద్రం
- జాతీయ విద్యాసంస్థలకు ఆదేశాలు
- ఐదేళ్లలో జాతీయ విద్యాసంస్థల్లో 91 మంది ఆత్మహత్య

సాక్షి, హైదరాబాద్: జాతీయ విద్యాసంస్థల్లో విద్యార్థుల బలవన్మరణాలను కట్టడిచేసేందుకు కేంద్ర విద్యాశాఖ నడుం బిగించింది. జాతీయ ఇంజనీరింగ్, మెడికల్, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల మానసిక ఒత్తిడిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించింది. కాలేజీలు మొదలయ్యే ముందే విద్యార్థులకు విద్యా విధానం, ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని మిగతా 5వ పేజీలో ▶



వరదల సమయంలో సాహసం కనబరిచి, ఉత్తమ సేవలందించిన పలువురికి సీఎం కేసీఆర్ అవార్డులు అందజేశారు. సీఎం నుంచి అవార్డును అందుకుంటున్న పాయం వీనయ్య



ఎస్. ప్రసన్న రాణి



కె. సంజీవ్‌రావు



బి. ప్రదీప్ కుమార్



కె. వెంకటేశ్వర్లు



ఆర్.ఏ.ఎస్.పి.లత



ఎండీ రెహ్మాన్



ఏడిగ చిట్టిబాబు



ముత్యాలరావు



ఎ. రామనరసింహారెడ్డి



కె. సంపత్



నరేశ్ మానేరు



జి. రాంబాబు



కె. శ్రీకాంత్

కలిసికట్టుగా జరుపుకోవాల్సిన వేడుక

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై వ్యాఖ్య



సాక్షి, చెన్నై: స్వాతంత్య్ర దినోత్సవం వంటి వేడుకలను ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, నాయకులందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యానించారు. పుదుచ్చేరి రాజ్‌నివాస్‌లో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఆమె జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈసందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ ప్రభుత్వం, రాజకీయ నాయకులందరూ కలిసి రాజ్‌నివాస్‌లో ఈ వేడుక జరుపుకోవడం మంచి సంబంధాలకు మార్గం అని సూచించారు. ఇందులో పుదుచ్చేరి పాలకులు ఆదర్శవంతులుగా ఉన్నారని కితాబిచ్చారు. సిద్ధాంత పరంగా, ఇతర అంశాల పరంగా అభిప్రాయ భేదాలున్నా.. అధికారంలో ఉన్న వాళ్లు ఇలాంటి వేడుకలు, తేనీటి విందులలో పాలు పంచుకోవాల్సిన అవసరం ఉందంటూ తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి విందును సీఎం స్టాలిన్ బహిష్కరించడంపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. విందు కార్యక్రమంలో భాగంగా పుదుచ్చేరి సీఎం రంగస్వామికి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై స్వయంగా వడ్డించడం విశేషం.

సచివాలయంలో జెండా ఆవిష్కరించిన సీఎస్

ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల్లో ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు



సాక్షి, హైదరాబాద్: 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు మంగళవారం ఆయా ప్రభుత్వ ప్రధాన కార్యాలయాల్లో ఘనంగా జరిగాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో జాతీయ జెండాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సునీల్‌శర్మ ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

- మాసాబ్‌ట్యాంక్‌లోని సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ప్రత్యేక కమిషనర్ అశోక్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు.
- విద్యుత్‌సౌధలో తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశంలో సమర్థవంతంగా గ్రిడ్ కోడ్‌ను అమలు చేస్తున్న మూడు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.
- మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయంలో ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పంచాయతీరాజ్ ఈఎన్‌సీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.
- సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో 12 కొత్త గనులను ప్రారంభించి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని, రూ.50 వేల కోట్ల టర్నోవర్‌ను సాధించడం సంస్థ లక్ష్యమని చెప్పారు.
- దేశంలోనే యువ రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు దక్కుతున్న ఘనత, గుర్తింపుల్లో అటవీశాఖ కూడా ఉండటం చాలా గొప్ప విషయమని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్.ఎం.డోబ్రియల్ అన్నారు. అరణ్య భవన్‌లో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో ఆయన జాతీయ జెండా ఎగుర వేశారు. ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఉన్నతాధికారుల ప్రశంసాపత్రాలు అందించారు.

కట్టుదిట్టంగా 'రెరా' చట్టం అమలు

చైర్మన్ సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: 'రెరా'చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయడానికి సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని చైర్మన్ ఎన్.సత్యనారాయణ కోరారు. 77వ భారత స్వాతంత్య్ర దినోత్సవాలను మంగళవారం 'రెరా'(తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'రెరా'చైర్మన్ ఎన్.సత్యనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఆశీర్వదించండి!

▶ మొదటి పేజీ తరువాయి

ఇదే రీతిన కొనసాగే విధంగా రాష్ట్ర ప్రజలు తమ సంపూర్ణమైన ఆశీర్వాద బలాన్ని అందించాలి..'అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు విజ్ఞప్తి చేశారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన గోల్కొండ కోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

నాడు ఆత్మహత్యలు, ఆకలి చావులు

పదేళ్ల కిందటి తెలంగాణ సంక్షుభిత జీవన చిత్రాన్ని తలుచుకుంటే ఇప్పటికీ దుఃఖం తన్నుకొస్తుంది. ఎడతెగని కరెంటు కోతలు, అర్ధరాత్రి మోటరు పెట్టబోయి కరెంటు షాకుకో, పాము కాటుకో బలైపోయిన రైతన్నలు. అప్పుల ఊబిలో చిక్కి ఆత్మహత్యలే శరణ్యమైన అన్నదాతలు. ఉరి పెట్టుకుంటున్న చేనేత కార్మికులు. యువకులంతా వలసెల్లిపోతే ముసలివాళ్లే మిగిలిన పల్లెలు. ఎటుచూసినా ఆకలి చావులు, హాహాకారాలు. ఇలాంటి అగమ్యగోచర పరిస్థితుల నడుమ అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ పునర్నిర్మాణాన్ని ఒక పవిత్ర యజ్ఞంగా నిర్వహించింది. అనేక రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టింది.

నేడు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి

ఒక దేశం, రాష్ట్రం సాధించిన ప్రగతికి తలసరి ఆదాయం, తలసరి విద్యుత్ వినియోగాన్ని సూచికలుగా పరిగణిస్తారు. ఈ రెండింటిలోనూ తెలంగాణ దేశంలో నంబర్ 1గా నిలిచింది. రూ.3,12,398 తలసరి ఆదాయంతో, 2,126 యూనిట్ల తలసరి విద్యుత్తు వినియోగంతో తొలి స్థానంలో ఉంది. రైతు సంక్షేమంలో తెలంగాణకు సాటి రాగల రాష్ట్రం దేశంలో మరొకటి లేదు. తొమ్మిదిన్నరేళ్లలో రూ.37 వేల కోట్ల పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. 24 గంటల ఉచిత విద్యుత్తు, సకాలంలో ఎరువులు, విత్తనాల సరఫరా, రైతు బంధు, రైతు బీమా, పంట రుణాల మాఫీ తదితర సంక్షేమ చర్యలతో వ్యవసాయ రంగాన్ని అద్భుతంగా స్థిరీకరించింది. కొంతమంది అల్పబుద్ధిని ప్రదర్శిస్తూ వక్ర భాష్యాలు చెబుతున్నారు. వ్యవసాయానికి 3 గంటల విద్యుత్తు చాలని వ్యాఖ్యానిస్తున్నారు. వీరికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని విశ్వసిస్తున్నా.



గోల్కొండ కోటలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో డీజీపీ అంజనీ కుమార్

సాగునీరు, వైద్యారోగ్య రంగంలో ప్రగతి

మిషన్ కాకతీయ, పెండింగు ప్రాజెక్టుల నిర్మాణం, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులతో తెలంగాణ ప్రభుత్వం సాగునీటి రంగంలో స్వర్ణయుగాన్ని సృష్టించింది. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకునేందుకు విపక్షాలు ప్రయత్నించినా కేసులు వీగిపోయాయి. పర్యావరణ అనుమతులు లభించాయి. స్వల్ప కాలంలోనే 21 వైద్య కళాశాలలను ప్రారంభించి రాష్ట్రం చరిత్ర సృష్టించింది. మరో 8 మెడికల్ కాలేజీలను త్వరలోనే ప్రారంభించి, ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. హైదరాబాద్ చుట్టూ 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం, నిమ్స్ విస్తరణ శరవేగంగా జరుగుతున్నాయి. అనాథ పిల్లలను 'స్టేట్ చిల్డ్రన్'గా గుర్తిస్తూ వారికోసం ప్రత్యేక పాలసీని ప్రభుత్వం రూపొందించింది.

విద్యారంగ వికాసం.. ఐటీలో మేటి

వెయ్యికి పైగా గురుకుల జూనియర్ కళాశాలలు ప్రారంభించాం. మన ఊరు–మన బడి, మన బస్తీ–మన బడి పేరుతో రాష్ట్రంలోని 26 వేలకు పైగా పాఠశాలలను సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నాం. రూ.20 లక్షల ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నాం. టీఎస్ ఐపాస్ చట్టం, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాతో పారిశ్రామిక రంగంలో నూతనోత్తేజం వచ్చింది. రూ.2.51 లక్షల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వచ్చాయి. 17.21 లక్షల మందికి ఉపాధి లభించింది. రాష్ట్రంలో 6 లక్షలకు పైగా ఐటీ ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. ఐటీ ఎగుమతులు రూ.57,258 కోట్ల నుంచి రూ.2,41,275 కోట్లకు పెరిగాయి.

త్వరలో 'తెలంగాణ చేనేత మగ్గం'

దళితబంధు కింద దళిత కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం. ప్రభుత్వ లైసెన్సు వ్యాపారాల్లో దళితులకు 15 శాతం రిజర్వేషన్లు, బీసీల్లోని వృత్తిపనుల వారికి, మైనారిటీలకు రూ.లక్ష సాయం, ధూపదీప నైవేద్యం పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంపు, గొర్రెల పంపిణీ, చేపల పెంపకం, ఈత, తాటి చెట్లపై పన్ను రద్దు, మద్యం దుకాణాల్లో గౌడలకు 15శాతం రిజర్వేషన్లు, గీతన్న, నేతన్నలకు రూ.5 లక్షల బీమా, నేత కార్మికులకు నూలు రసాయనాలపై 50 శాతం సబ్సిడీ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఫ్రేమ్ మగ్గాల పంపిణీకి 'తెలంగాణ చేనేత మగ్గం'అనే కొత్త పథకాన్ని అమలు చేయనున్నాం. ఆసరా పెన్షన్లను రూ.200 నుంచి రూ.2,016కు, లబ్ధిదారుల సంఖ్యను 29 లక్షల నుంచి 44 లక్షలకు పెంచాం. లబ్ధిదారుల వయో పరిమితిని 60 నుంచి 57 ఏళ్లకు తగ్గించాం. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3,016 నుంచి రూ.4,016కు పెంచాం.

33,373 మంది ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం

33,373 మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించగా, ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఆందోళన చెందిన సంకుచిత శక్తులు బిల్లును అడ్డుకోవడానికి విఫల ప్రయత్నించాయి. ఆ ప్రయత్నాలను వమ్ము చేస్తూ అసెంబ్లీలో ఆర్టీసీ బిల్లు విజయవంతంగా ఆమోదం పొందింది. తెలంగాణ ఉద్యోగులు దేశంలోనే అత్యధిక వేతనాలను పొందుతున్నారు. త్వరలోనే కొత్తగా పీఆర్సీ నియమించి, ఉద్యోగుల వేతనాలను పెంచుతాం. అప్పటివరకూ మధ్యంతర భృతిని చెల్లిస్తాం. సింగరేణి కార్మికులకు వచ్చే దసరా, దీపావళి పండుగల బోనస్‌గా రూ.1,000 కోట్లు పంపిణీ చేయబోతున్నాం. వీఆర్‌ఏలు, పంచాయతీ కార్యదర్శులనూ క్రమబద్ధీకరిస్తాం.

హైదరాబాద్‌లో పేదలకు లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు

తెలంగాణ దశాబ్ది వేడుకల వేళ లక్షన్నర మంది ఆదివాసీ, గిరిజనులకు 4లక్షల ఎకరాలకు పైగా పోడు భూములపై యాజమాన్య హక్కులు కల్పించాం. వారికి రైతు బంధు సాయం సైతం అందించి, పోడు కేసుల నుంచి విముక్తులను చేశాం. గృహలక్ష్మి పథకం కింద ప్రతి నియోజకవర్గంలో 3 వేల మందికి లబ్ధి చేకూరనుంది.ఇందులో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాం. గత నెలలో భారీ వర్షాలు కురవడంతో తక్షణ సహాయంగా రూ.500 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు మంగళవారం నుంచే అర్హులైన పేదలకు అందజేస్తున్నాం. నగరం నలువైపులా రూ.69 వేల కోట్లతో మెట్రో రైలును విస్తరించాలని నిర్ణయించాం.

పేదరికం తగ్గుముఖం

సంపద పెంచు – ప్రజలకు పంచు అనే సదాశయంతో అనుసరిస్తున్న విధానాల ఫలితంగా రాష్ట్రంలో పేదరికం తగ్గుతోందని, తలసరి ఆదాయం పెరుగుతోందని నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన బహుముఖీయ పేదరిక సూచీ స్పష్టం చేసింది. జాతీయ స్థాయి సగటుతో పోల్చిచూస్తే తెలంగాణలో పేదరికం అందులో మూడోవంతుగా నమోదైంది. 2015–16 నాటికి తెలంగాణలో 13.18 శాతంగా ఉన్న పేదరికం, 2019–21 నాటికి 5.88 శాతానికి దిగివచ్చింది. ఏకంగా 7.3 శాతం పేదరికం కనుమరుగైంది.

లక్ష్యం చేరని స్వతంత్ర భారతం

75 ఏళ్ల స్వతంత్ర భారతం గణనీయ ప్రగతి సాధించినా, ఆశించిన లక్ష్యాలు, చేరాల్సిన గమ్యాలను ఇంకా చేరలేదు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, బలహీనవర్గాల్లో పేదరికం తొలగిపోలేదు. వనరుల సంపూర్ణ వినియోగంతో ప్రగతి ఫలాలు అన్నివర్గాల అభ్యున్నతికి సమానంగా ఉపయోగపడిన నాడే స్వాతంత్య్రానికి సార్థకత.



అమర వీరులకు నివాళి

గోల్కొండ కోటలో జెండావిష్కరణకు ముందు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లోని అమర జవానుల స్మృతి చిహ్నాన్ని సీఎం కేసీఆర్ సందర్శించి ఘన నివాళి అర్పించారు. ఎయిర్ వైస్ మార్షల్ చంద్రశేఖర్, ఆంధ్ర, తెలంగాణ సబ్ ఏరియా జీవోసీ మేజర్ జనరల్ రాకేష్ మనోచా ఇతర ఆర్మీ అధికారులు అమర సైనికులకు నివాళులర్పించారు. ఇలావుండగా సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో కూడా జాతీయ జెండాను ఎగురవేశారు. సీఎంఓ కార్యాలయ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పరిపాలనలో దేశానికే తెలంగాణ దిక్సూచి: పోచారం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పరిపాలన దేశానికే దిక్సూచిలా సాగుతోందని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శాసనసభ ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేశారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అలాగే, శాసనమండలి ప్రాంగణంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు.

← అసెంబ్లీలో పోచారం

మండలిలో గుత్తా →



వరదల్లో ఉత్తమ సేవలకు పురస్కారాలు

పంద్రాగస్టు సందర్భంగా అందజేసిన సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల సందర్భంగా విధి నిర్వహణలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన, అత్యుత్తమ సేవలందించిన పలువురు అధికారులు, సిబ్బందికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పురస్కారాలను అందజేశారు. వారి వివరాలు..

- ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయ్ గ్రామంలో వరదల్లో చిక్కుకున్న పాఠశాల విద్యార్థులను అదే జిల్లాకు చెందిన ఎస్జీటీ పాయం వీనయ్య రక్షించారు.
- జనగామ జిల్లాకు చెందిన విద్యుత్ లైన్‌మెన్ ఎం.డి.రెహ్మాన్ వరదల్లో సైతం విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ధైర్య సాహసాలతో విధులు నిర్వహించారు.
- ములుగు జిల్లాకు చెందిన పంచాయతీ సెక్రటరీ సంజీవ్‌రావు ముత్యాలధార జలపాతంలో చిక్కుకున్న 80 మంది యాత్రికులను రక్షించడంలో గొప్ప సమన్వయం కనబరిచారు.
- ములుగు జిల్లా జెడ్పీ సీఈఓ ప్రసన్నరాణి కొండాయ్ గ్రామంలో వరదల్లో చిక్కుకున్న గర్భిణులను క్షేమంగా తరలించడంతో పాటు, వాయు మార్గం ద్వారా చేపట్టిన ఆహార పంపిణీని జాగ్రత్తగా పర్యవేక్షించారు.
- భూపాలపల్లి జిల్లా పంచాయతీ అధికారి ఆర్.ఎ.ఎస్.పి. లత వరదల్లో చిక్కుకున్న పలు గ్రామాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు.
- భూపాలపల్లి జిల్లా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ప్రదీప్ కుమార్ వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు బోట్లు, హెలికాప్టర్ సేవలను సమర్థంగా వినియోగించి 100 మందికి పైగా ప్రజలను రక్షించి, వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన అడిషనల్ కలెక్టర్ వి.వెంకటేశ్వర్లు వరదల్లో చిక్కుకున్న ఏజెన్సీ ప్రాంత ప్రజలను రక్షించడంలో అసమాన ధైర్య సాహసాలను ప్రదర్శించి, రక్షణ, పునరావాస చర్యలు చేపట్టారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మండల పంచాయతీ అధికారి ముత్యాలరావు వరదల్లో చిక్కుకున్న ఏజెన్సీ ప్రాంత ప్రజలను రక్షించడంలో గొప్ప ధైర్యసాహసాలను ప్రదర్శించారు. రక్షణ, పునరావాస చర్యలను సమర్థంగా నిర్వహించారు.
- భూపాలపల్లి జిల్లాలో సీఐ రామనరసింహారెడ్డి వరదల్లో చిక్కుకున్న ప్రజల తరలింపు, తప్పిపోయిన నలుగురు వ్యక్తులను రక్షించడంతో పాటు, మరో మూడు మృతదేహాలను గుర్తించారు.
- భూపాలపల్లి జిల్లా కొయ్యూరు పీఎస్ ఎస్ఐ నరేశ్ మానేరు నది వరదల్లో చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులను రక్షించారు.
- వరంగల్ జిల్లా మట్వాడ పీఎస్ ఏఎస్ఐ కె.సంపత్ తన బృందంతో వేర్వేరు ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్న 880 మంది ప్రజలను రక్షించి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
- ములుగు జిల్లాలో ఏఎస్ఐ జి.రాంబాబు మేడారంలో వరదల్లో చిక్కుకున్న 19 మందిని తన బృందంతో కలిసి రక్షించారు.
- ములుగు జిల్లాలో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ కె.శ్రీకాంత్ తన టీమ్‌తో కలిసి మేడారం వరదల్లో చిక్కుకున్న 19 మందిని రక్షించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
- రాష్ట్ర సచివాలయంలో జీఏడీ శాఖలోని ఎన్ఆర్ఐ సెక్షన్‌లోని అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఏడిగ చిట్టిబాబు ఉక్రెయిన్, సూడాన్ దేశాల్లో యుద్ధ పరిస్థితుల్లో చిక్కుకున్న తెలంగాణ విద్యార్థులను స్వరాష్ట్రానికి తరలించడంలో చురుకైన పాత్రను పోషించారు. కొన్నేళ్లుగా వేర్వేరు దేశాల్లో ప్రాణాలు కోల్పోయిన 1,200 మంది వ్యక్తుల మృతదేహాలను తెలంగాణకు తరలించడంలో ఆయా దేశాల ఎంబసీలు, కాన్సులేట్ అధికారులు, హైకమిషనర్లతో సమన్వయం, సంప్రదింపులు జరిపి, కుటుంబాలకు మృతదేహాలను అప్పగించడంలో కీలక పాత్రను పోషించారు.

కేసుల పరిష్కార రేటు పెరగడం ఆనందంగా ఉంది

- పెండింగ్ కేసులు తగ్గించడమే న్యాయవ్యవస్థ సమర్థతకు కొలమానం
- స్వాతంత్య్ర దిన వేడుకల్లో సీజే జస్టిస్ అలోక్ అరాధే



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న సీజే జస్టిస్ అలోక్ అరాధే

సాక్షి, హైదరాబాద్: కుప్పలుకుప్పలుగా పేరుకుపోయిన పెండింగ్ కేసులు తగ్గించడమే న్యాయవ్యవస్థ పనితీరు, సమర్థతకు కొలమానం అని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే పేర్కొన్నారు. పెండింగ్ కేసులు తగ్గించడానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తీవ్రకృషి చేస్తున్నారని ప్రశంసించారు. తాను ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కేసుల పరిష్కార రేటు పెరగడం ఆనందదాయకమన్నారు. ఇదంతా బార్ అండ్ బెంచ్ సమష్టి కృషితోనే సాధ్యమైందని చెప్పారు. న్యాయస్థానాలను ఆశ్రయించిన కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యమని వెల్లడించారు. త్వరలో హైకోర్టులో ఈ ఫైలింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్టు సీజే చెప్పారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం హైకోర్టు ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం సీజే జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడారు. చారిత్రక హైదరాబాద్ గడ్డపై స్వాతంత్య్ర దిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉంది. స్వాతంత్య్ర దినోత్సవం అనేది ఒకరోజు కాదు.. మనల్ని మనం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన ఒక సందర్భం. ఎందరో త్యాగధనుల సుదీర్ఘ పోరాటం ఫలితంగా మనం స్వేచ్ఛాజీవితాన్ని అనుభవిస్తున్నాం. ప్రజాస్వామ్య భారతంలో రాజ్యాంగం పాత్ర ఎనలేనిది. ప్రజలను తీర్చిదిద్దుతూ, స్వతంత్ర భారత్‌ను ముందుకు నడిపిస్తూ అంతర్జాతీయ మన్ననలు పొందింది. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే స్తంభాల్లో న్యాయవ్యవస్థ ఒకటి. కక్షిదారులు ఈ వ్యవస్థపై ఎంతో నమ్మకం పెట్టుకొని ఆశ్రయిస్తున్నారు. తెలంగాణరాష్ట్రం ఎంతోమంది గొప్ప న్యాయమూర్తులు, మేధావులైన న్యాయవాదులను అందించింది. వీరంతా జాతీయస్థాయిలో వారి సేవలు అందిస్తున్నారు. న్యాయవ్యవస్థ పటిష్టతకు బార్ వృద్ధి చాలా అవసరం. బార్ సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా. జిల్లా కోర్టులో నిర్మాణంలో 'న్యాయ నిర్మాణ్'పాత్ర గొప్పది. అన్ని కోర్టులు ఒకేలా ఉండేలా రూపకల్పన చేయడం ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరి, జూన్‌లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 7,10,384 కేసులు, సాధారణ లోక్ అదాలత్‌లో 41,552 కేసులు పరిష్కారమయ్యాయి'అని వివరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులతో పాటు అడ్వొకేట్ జనరల్(ఏజీ) బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు, రిజిస్ట్రార్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు ధైర్యంగా ఎదుర్కోవాలి

▶ మొదటి పేజీ తరువాయి

వేధింపులకు పాల్పడే వారికి తగిన బుద్ధి చెప్పవచ్చని చెప్పారు. తనకు కూడా ఇలాంటి అనుభవం ఎదురైందని, అయితే తాను గట్టిగా హెచ్చరించి వేధింపుల నుంచి బయటపడ్డానని తెలిపారు. రాష్ట్ర క్రీడా మంత్రి పేషీలో పని చేసే ఓ వ్యక్తి తనను లైంగిక వేధింపులకు గురి చేశాడని చెప్పారు. వివరాలు ఆమె మాటల్లోనే..

క్యూట్‌గా ఉన్నావు.. ఎప్పుడు కలుద్దాం అన్నాడు

'బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో నివసించే క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేషీలో డేటాఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సురేందర్ తాను మంత్రి పీఏనని నాకు చెప్పాడు. నాకు 2022 నవంబర్‌లో తైక్వాండోలో సిల్వర్, చెస్ బాక్సింగ్‌లో బంగారు పతకం లభించాయి. ఈ విషయాన్ని మంత్రికి చెప్పాల్సిందిగా సురేందర్‌కు మెసేజ్ చేశా. గత ఏడాది జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఆర్థిక సాయానికి సంబంధించిన సిఫార్సు లేఖ ఇవ్వడానికి మరోసారి మంత్రి క్వార్టర్స్‌కు వెళ్లా. ఇంగ్లాండ్‌లో జరిగిన పోటీలో పతకం లభించినప్పుడు కూడా మెసేజ్ చేశా. ఆయా సందర్భాల్లో సురేందర్ 'నువ్వు చాలా అందంగా (క్యూట్‌గా) ఉంటావు. మనం ఎక్కడ కలుసుకుందామంటూ ప్రపోజల్ పెట్టాడు. అసలు విషయం పక్కన పెట్టి క్యూట్‌గా ఉన్నావు.. నన్ను కలుస్తావా..? నీ వయస్సెంత? అంటూ మెసేజ్‌లు పంపాడు. రకరకాలుగా వేధింపులకు గురి చేయడంతో ఇక లాభం లేదనుకుని గట్టిగా వార్నింగ్ ఇచ్చా. తాను మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారిణిని అని, నాతో పెట్టుకుంటే బాగుండదని, బాడీలో ఏ ఒక్క పార్ట్ పనిచేయకుండా కొడతానని తీవ్రస్థాయిలో హెచ్చరించా. దీంతో సురేందర్ దారికొచ్చి క్షమాపణ చెప్పాడు. అప్పట్నుంచీ నాతో మర్యాదగానే ప్రవర్తించాడు..' అని ఆమె తెలిపారు. వాస్తవం ఇలా ఉంటే ఓ చానెల్లో మాత్రం (సాక్షి కాదు) తన అనుమతి లేకుండా ఇష్టం వచ్చినట్లు కథనం ప్రసారం చేశారని ఆమె వాపోయారు.

క్లుప్తంగా...

జాతి నేతల ఆకాంక్షలకు అనుగుణంగా దేశం ముందడుగు

బీజేపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్య్ర సమరయోధుల ఆకాంక్షలకు అనుగుణంగా భారతదేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు తీసుకెళ్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన జాతీయ జెండాను ఎగరవేశారు. బీజేపీ జాతీయ బీసీ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ ఉద్యమంతో పాటు తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో ఎందరో అమరులయ్యారని, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశ సమగ్రత కోసం ప్రధాని మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అవినీతి, ఓటుబ్యాంకు రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలన్నది మోదీ ఆకాంక్ష అని, అందుకు అనుగుణంగా మనమందరం కృషి చేయాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా భారత్ ఉండాలని మోదీ పిలుపునిచ్చారని, దానికి అందరూ తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం అధికారంలోకి రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తెలంగాణలో మద్యం ఏరులై పారుతోందని, భూములన్నీ అన్యాక్రాంతమయ్యాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కార్యక్రమంలో తుల ఉమ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ స్వాతంత్య్ర ఫలాలు అందాలి

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



పతాకావిష్కరణలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మహ్మద్ ఇలియాస్ బుకారీ

చార్మినార్ (హైదరాబాద్): స్వాతంత్య్ర సంక్షేమ ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సంపూర్ణంగా అందాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ యజమాని మహ్మద్ ఇలియాజ్ బుకారీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో ఆయన మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ.. ఇప్పటికీ అట్టడుగు వర్గాల ప్రజలకు కొన్ని సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు.


మోగిన ఏఎన్‌ఎంల సమ్మె సైరన్

తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని ఏఎన్‌ఎంల సమ్మె సైరన్ మోగింది. ఈ మేరకు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ ప్రకటించింది. అన్ని రకాల ఏఎన్‌ఎంల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి సమ్మె చేస్తున్నామని తెలిపింది. కాంట్రాక్టు ఏఎన్‌ఎంలకు రాత పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని, ప్రస్తుతం పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని, ఇతర అన్ని సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఆగస్టు 15 నుంచి సమ్మెలోకి వెళ్తామని జూలై 31న రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన సమ్మె నోటీసులో పేర్కొన్నామని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ తెలిపారు. 15 రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సమ్మెబాట పట్టామని పేర్కొన్నారు. బుధవారం నుంచి 33 జిల్లాల్లో సమ్మెను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు అందరూ యూనియన్లకు అతీతంగా ఐక్యంగా సమ్మెలోకి రావాలని, సంబంధిత ట్రేడ్ యూనియన్లు, క్యాడర్ యూనియన్లు, ప్రజాసంఘాలు సమ్మెకు సహకరించాలని యాదనాయక్ విజ్ఞప్తి చేశారు.

కోతుల వల్ల పంటలకు తీవ్ర నష్టం..

ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: కోతుల వల్ల పంటలకు తీవ్ర నష్టం జరుగుతోందని, వాటిని ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ కోదండరెడ్డి విమర్శించారు. మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్, అధికార ప్రతినిధులు సుధీర్‌రెడ్డి, దుర్గం భాస్కర్ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధిపై ప్రభుత్వం ఆలోచించాలని హితవుపలికారు. లుంబినిపార్కుకు ఉన్న మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య పేరును కూడా తొలగించారని, 13 ఎకరాలు ఉన్న పార్కును ఐదెకరాలకు కుదించారని మండిపడ్డారు. దీనిమీద ప్రభుత్వానికి వారం రోజుల సమయం ఇస్తున్నామని, ప్రభుత్వం అనుకూల నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.



బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కేశవరావు తదితరులు



బీజేపీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి. చిత్రంలో బీజేపీనేతలు లక్ష్మణ్, మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు



సీపీఐ కార్యాలయంలో జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న చాడ వెంకట్‌రెడ్డి తదితరులు

ఆర్భాటంగా ప్రకటనలు.. | ఆ తర్వాత వాయిదాలు

- అగ్రనేతల బహిరంగ సభలపై కాంగ్రెస్‌లో గందరగోళం
- ప్రకటించిన తర్వాత సభలు వాయిదా పడుతుండటంపై చర్చ
- జూలై 2న ఖమ్మం వచ్చిన రాహుల్.. ఆ తర్వాత ప్రియాంక కొల్లాపూర్‌కు వచ్చేలా షెడ్యూల్
- మొత్తం మూడుసార్లు వాయిదా.. చివరకు రద్దు..ఢిల్లీ వెళ్లి పార్టీలో చేరిన జూపల్లి
- జహీరాబాద్‌లో సభ నిర్వహణకు పీఏసీ సమావేశంలో నిర్ణయం
- 18న ఏఐసీసీ అధ్యక్షుడు వస్తారని ప్రచారం.. ఇప్పుడు ఆ సభ కూడా రద్దు
- ప్రకటనలకే పరిమితమైన సూర్యాపేటలో బీసీ గర్జన, నల్లగొండలో భారీ బహిరంగసభ
- ముందుగా ప్రకటించడం, ఆ తర్వాత హైకమాండ్‌ను సంప్రదించడమే కారణమంటున్న నేతలు



- ఉద్యమాల పురిటిగడ్డ సూర్యాపేటలో బీసీ గర్జన సభ పెడతాం. సిద్ధరామయ్యను పిలుస్తాం. అక్కడే బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తాం: సీఎల్పీ నేత భట్టి పాదయాత్ర సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటన.
- నల్లగొండలో త్వరలోనే భారీ బహిరంగ సభ.. ప్రియాంక లేదా రాహుల్ వస్తారు. ఆ తర్వాత ఖమ్మంలో భారీ సభ ఉంటుంది: భట్టి యాత్ర సమయంలోనే ఇంకో ప్రకటన.
- రాహుల్ ఖమ్మం వచ్చారు.. కొల్లాపూర్‌కు ప్రియాంక వస్తారు.. జూలై 20న ఖాయంగా వస్తారు.. కాదు కాదు 30న రావచ్చు... లేదు లేదు ఆగస్టు మొదటి వారంలో తప్పకుండా వస్తారు: మాజీ మంత్రి జూపల్లి పార్టీలో చేరిక కోసం కాంగ్రెస్ నేతలు పలు సందర్భాల్లో చేసిన ప్రకటనలు.
- ఎన్నికలలోపు ఆరు భారీ సభలు నిర్వహిస్తాం. ఒకటి లేదా రెండు సభలకు రాహుల్ వస్తారు. ఒక సభకు ప్రియాంక, మరో సభకు ఖర్గే, ఇంకో సభకు సిద్ధరామయ్య వస్తారు: పీఏసీ సమావేశం అనంతరం చేసిన భారీ ప్రకటన.
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే 18వ తేదీన వస్తారు. అక్కడ పేదలకు మేలు చేసే డిక్లరేషన్ చేస్తాం: మాజీ మంత్రి చంద్రశేఖర్‌ను కలిసిన సందర్భంగా టీపీసీసీ చీఫ్ రేవంత్
- చేవెళ్ల సభకు ముఖ్య అతిథిగా ఖర్గే వస్తారు. సమయం లేదు కాబట్టి 18న సభ వాయిదా వేశాం. త్వరలోనే తేదీ ప్రకటిస్తాం: మంగళవారం గాంధీభవన్ నుంచి మీడియాకు అందిన అధికారిక సమాచారం.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పార్టీ అగ్రనేతల సభలు, సమావేశాల గురించి దాదాపు రెండు నెలల సమయంలో కాంగ్రెస్ పార్టీ తరఫున అధికారికంగా, అనధికారికంగా వెలువడిన ప్రకటనలు, మీడియాకు ఇచ్చిన లీకుల పర్వం ఇది. ఎంతో ఆర్భాటంగా ప్రకటనలైతే వెలువడుతున్నాయి కానీ..ప్రకటించిన విధంగా అగ్రనేతలతో బహిరంగ సభలు నిర్వహణలో మాత్రం పార్టీ విఫలమవుతోంది. బహిరంగ సభలను ప్రకటించడం, ఆ తర్వాత తేలిగ్గా వాయిదా వేసేయడం రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి రివాజుగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సభల వాయిదాల పర్వంపై పార్టీ శ్రేణుల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

ఎందుకీ వాయిదాలు

సూర్యాపేటలో మొదలై నల్లగొండ వరకు వచ్చి ఆ తర్వాత కొల్లాపూర్ మీదుగా జహీరాబాద్ వెళ్లి అక్కడి నుంచి చేవెళ్లకు వచ్చిన కాంగ్రెస్ బహిరంగ సభల 'వాయిదా రైలు' ఎక్కడ ఆగుతుంది? అసలు ఏ స్టేషన్‌లోనూ ఈ రైలు ఎందుకు ఆగడం లేదన్నది ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణుల్లో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. అయితే అధిష్టానానికి, హాజరు కావాల్సిన అగ్ర నేతలకు సమాచారం ఇవ్వకుండా, వారి అంగీకారం తీసుకోకుండానే ఎడాపెడా ప్రకటనలు చేసేయడం, ఆ తర్వాత ఫలానా తేదీన తమకు సమయం ఇవ్వాలంటూ పీసీసీ, సీఎల్పీల నుంచి పార్టీ హైకమాండ్‌కు లేఖలు రాయడం, అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో ఢిల్లీ వెళ్లి మాట్లాడే ప్రయత్నం చేయడం, అయినా వీలు కాక పోవడంతో చివరకు వాయిదా వేయడం జరుగుతోందని పార్టీ నేతలు కొందరు చెబుతున్నారు. పార్టీ రాష్ట్ర నాయకుల టేకిటీజీ వ్యవహారశైలితో పాటు పార్టీ అధిష్టానం తాము ఏం చెప్పినా వింటుందనే అతి భరోసాతోనే ఇదంతా జరుగుతోందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. 'ఎక్కడ సభ ఏర్పాటు చేయాలన్నా ముందస్తు ప్రణాళిక ఉండాలి. ఫలానా చోట సభ పెట్టాలనుకున్నప్పుడు అక్కడి నాయకత్వంతో చర్చలు జరపాలి. సదరు ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలకు సమాచారమిచ్చి వారితో మాట్లాడి వారి సమ్మతి తీసుకోవాలి. తర్వాత అధిష్టానానికి సమాచారం పంపి వారి అంగీకారం తీసుకుని ప్రకటన చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. సభ నిర్వహణ అంటే మామూలు విషయం కాదు కదా? అన్ని రకాలుగా పార్టీ నేతలను, కేడర్‌ను సిద్ధం చేయాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం పార్టీలో ఆ ధోరణి ఇసుమంతైనా కనిపించడం లేదు..'అని టీపీసీసీ ముఖ్య నేత ఒకరు వ్యాఖ్యానించడం పార్టీలో కొనసాగుతున్న గందరగోళానికి అద్దం పడుతోంది.

చేవెళ్లలోనైనా జరుగుతుందా?

ఈ నెల 18వ తేదీన జహీరాబాద్‌లో ఖర్గే సభను రద్దు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ వేదికను చేవెళ్లకు మార్చింది. చేవెళ్లలో సభ నిర్వహణ కోసం ఆ నియోజకవర్గ నేతలతో రాష్ట్ర ఇన్‌చార్జి ఠాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిలు మంగళవారం సమావేశమయ్యారని గాంధీ భవన్ వర్గాలు వెల్లడించాయి. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే వస్తారని, 24న సభ జరిగే అవకాశం ఉందని, త్వరలోనే తేదీని ప్రకటిస్తామని తెలిపాయి. మరి చేవెళ్లలో అయినా కాంగ్రెస్ సభ వాయిదా పడకుండా జరుగుతుందో లేదో వేచి చూడాల్సిందే.

వారసులు రెడీ

▶ మొదటి పేజీ తరువాయి

గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి భావిస్తున్న నేపథ్యంలో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

లోక్‌సభకు తలసాని..!

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మరో మూడు నెలల్లోనే లోక్‌సభ ఎన్నికలు తెరమీదకు రానున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికలకు అనుసరించే వ్యూహం ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికపై కొంత మేర ప్రభావం చూపే అవకాశం కన్పిస్తోంది. కొందరు వారసులకు అసెంబ్లీ టికెట్లు దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు సాయికిరణ్ సికింద్రాబాద్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి గట్టి పోటీనిచ్చేందుకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను లోక్‌సభ అభ్యర్థిగా పంపే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. ఆయన స్థానంలో సాయికిరణ్ సనత్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బరిలోకి దిగే అవకాశముంది. ఇదే తరహాలో గతంలో మల్కాజిగిరి ఎంపీగా పనిచేసిన మంత్రి మల్లారెడ్డిని మరోమారు లోక్‌సభకు పోటీ చేయించాలని సీఎం భావిస్తున్నారు. 2019లో మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసిన ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి మేడ్చల్ సీటు కేటాయిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

జోరుగా పర్యటనలు

పలువురు ఎమ్మెల్యేల కుమారులు, ఇతర కుటుంబ సభ్యులు ఇప్పటికే క్రియాశీల రాజకీయాల్లో ఉంటూ వేర్వేరు పదవుల్లో కొనసాగుతున్నారు. ఆర్మూర్, నిర్మల్, పటాన్‌చెరు, తాండూరు, నిజామాబాద్ అర్బన్, చేవెళ్ల, షాద్‌నగర్ ఎమ్మెల్యేల కుటుంబసభ్యులు నియోజకవర్గ స్థాయిలో కీలకంగా పనిచేస్తున్నారు. అవకాశం చిక్కితే అసెంబ్లీ ఎన్నికల బరిలోకి అడుగు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కుమారుడు రోహిత్‌రావు మెదక్ టికెట్‌ను ఆశిస్తూ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. రోహిత్‌కు కూడా టికెట్ ఇవ్వాలని మైనంపల్లి కోరుతున్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్‌రావు, మంత్రి సబితా ఇంద్రారెడ్డి (మహేశ్వరం) కుమారుడు కార్తీక్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా పరిధిలో ముఠా గోపాల్ (ముషీరాబాద్) కుమారుడు ముఠా జయసింహ కూడా అసెంబ్లీపై కన్నేసినట్టు తెలుస్తోంది.
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎమ్మెల్యే జోగు రామన్న కుమారుడు జోగు ప్రేమేందర్ మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోదరుడు కోనేరు క్రిష్ణ ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. వీరితో పాటు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కుమారుడు వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కుమారుడు విజిత్ రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ భర్త శ్యాం నాయక్ టికెట్ ఆశిస్తున్న వారి జాబితాలో ఉన్నారు.
- ఉమ్మడి ఖమ్మం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావు కుమారులు రామకృష్ణ, రాఘవేంద్ర, భద్రాచలం నియోజకవర్గం ఇన్‌చార్జి తెల్లం వెంకట్‌రావు సోదరి తెల్లం సీతమ్మ (జెడ్పీటీసీ) కూడా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతూ అవకాశం కోసం చూస్తున్నారు.
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు.. కుమారుడు డాక్టర్ సంజయ్‌కు టికెట్ ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. మంథనిలో పెద్దపల్లి మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధు భార్య పుట్ట శైలజ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు.
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ) కుమారుడు భాస్కర్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ (నిజామాబాద్ రూరల్) కుమారుడు జగన్‌మోహన్ (దర్పల్లి జెడ్పీటీసీ), హనుమంతు షిండే (జుక్కల్) కుమారుడు హరీశ్ కుమార్ షిండే, గంప గోవర్దన్ (కామారెడ్డి) కుమారుడు శశాంక్ టికెట్ ఆశిస్తున్న వారసుల జాబితాలో ఉన్నారు. తనకు విశ్రాంతి ఇచ్చి కుమారుడికి టికెట్ ఇవ్వాలని బాజిరెడ్డి విజ్ఞప్తి చేస్తున్నారు.
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో గండ్ర వెంకటరమణారెడ్డి (భూపాలపల్లి) సతీమణి గండ్ర జ్యోతి (జిల్లా పరిషత్ చైర్‌పర్సన్), డీఎస్ రెడ్యా నాయక్ (డోర్నకల్) కుమారుడు డీఎస్ రవిచంద్ర, కుమార్తె కవిత మాలోత్ (మహబూబాబాద్ ఎంపీ) ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నారు.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బండ్ల క్రిష్ణమోహన్ రెడ్డి (గద్వాల) సతీమణి జ్యోతి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి (మక్తల్) సతీమణి సుచరిత, పోతుగంటి రాములు (నాగర్‌కర్నూల్ ఎంపీ) కుమారుడు భరత్,, వీఎం అబ్రహం (అలంపూర్) కుమారుడు వీఎం అజయ్ క్రియాశీల రాజకీయాల్లో ఇప్పటికే నియోజకవర్గాల్లో చక్రం తిప్పుతున్నారు.
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డితో పాటు ఎన్.భాస్కర్‌రావు (మిర్యాలగూడ) కుమారుడు సిద్ధార్థ్, కంచర్ల భూపాల్‌రెడ్డి (నల్లగొండ) సోదరుడు క్రిష్ణారెడ్డి ఆశావహుల జాబితాలో ఉన్నారు.

ఓటమి భయంతోనే కేసీఆర్ రైతు రుణమాఫీ

- రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డ కేసీఆర్ కుటుంబం
- ఆయన ఏది చేసినా ప్రజలు నమ్మరు.. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోంది
- తిరగబడదాం... తరిమికొడదాం నినాదంతో ప్రజల్లోకి వెళదాం
- గాంధీభవన్‌లో స్వాతంత్య్ర దిన వేడుకల్లో రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు రైతు రుణమాఫీ అమలు చేస్తున్నట్టు ప్రకటించారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి విమర్శించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం గాంధీ భవన్‌లో జాతీయజెండా ఆవిష్కరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి పార్టీశ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కేసీఆర్ కుటుంబం రూ.లక్షకోట్ల అవినీతికి పాల్పడిందని, 10వేల ఎకరాలు దోచుకుందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హడావుడిగా అమ్మిన భూములపై అధికారంలోకి వచ్చాక సమీక్షిస్తామన్నారు. ఆరోగ్యశ్రీని సీఎం నిర్వీర్యం చేశారని, రాష్ట్రంలో గడిచిన 9 ఏళ్లలో నోటిఫికేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని, ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. 'తిరగబడదాం..తరిమికొడదాం'నినాదంతో ప్రతీ గడపకూ వెళ్లి.. ప్రతీ తలుపు తట్టి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశంలో విభజించు–పాలించు విధానాన్ని బ్రిటిష్ జనతా పార్టీ (బీజేపీ) అవలంభిస్తోందని రేవంత్ విమర్శించారు. విద్వేషాన్ని వీడాలని భారత్ జోడోయాత్రతో రాహుల్ గాంధీ స్ఫూర్తి నింపారన్నారు. మొదటి ప్రధాని నెహ్రూ నుంచి మన్మోహన్ వరకు 60 ఏళ్లలో చేసిన అప్పుకంటే ఎనిమిదేళ్లలో మోదీ రెండింతలు ఎక్కువ అప్పు చేశారని చెప్పారు.

దేవుడిచ్చిన అన్నను అడగాల్సింది

ఎస్సీల వర్గీకరణలో కాంగ్రెస్ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదన్న రేవంత్



గాంధీభవన్‌లో జెండా వందనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు, మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, పొంగులేటి, అంజన్‌కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీల వర్గీకరణ విషయంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పరోక్షంగా చురకలంటించారు. సోమవా రం గాంధీభవన్‌కు వచ్చిన సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణకు మద్దతు ఇస్తేనే కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామని చెప్పారు. ఈ వ్యాఖ్యలకు రేవంత్‌రెడ్డి స్పందించారు. గాంధీభవన్‌లో జాతీయ పతాకావిష్కరణ అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని ఎవరూ శంకించాల్సిన పనిలేదన్నారు. ఒకరికి మద్దతు ప్రకటించి మరొకరిని మద్దతు అడిగితే ఎలా అని ప్రశ్నించారు. 'ఆయనకు కిషన్‌రెడ్డి దేవుడిచ్చిన అన్న కదా? ఆయన్ను ఎందుకు అడగడం లేదు? వర్గీకరణపై రాహుల్‌గాంధీ కూడా చాలా స్పష్టంగా చెప్పారు. ఈ విషయంలో ఎవరి వకాల్తాలు మాకు అవసరం లేదు. ఎవరి బెదిరింపులకూ భయపడేది లేదు. వారు ఎవరికి మద్దతు ప్రకటించారో వారినే అడిగితే మంచిది.'అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అంటే ఏంటో రాష్ట్రంలోని దళిత సామాజిక వర్గ ప్రజలకు బాగా తెలుసునని చెప్పిన రేవంత్ అధికారంలో ఉన్న వారిని, పార్లమెంటులో మాట్లాడాల్సిన వారిని అడిగి నిలదీస్తే కొంతైనా గౌరవం దక్కుతుందని కృష్ణ మాదిగను ఎద్దేవా చేశారు.

ఈ పాపం ఎవరిది?

మట్టిలో మాణిక్యం లాంటి గగులోతు రాజ్‌కుమార్ ఆత్మహత్య పాపం ఎవరిదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన యువకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య ఘటనపై ఆయన మంగళవారం ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'ఉపాధి లేదు. ఉద్యోగం రాదు. పోటీ పరీక్ష రాస్తే ప్రశ్నపత్రం లీకేజీలు. తెలంగాణలో లక్షలాది మందికి ఉద్యోగాలు ఇస్తున్నామని ఊకదంపుడు ప్రకటనలు చేసే కేటీఆర్ దీనికి సమాధానం చెప్పాలి.'అని రేవంత్ ట్వీట్ చేశారు.

అట్రాసిటీ కేసుపై ఎన్‌సీఎస్సీ సత్వర స్పందన

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్లకు ఆదేశాలు
- వారం రోజుల్లోగా ఏటీఆర్ సమర్పించాలని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: మలక్‌పేట సమీపంలోని ముసారాంబాగ్‌కు చెందిన సోలంకి విజయ్‌కుమార్‌పై దాడి, అనంతరం ఆయన ఆత్మహత్య చేసుకున్న ఘటనపై షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్(ఎన్‌సీఎస్సీ) వేగంగా స్పందించింది. ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ(పీవోఏ) చట్టం కింద సమర్పించిన ఫిర్యాదుపై స్పందించిన ఎన్‌సీఎస్సీ వైస్ చైర్మన్ అరుణ్ హల్దార్ ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని విచారించారు. ఈ సందర్భంగా కమిషన్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్‌కు పలు లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేసింది. విజయ్‌కుమార్ కుటుంబానికి తక్షణమే మూడు నెలల రేషన్ సరుకులు అందించాలి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అందించాల్సిన పరిహారంలో మొదటి విడత కింద రూ.4,12,500 సాయాన్ని ఇవ్వాలి. విజయ్‌కుమార్ భార్యకు నెలకు రూ.5 వేల చొప్పున పెన్షన్, ఆమోదయోగ్యమైన భత్యం ఇవ్వాలి. ఆ కుటుంబానికి ఉపాధి కల్పించాలి. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలి.'' అని సోలంకి విజయ్‌కుమార్ పిల్లలకు పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సు వరకు ఉచితంగా విద్య, ఆరోగ్య భద్రత కల్పించాలంది. ఈ మేరకు ఎన్‌సీఎస్సీ సంచాలకులు జి.సునీల్‌కుమార్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అంశంపై తీసుకున్న చర్యలను వారంలోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్ రూపంలో సమర్పించాలని స్పష్టం చేశారు.

జాతీయ కమిషన్ దృష్టికి మరిన్ని ఘటనలు

రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలను క్రమంగా ఎన్‌సీఎస్సీకి వివరిస్తామని తెలిపారు.

మమ్మల్ని 'ఎర్ర డైరీ'లో ఎక్కిస్తే, | ప్రజలు మిమ్మల్ని 'నల్ల డైరీ'ల్లో ఎక్కిస్తారు'

టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి పోలీసులనుద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలపై పోలీస్ అధికారుల సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'రేవంత్‌రెడ్డిగారూ.. మమ్మల్ని మీరు 'ఎర్ర డైరీ'లో ఎక్కిస్తే, ప్రజలు మిమ్మల్ని 'నల్ల డైరీ'ల్లో ఎక్కిస్తారు' అంటూ ఆ సంఘం అధ్యక్షుడు వై.గోపిరెడ్డి హెచ్చరించారు. దీనిపై ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'పోలీసు వ్యవస్థ ప్రభుత్వంలో అంతర్భాగం. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నడుచుకుంటూ శాంతిభద్రతలను కాపాడుతుంది. పోలీసులు తమ విధులను చేసుకోనీయకుండా 'తదుపరి ప్రభుత్వం మాదేనని, మీ సంగతి చూస్తామని' బెదిరించడం ఏమి రాజనీతి?. 'రెడ్ డైరీ' ఏమిటి? అదేమన్నా మీ సొంత రాజ్యాంగమా? మాకు కూడా డైరీలు ఉంటాయి. ముఖ్యంగా ప్రజలకు కూడా డైరీలు ఉంటాయి. వారి డైరీలో ఎక్కితే చీకట్లోకి పోయినట్టే. బాధ్యత కలిగిన పదవిలో ఉండి ఇలాంటి అసభ్యకరమైన, చట్టవ్యతిరేక వ్యాఖ్యలు చేయడం తగదు'అని పేర్కొన్నారు. 'మీరు పోలీసు వ్యవస్థకు ఎన్నడూ మేలు చేయకపోగా, మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోం. మీ అసభ్యకర వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని పోలీసు వ్యవస్థకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే చట్టపరమైన చర్యలకు మేము ఉపక్రమిస్తాం'అని పేర్కొన్నారు.

వివాదాస్పదమైన రేవంత్ వ్యాఖ్యలు.. కేసులు

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి పోలీసులపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కొందరు నాయకులు గాంధీభవన్ వేదికగా సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ నాయకులపై అక్రమంగా పోలీసు కేసులు పెట్టించారని, వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు వీపు చింతపండు చేస్తామని హెచ్చరించారు. ఇంకా పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతూ ''మహబూబ్‌నగర్ పోలీసులకు నేను చెప్పదలుచుకున్నా. రెడ్ డైరీలో మీ పేర్లు రాసి పెడతం. 100 రోజుల తర్వాత వచ్చినాక ఒక్కొక్కని గుడ్డలిప్పదీస్తం. అసలు మిత్తితోని చెల్లిస్తం'అంటూ ఘాటు హెచ్చరికలు చేశారు. ఈ వ్యాఖ్యలపై రాష్ట్రంలోని పలు పోలీస్‌స్టేషన్లలో పోలీసు సంఘం అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు.

“నువ్వు మరొకరి కోసం దీపాన్ని వెలిగిస్తే, అది నీ దారినీ కాంతిమంతం చేస్తుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 16 ఆగస్టు 2023

ప్రక్షాళన అవసరమే కానీ...

ఎప్పుడో 19వ శతాబ్దంలో తొలిసారిగా చట్టంగా రూపుదాల్చిన భారత నేరసంహితను సమూలంగా మార్చేందుకు ఒక అడుగు ముందుకు పడింది. భారత క్రిమినల్ న్యాయ వ్యవస్థను మారుస్తూ, కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 11న లోక్‌సభలో మూడు కొత్త బిల్లుల్ని ప్రవేశపెట్టింది. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) –1860 స్థానంలో ‘భారతీయ న్యాయ సంహిత’, తొలిసారిగా 1898లో చట్టమై ఆనక కొద్దిగా మార్పులు జరిగిన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) – 1973 బదులు ‘భారతీయ నాగరిక్ సురక్షా సంహిత’, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ – 1872 స్థానంలో ‘భారతీయ సాక్ష్య బిల్లు’ రానున్నాయి. మధ్యలో కొద్ది మినహా గణనీయమైన మార్పులేమీ చేయని భారత సర్కార్ 160 ఏళ్ళ పైచిలుకు క్రితం బ్రిటీషు వారి చట్టాలను సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా మార్చాలను కోవడం సహేతుకమే. అయితే, కొత్త బిల్లుల్ని తీసుకొచ్చే ముందు న్యాయనిపుణులతో, ప్రతిపక్షాలతో ఎంత లోతుగా చర్చించారు? ఇది ప్రశ్నార్థకం. ఈ పరిస్థితుల్లో 3 బిల్లుల్నీ సమీక్షించి, సిఫార్సులు చేయడానికి ప్రభుత్వం వాటిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి పంపడం స్వాగతనీయం.

బిల్లుల్లోని అంశాలపై ప్రజలతో సంప్రతింపులు జరిపి, సిఫార్సులు చేసేందుకు కరోనా కాలంలో 2020 మేలో ప్రభుత్వం నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఆ సంప్రతింపుల ప్రక్రియ విధి విధానాలు అయోమయమే. వచ్చిన అభ్యర్థనల్ని పరిశీలించి, విశ్లేషించడానికి సదరు నిపుణుల సంఘం ఏ పద్ధతిని అనుసరించిందీ తెలీదు. ఆ నిపుణుల సంఘం ప్రభుత్వానికి ఇచ్చిన సిఫార్సుల్ని ప్రజాక్షేత్రంలో పెట్టనేలేదు. వచ్చిన సిఫార్సులకూ, ప్రభుత్వం బిల్లుల్లో పెట్టిన అంశాలకూ పొంతన ఉండివుండదని కూడా నిపుణుల మాట. ఇన్ని లోపాలున్నాయి గనకే కొత్త బిల్లుల సామర్థ్యం సందేహాస్పదం. బ్రిటీషు పాలనా అవశేషాలను తొలగించడమే ధ్యేయమంటూ మోదీ సర్కార్ చెబుతున్న మాటలకూ, కొత్త చట్టాల్లో నిజంగా ఉన్న అంశాలకూ మధ్య ఎంత పొంతన ఉందో చెప్పలేం. క్రిమినల్ న్యాయ వ్యవస్థకు ఈ ప్రక్షాళన సర్వరోగ నివారిణి అంటున్నా అదీ అనుమానమే. ఎందుకంటే, పాత చట్టాల్లోని అనేక అంశాలు యథాతథంగా ఈ కొత్త బిల్లుల్లోనూ చోటుచేసుకున్నాయి. కొన్ని మార్పులు ప్రతిపాదించారు కానీ, అవి వ్యవస్థలోని సంక్షోభంపై ఏ మేరకు ప్రభావం చూపుతాయో చెప్పలేం. పైపెచ్చు, కొత్త బిల్లులు ప్రతిపాదించిన కొన్ని మార్పులు ఆందోళన రేపుతున్నాయి.

పాత రాజద్రోహ చట్టాన్ని తొలగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. నిజానికి, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులపై తరచూ దుర్వినియోగమవుతున్న ఈ చట్టానికి గత ఏడాది మేలోనే సుప్రీమ్ కోర్ట్ అడ్డుకట్ట వేసి, సమీక్షను పెండింగ్‌లో పెట్టింది. లా కమిషన్ మాత్రం ఐపీసీలో రాజద్రోహానికి సంబంధించిన ‘సెక్షన్ 124ఏ’ను కొనసాగించాలనీ, శిక్షను పెంచాలనీ రెండునెలల క్రితం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆ సెక్షన్‌ను తొలగించాలని సర్కార్ నిర్ణయించడం ఆశ్చర్యమే. లార్డ్ మెకాలే 1837లో రూపకల్పన చేయగా, 1862లో అమలులోకి వచ్చిన ఐపీసీలో రాజద్రోహ చట్టం లేదు. 1870లో దాన్ని చేర్చి, స్వాతంత్య్ర సమరాన్ని అణిచేసేందుకు విస్తృతంగా వినియోగించారు. 1898లో పరిధిని విస్తరించారు. స్వాతంత్య్రం వచ్చాకా ఈ చట్టం కొనసాగుతూ వచ్చింది. దాని రాజ్యాంగబద్ధతపై కోర్టులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. కొత్త బిల్లులో రాజద్రోహమనే పేరు తొలగించినా, సార్వభౌమాధికారానికి హానికారక చర్యలు శిక్షార్హమంటూ కొత్త మాట తగిలించారు. ఏ చర్యలు ఈ నేరమనేది స్పష్టత లేనందున పోలీసుల ఇష్టారాజ్యపు అరెస్టులకు అధికారం దఖలు పడుతోంది. అలాగే, ఇప్పటి దాకా ఐపీసీలో లేని వ్యవస్థీకృత నేరం, తీవ్రవాద నేరాలు, మూకదాడి లాంటివీ కొత్తగా చేర్చారు. వివాదాస్పద ‘ఉపా’ చట్టం నుంచి తీసుకున్నవీ ఇందులో ఉండడం విషాదం.

అలాగే, సీఆర్‌పీసీ కింద అరెస్టయిన వ్యక్తిని గరిష్ఠంగా 15 రోజులే పోలీస్ కస్టడీలో ఉంచవచ్చు. కొత్త చట్టంలో చేసిన నేరాన్ని బట్టి 60 నుంచి 90 రోజుల దాకా కస్టడీని పొడిగించవచ్చు. ఇదీ దుర్వినియోగమయ్యే ముప్పుంది. అయితే ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఎఫ్ఐఆర్ నమోదు అవకాశమివ్వడం, పోలీసు సోదా – స్వాధీనాల వేళ తప్పనిసరి వీడియో రికార్డింగ్ లాంటివి బాధితుల హక్కుల్ని కాపాడతాయి. ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాల్ని వినియోగిస్తూ, ఫోరెన్సిక్స్‌కు పెద్ద పీట వేయడం బాగానే ఉన్నా, ఆ సాక్ష్యాల సేకరణ, విశ్లేషణ, వాటిని కోర్టుల్లో వినియోగించే తీరుపై స్పష్టత లేదు. విచారణతోనే జైళ్ళలో మగ్గుతున్న జనం, క్రిక్కిరిసిన జైళ్ళ లాంటి దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దిశగా ఆలోచించ లేదు. బెయిల్ నిర్ణయంలో చేపట్టాల్సిన సంస్కరణల్ని పట్టించుకోలేదు.

ప్రస్తుతం మన కోర్టుల్లో 4.7 కోట్లపైగా కేసులు పెండింగ్‌లో ఉంటే, మూడింట రెండొంతులు క్రిమినల్ కేసులే. క్రిమినల్ న్యాయవ్యవస్థలో సంస్కరణలపై జస్టిస్ మలిమత్ కమిటీ తన నివేదికను సమర్పించి రెండు దశాబ్దాలు దాటింది. 2007లో మాధవ్ మీనన్ కమిటీ సహా అనేకం వచ్చాయి. చివరకిప్పుడు రథం కదిలింది. కానీ, ఇంగ్లీష్ పేర్లు తీసేసి సంస్కృత, హిందీ పేర్లు పెట్టి, కొత్త సీసాలో పాత సారా నింపితే లాభం లేదు. దశాబ్దాల తర్వాతి ఈ ప్రయత్నమూ చిత్తశుద్ధి లోపించి, అసంతృప్తినే మిగిలిస్తే అంతకన్నా అన్యాయం లేదు. కొత్త చట్టాలకు సర్కార్ మరింత కసరత్తు చేయాలి. పార్లమెంట్‌లో క్షుణ్ణంగా చర్చించాలి. నేరన్యాయ వ్యవస్థలో సంస్కరణలు అవసరమే కానీ, వట్టి చట్టాలు మారిస్తే సరిపోదు. వ్యవస్థకూ, పౌరులకూ మధ్య బంధంలో మార్పు తేవాలి. అప్పుడే వలసవాద వాసనలు వదులుతాయి. అలాకాక ఎన్నేళ్ళయినా పాత పాలకులనే నిందించడం అసమంజసం. అది ఇన్నేళ్ళ సొంత తప్పుల్ని కాలమనే తివాచీ కిందకు నెట్టేసే విఫలయత్నమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** అమావాస్య ప.1.50 వరకు, తదుపరి నిజశ్రావణ శు.పాడ్యమి, **నక్షత్రం:** ఆశ్లేష సా.4.55 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.11.40 నుండి 12.28 వరకు, **అమృత ఘడియలు:** ప.3.04 నుండి 4.56 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం: 6.22
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

అడవులను సరిగ్గానే పెంచుతున్నామా?

విశ్లేషణ



ధనపాల్ గోవిందరాజులు

దాదాపు 200 సంవత్సరాలకు పైగా భారతదేశం చెట్ల పెంపకంపై ప్రయోగాలు చేసింది. అడవులను పునరుద్ధరించే వివిధ విధానాలు... అవి స్థానిక సమాజాలపై, విస్తృత పర్యావరణంపై చూపే పరిణామాల గురించి మన దేశం ముఖ్యమైన పాఠాలను అందిస్తోంది. అందుకే గత తప్పిదాలు పునరావృతం కాకుండా అటవీశాఖాధికారులు చూసుకోవాలి. చెట్లను నాటడం అనగానే కచ్చితంగా అడవిని పునరుద్ధరించినట్టు అర్థం కాదు. చెట్ల కొరత ఉన్న పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం కూడా ముఖ్యం. పై నుండి అటవీ పందిరిని చూసి మురవడం కంటే కూడా దానివల్ల పర్యావరణం, స్థానిక ప్రజలకు జరుగుతున్న ప్రయోజనాలను నిర్ణయించడం విజయానికి మరింత సహాయ ప్రమాణంగా ఉంటుంది.

అడవులను తమకు తాముగా పునరుత్పత్తి చేసుకునేలా చేయడం అనేది, వాతావరణంలో భూమిని వేడెక్కించే కార్బన్‌ను తగ్గించడం కోసం చేసే ఒక వ్యూహంగా ఉంటోంది. అదే సమయంలో జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థలు అందించే ప్రయోజనాలతోపాటు జీవనోపాధికి చెందిన ఫలవంతమైనదాన్ని కూడా అవి పెంచుతూ వచ్చాయి.

కానీ వాతావరణ మార్పును పరిమితం చేసే ఉద్దేశంతో చెట్ల విస్తృతిని పెంచే ప్రయత్నాలు చివరకు వేగంగా పెరిగే ఉద్యానవనాలను నిర్మించడం వైపు మొగ్గు చూపాయి.

పొలాలు, బంజరు భూముల్లో తోటలను పెంచితే అవి కలపను, వంటచెరుకును అందించగలవు. ఇవి సహజ అడవులపై ఒత్తిడిని తగ్గించి, వాటి పునరుత్పత్తికి సహాయపడతాయి. కానీ సరైన రీతిలో జరగని చెట్ల పెంపకం తొలగించలేని జాతులను పెంచుతుంది. అవి ప్రజలను తమ భూమికి దూరమయ్యేట్టు చేస్తాయి.

దాదాపు 200 సంవత్సరాలకు పైగా భారతదేశం చెట్ల పెంపకంపై ప్రయోగాలు చేసింది. అడవులను పునరుద్ధరించడంలో వివిధ విధానాలు... అవి స్థానిక సమాజాలపై, విస్తృత పర్యావరణంపై చూపే పరిణామాల గురించి మన దేశం ముఖ్యమైన పాఠాలను అందిస్తోంది. గత తప్పిదాలు పునరావృతం కాకుండా నిరోధించడానికి, ఈ అరుదైన దీర్ఘకాలిక దృక్పథాన్ని నేడు అటవీశాఖాధికారులు గమనించాలి.

దురాక్రమణ చెట్లు

18వ శతాబ్దం మధ్యకాలం నుండి ఈస్ట్ ఇండియా కంపెనీ ద్వారా మన దేశానికి చెందిన అనేక వ్యవహారాలను బ్రిటన్ నియంత్రించింది. 1857 నుండి 1947 మధ్య బ్రిటిష్ రాణి నేరుగా దేశాన్ని పాలించింది.

భారతదేశం నుండి కొల్లగొట్టిన పత్తి, రబ్బరు, తేయాకును రవాణా చేయడం కోసం, బ్రిటన్‌కు రైల్వే స్లీపర్‌లను వేయడానికి, ఓడలను నిర్మించడానికి పెద్ద మొత్తంలో కలప అవసరమైంది. 1865 భారత అటవీ చట్టం ద్వారా, టేకు, సాల్, దేవదారు వంటి అధిక దిగుబడినిచ్చే కలప చెట్లతో కూడిన అడవులను ప్రభుత్వం ఆస్తిగా మార్చుకొంది.

ఈ అడవుల్లో ఈ కలప దిగుబడిని అధికం చేసేందుకు బ్రిటిష్ వలసపాలనాధికారులు గడ్డి, వెదురు కంటే మించిన రకాలను వేయకుండా స్థానిక ప్రజల హక్కులపై పరిమితులను విధించారు. ఆఖరికి పశువుల మేతపై కూడా ఆంక్షలు విధించారు. దీంతో భారతీయ సమాజాలు కొన్నిసార్లు అడవులను తగలబెట్టడం ద్వారా ప్రతీకారం తీర్చుకున్నాయి.

ఈలోగా వేడి, తేమతో కూడిన భారతదేశ వాతావరణానికి బాగా అలవాటుపడిన, మన్నికైన, ఆకర్షణీయమైన కలపకు మూలమైన టేకు తోటలు (టెక్టోనా గ్రాండిస్) దూకుడుగా వ్యాపించాయి. దాంతో సహజమైన గడ్డి భూములు, పొదలతో కూడిన అడవులు ఏకరూప టేకు పంటలకు దారితీశాయి.



భారతదేశంలో లేని యూకలిప్టస్, ఇతర అన్యదేశ చెట్లను సుమారు 1790 నుండి బ్రిటిష్‌వాళ్లు పరిచయం చేశారు. ఐరోపా, ఉత్తర అమెరికా నుండి తెచ్చిన దేవదారు చెట్లను హిమాలయ ప్రాంతంలో జిగురు కోసం; ఆస్ట్రేలియా నుండి తెచ్చిన అకేసియా చెట్లను కలప, మేత కోసం నాటారు. ఈ జాతులలో ఒకటైన, ‘వాటిల్’ (అకేసియా మియర్న్‌సి– ఒక తుమ్మ రకం)ని 1861లో కొన్ని లక్షల మొక్కలతో పశ్చిమ కనుమలలోని నీలగిరి జిల్లాలో ప్రవేశపెట్టారు. వాటిల్ అప్పటి నుండి ఆక్రమించే మొక్కగా మారి, ఈ ప్రాంతంలోని గడ్డి భూములను స్వాధీనం చేసుకుంది. అదేవిధంగా, దేవదారు హిమాలయాలలో చాలావరకు వ్యాపించి, స్థానిక ఓక్(సిందూర) చెట్లను స్థానభ్రంశం చేసింది. మధ్య భారతదేశంలోని స్థానిక గట్టి చెక్క అయిన సాల్ స్థానంలోకి టేకు వచ్చింది. ఓక్, సాల్ రెండూ ఇంధనం, మేత, ఎరువులు, ఔషధం, నూనె కోసం విలువైనవి. వీటినీ, మేత భూమినీ కోల్పోవడం చాలా మందిని పేదలుగా మార్చింది.

ఏవి పనికొస్తాయి?

‘బాన్ ఛాలెంజ్’ కింద 2030 నాటికి సుమారు 2.1 కోట్ల హెక్టార్ల అడవులను పునరుద్ధరిస్తామని భారతదేశం ప్రతిజ్ఞ చేసింది. భారత ప్రభుత్వం, ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) 2018లో విడుదల చేసిన ప్రోగ్రెస్ రిపోర్టులో దాదాపు ఒక కోటి హెక్టార్ల మేరకు అడవులు పునరుద్ధరణలో ఉన్నాయని పేర్కొన్నారు.

చెట్లతో కప్పబడిన భూమి విస్తీర్ణాన్ని పెంచడంపై పెడుతున్న ఈ దృష్టి, భారత జాతీయ అటవీ విధానంలో ప్రతిఫలిస్తోంది. ఇది దేశంలోని 33 శాతం విస్తీర్ణంలో చెట్లను పెంచడాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఈ విధానంలోని పథకాలలో యూకలిప్టస్ లేదా వెదురు వంటి ఒకే జాతితో కూడిన తోటలు ఉంటాయి. ఇవి వేగంగా పెరుగుతాయి, చెట్లు కప్పే స్థలాన్ని త్వరగా పెంచుతాయి. కొన్నిసార్లు ఈ చెట్లను గడ్డి భూములు, చెట్ల వ్యాప్తి సహజంగా తక్కువగా ఉన్న ప్రాంతాలలో నాటారు. ఫలితంగా మేతకోసం, ఇతర ఉత్పత్తుల కోసం ఈ పర్యావరణ వ్యవస్థలపై ఆధారపడిన గ్రామీణ, స్థానిక ప్రజలకు హాని కలుగుతోంది. అన్యదేశ చెట్లను నిరంతరం నాటడం వల్ల 200 ఏళ్ల క్రితం వాటిల్ మాదిరిగానే కొత్త ఆక్రమణ జాతులు వచ్చే ప్రమాదం ఉంది.

దీనికి సంబంధించి సానుకూల కేస్ స్టడీస్ కూడా ఉన్నాయి. 2006 అటవీ హక్కుల చట్టం ఒకప్పుడు సాంప్రదాయ వినియోగంలో ఉన్న అటవీ ప్రాంతాలను నిర్వహించేందుకు గ్రామసభలకు అధికారం ఇచ్చింది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో అనేక గ్రామసభలు క్షీణించిన అడవులను పునరుద్ధరించాయి. పైగా వాటిని బీడీలు చుట్టడానికి ఉపయోగించే తునికి ఆకులకు స్థిరమైన వనరుగా మార్చాయి. అలాగే గుజరాత్ కచ్ గడ్డి భూముల్లో, 19వ శతాబ్దం చివరలో బ్రిటిష్ అటవీ అధికారులు ప్రవేశపెట్టిన ‘పిచ్చి చెట్లను’ తొలగించడం ద్వారా అక్కడి సమాజాలు గడ్డి భూములను పునరుద్ధరించగలిగాయి.

ప్రయోజనాలూ ముఖ్యమే!

అటవీ పునరుద్ధరణ ప్రయత్నాల విజయాన్ని చెట్ల విస్తృతితో మాత్రమే కొలవలేము. ‘అడవి’ గురించిన భారత ప్రభుత్వ నిర్వచనం ఇప్పటికీ ఏకరూప చెట్టు జాతులు, పళ్ల తోటలు, ఆఖరికి వెదురు (నిజానికి ఇది గడ్డి కుటుంబానికి చెందినది) లాంటిదానికి మాత్రమే పరిమితమై ఉంది. దీనర్థం ద్వైవార్షిక అటవీ సర్వేలు ఎంత సహజ అడవులను పునరుద్ధరించారో లెక్కించలేవు; స్థానిక చెట్లను పోటీ జాతులతో స్థానభ్రంశం చేయడం వల్ల కలిగిన పరిణామాలను తెలియజేయలేవు; అన్యదేశ చెట్లు మన సహజమైన గడ్డి భూములను ఎంత ఆక్రమించాయో గుర్తించలేవు. పైగా అవి పునరుద్ధరించిన అడవులుగా తప్పుగా నమోదు అవుతాయి.

సహజ అటవీ పునరుత్పత్తిని, అలాగే కలప, ఇంధనం కోసం చెట్ల పెంపకాన్ని రెండింటినీ ప్రోత్సహించాలి. అయితే ఇతర పర్యావరణ వ్యవస్థలు, ప్రజల మీద వీటి ప్రభావాన్ని తప్పక పరిశీలించాలి. నాటుతున్న రకాలు దురాక్రమించేవిగా మారకుండా జాగ్రత్తగా ఎంచుకోవడం దీంట్లో భాగం. అటవీ హక్కులు, స్థానిక జీవనోపాధి, జీవ వైవిధ్యం, కర్బన నిల్వలపై దాని ప్రభావాల పరంగా చెట్ల కవరేజిని పెంచడానికి సంబంధించిన లక్ష్యాన్ని అంచనా వేయాలి.

చెట్లను నాటడం అనగానే కచ్చితంగా అడవిని పునరుద్ధరించినట్టు అర్థం కాదు. చెట్ల కొరత ఉన్న పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం కూడా ముఖ్యం. పై నుండి అటవీ పందిరిని చూసి మురవడం కంటే దానివల్ల పర్యావరణం, స్థానిక ప్రజలకు జరుగుతున్న ప్రయోజనాలను నిర్ణయించడం విజయానికి మరింత సహాయ ప్రమాణంగా ఉంటుంది.

వ్యాసకర్త పరిశోధకుడు, మాంచెస్టర్ యూనివర్సిటీ
(‘ది కాన్వర్సేషన్’ సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పొరుగుకు శుభాకాంక్షలు



స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా మా గొప్ప పొరుగు దేశమైన ఇండియాకూ, భారతీయులకూ శుభాకాంక్షలు, శుభాభినందనలు. జై హింద్!

– అమరుల్లా సలేహ్, అఫ్గానిస్తాన్ తిరుగుబాటు నేత

వీళ్లు పిల్లలా?



జనాల మీదికి లాఘవంగా రాళ్లు విసిరేవాడు పిల్లాడు కాదు. జనాల వైపు త్రిశూలాలను ఊపేవాడు పిల్లాడు కాదు. అల్లర్లలో పాలుపంచుకునే మైనర్... ‘మైనర్’ కాదు. అతడి మనసును మార్చారు అనేది ఒప్పుకోగలిగే సమాధానం కాదు.

– అమిత్ శాండీలియా, కాలమిస్ట్

నిర్భయంగా తినండి



డోనట్స్, పాన్‌కేక్స్ తినండి; ఎవరూ పట్టించుకోరు. అదే ఒక్క మామిడిపండు తినగానే, అంత చక్కెరా అంటారు. పళ్లతో వచ్చే చక్కెరనూ, ప్రాసెస్డ్ ఫుడ్స్‌తో వచ్చే చక్కెరనూ మన శరీరం జీర్ణించుకోవడంలో, రక్తంలో చక్కెరను నియంత్రించుకోవడంలో ఎంతో తేడా ఉంటుంది. పళ్లు ఎక్కువ తినడం వల్ల లావయిన మనిషిని నేను ఒక్కరిని కూడా చూడలేదు.

– డ్యాన్ గో, ఫిట్‌నెస్ కోచ్

ఇక్కడి వాడినే!



ఇప్పుడిక నా మనసు, నా పౌరసత్వం... రెండూ హిందుస్థానీయే! అందరికీ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు. జై హింద్!

– అక్షయ్ కుమార్, నటుడు

అనుభవిస్తున్నాం!



హిమాచల్ ప్రదేశ్ వరదల గురించి ఎవరూ ఎందుకు మాట్లాడడం లేదు? ఇంకా దిగువ ప్రాంతాలు వరదలతో పోటెత్తుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడుతున్నాయి. చాలా ప్రదేశాల్లో కరెంట్ లేదు. ప్రతి ఒక్కరి జీవితం ప్రమాదంలో ఉంది. ఇదంతా ఘోరమైన వాతావరణ మార్పు ఫలితమే!

– సృష్టి, జర్నలిస్ట్

పాడు గాలి



నేను దాదాపు ప్రతిరోజూ ఒకరిద్దరికి కొత్తగా పల్మనరీ టీబీ ఉందని నిర్ధారిస్తాను. ఆ వ్యాధిని నియంత్రించడంలో మనం కనీసం దగ్గరగా కూడా లేము. దీనికి పోషణ అనేది ఒక్కటే కారకం కాదు. ఢిల్లీ లాంటి చోట్ల వాయు కాలుష్యం (ఇండోర్, ఔట్‌డోర్) ప్రధాన పాత్ర పోషిస్తోంది.

– పార్థ్ శర్మ, కమ్యూనిటీ ఫిజీషియన్

భిన్న వేదికలుండాలి



కళా ప్రదర్శనల కోసం చెన్నై నగర వ్యాప్తంగా చిన్న, మధ్యమ పరిమాణం గల చాలా ప్రదేశాలు ఉండాలి. అంతే గానీ మెగా షోల పేరుతో ఒకేచోట పెట్టుబడి పెట్టడం డబ్బును పూర్తిగా వృథా చేయడమే! కళలకు భిన్నమైన, బహుళ వేదికలు ఉండాలి. అది లేకపోతే పెద్దవి చిన్నవాటిని మింగేస్తాయి.

– టి.ఎం. కృష్ణ, గాయకుడు

అభివృద్ధి పథంలో దూసుకుపోతూ...

పరాయి పాలన నుండి విముక్తి పొందిన తర్వాత భారత్ ‘విశ్వగురు’గా ఎదగడానికి అవసరమైన అన్ని చర్యలూ చేపట్టింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రపంచ శాంతి కోసం మన దేశం చేస్తున్న కృషి అంతర్జాతీయ ప్రశంసలు అందుకుంటోంది. ఈ సంవత్సరం జి–20కి నాయకత్వం వహిస్తున్నాం. ఈ సమావేశానికి మన దేశం వేదిక కావడం మనందరం గర్వించదగ్గ విషయం. ‘ఒకే పుడమి, ఒకే కుటుంబం, ఒకటే భవిత’ అంటూ ప్రపంచ దేశాలకు ఐక్యతా సందేశాన్ని ఈ సమావేశం ద్వారా ఇస్తున్నాం.

కరోనా సమయంలో మన దేశం నెరపిన ‘వ్యాక్సిన్ దౌత్యం’ మనల్ని అంతర్జాతీయ యవనికపై ప్రభావవంతమైన స్థానంలో నిలిపింది. భారతదేశం అంటే పాములాడించే దేశంగా అభిప్రాయం ఉన్న ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురిచేస్తూ నేడు అంతరిక్ష రంగంలో చాలా దేశాల కంటే మన దేశం ముందు వరుసలో ఉంది. ‘ఆర్యభట్టు’ ఉపగ్రహ ప్రయోగం నుంచి నేటి ‘చంద్రయాన్ –3’ వరకు సాగిన మన ప్రయాణం మన దీక్షా దక్షతలకు ప్రతీక. ఒకప్పుడు ఒలింపిక్స్ లో ఒక కాంస్య పతకం వస్తేనే దేశం మొత్తం సంబరాలు చేసుకున్నటువంటి దశ నుంచి నేడు ఒలింపిక్స్‌తో సహా అనేక వేదికలపై స్వర్ణాలను కొల్లగొట్టే స్థాయికి మన క్రీడాకారులు ఎదిగారు.

దేశానికి స్వాతంత్య్రం వచ్చిన సమయంలో ఆర్థికంగా చితికిన స్థితిలో ఉన్నాం. ఆ పరిస్థితి నుంచి కోలుకొని నేడు పరిమాణ పరంగా ప్రపంచ పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఐదవ స్థానంలో నిలవడం మామూలు విషయం కాదు. త్వరలోనే భారత్ మూడవ స్థానం చేరుతుందని ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు.

నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం అనేక రంగాలలో దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చింది. అవినీతి రహిత పాలనను అందిస్తూనే మరోవైపు సంక్షేమ పరంగా కఠిన నిర్ణయాలను తీసుకుంటున్నది. ముఖ్యంగా కశ్మీర్ విషయంలో 370 ఆర్టికల్ రద్దు చేయడం, ‘మేకిన్ ఇండియా’, ‘ఆత్మ నిర్భర్ భారత్’, పేదలందరికీ బ్యాంకు ఖాతాలను తెరవడం, ‘స్వచ్ఛ భారత్’ను నిర్మించడం, రైతులకు అనేక పథకాలను అమలు చేయడం, రక్షణ రంగాన్ని బలోపేతం చేయడం, రోడ్ల నిర్మాణాన్ని పెంచడం, పన్నుల విధానంలో సంస్కరణలు తేవడం, ఉచిత హామీల వైపు కాకుండా ఉత్పత్తిని పెంపొందించే విధంగా కృషి చేయడం వంటివన్నీ ప్రస్తుత ప్రభుత్వం దేశాన్ని ఉన్నత స్థితికి చేర్చడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి.

– డా॥ చింత ఎల్లస్వామి, ఉస్మానియా యూనివర్సిటీ । 99081 86025

యువత ఉద్యమించాలి!

తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో అసువులు బాసింది ఎక్కువగా విద్యార్థి, నిరుద్యోగ యువతే. స్వరాష్ట్రం సిద్ధించింది కానీ వారి ఆకాంక్షలు మాత్రం నెరవేరలేదు. తెలంగాణ వస్తే ‘మా బతుకులు బాగుపడతాయి, మా నీళ్ళు, నిధులు, నియామకాలు మాకొస్తయనే’ ఆశతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణ నేడు ‘ఈన గాచి నక్కల పాల్జేసినట్లు’ అయ్యింది. తెలంగాణ వచ్చి తొమ్మిదేళ్లు అవుతోంది. ఏం సాధించినం అని వెనక్కి తిరిగి చూసుకుంటే సాధించిన దాని కన్నా కోల్పోయిందే ఎక్కువ కనబడుతుంది.

ఒక్క ‘రైతు బంధు’ పథకాన్ని తెచ్చి రైతు భాంధవుడిగా గొప్పలు చెప్పుకుంటున్నారు తెలంగాణ ముఖ్యమంత్రి. రైతు బంధు ఇచ్చిన తర్వాత కూడా తెలంగాణల రైతు ఆత్మహత్యలు ఎందుకు ఆగలేదో తెలుసుకునే ప్రయత్నమే సర్కారు చేయకపోవడం విచారకరం. కౌలు రైతుల పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా తయారయ్యింది. ‘ధరణి పోర్టల్’ ‘చాట్ల తవుడు పోసి కొట్లాట పెట్టిన’ చందంగా గ్రామాల్లో ఒకరి భూమి మరొకరి పట్టా పాస్‌బుక్‌లో రావడం, పట్టా పుస్తకంలో భూమి విస్తీర్ణం తగ్గడం, సర్వే నంబర్ తప్పుగా రావడం వంటి ఎన్నో సమస్యలు ఉత్పన్నం కావడం వల్ల రైతులు ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగి వేసారి పోతున్నరు. వేలాది ఎకరాలు నిషేధిత జాబితాలోకి వెళ్లాయి, ఈ సమస్యలకు పరిష్కారం ఎప్పుడు లభిస్తుందో పాలకులకే తెలియాలి.




ఎస్సీ ఓటు బ్యాంకు కోసం ‘దళిత బంధు’ పథకం తీసుకువచ్చి 119 నియోజక వర్గాల్లో నియోజక వర్గానికి ఒక వెయ్యి మందికి తొలుత ఈ పథకాన్ని వర్తింపచేస్తామని ప్రభుత్వం చెప్పింది. మరి ఇప్పటివరకు ఎంతమందికి వర్తింపచేశారో తెలియదు. తెలంగాణ పల్లెలు, పట్నాలు మద్యం మత్తులో ఊగుతున్నాయి, ఎక్కడ పడితే అక్కడ గ్రామ గ్రామాన బెల్టు షాపులు తెలంగాణలో దర్శనం ఇస్తున్నాయి. ప్రభుత్వం ఆదాయం కోసం ఆబ్కారీ శాఖకు నెల వారీ టార్గెట్లు పెడుతుందంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇక రాష్ట్రంలో ప్రజారోగ్యం సంగతికొస్తే అది ఐసీయూలో ఉన్నదనే చెప్పాలి. స్వరాష్ట్రం వచ్చిన తరువాత కూడా ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా వేధిస్తూనే ఉంది.

గత ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇస్తామని చెప్పిన ‘నిరుద్యోగ భృతి’ ఊసే కనబడడం లేదు. ఇక నియామకాల విషయానికి వస్తే... తెలంగాణ వచ్చిన 9 ఏండ్ల తరువాత వరుస నోటిఫికేషన్లు ఇచ్చి వేసి ‘ఇది ఉద్యోగ నామ సంవత్సరం’, ‘ఇక కొలువుల జాతరే’ అంటూ ప్రభుత్వం, అధికార పార్టీ నాయకులూ ఊదరగొట్టారు. తీరా పెట్టిన పరీక్షా పేపర్లు కొన్ని లీక్ కావడంతో నిరుద్యోగ యువత డీలాపడింది. ప్రశ్న పత్రాల లీకేజ్ వ్యవహారాన్ని ఆఖరికి రాజకీయం చేసిన పాలకులు, ప్రశ్నించిన ప్రతిపక్ష నేతలకు ‘సిట్’ నోటీసులు ఇచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో యువత మేల్కొని తగిన రీతిలో వ్యవహరించి తమ ఆకాంక్షలు నెరవేరేలా ఉద్యమించాల్సిన అవసరం ఉంది.

– డా॥ అక్కెనపల్లి వెంకట్రామ్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాద్

మనోహరమైన పోలిక

ఎవరి చేతిలోనూ తనకు మరణం లేకుండా చేసుకునే ఉద్దేశంతో, అత్యంత కఠినమైన తపస్సుకు పూనుకుంటాడు రావణుడు. ఆ తపస్సులో వెయ్యేళ్ళకు ఒక శిరస్సు చొప్పున తనకున్న పది శిరస్సులలో తొమ్మిదింటిని సమర్పించుకుంటాడు. మరో వెయ్యేళ్ళు గడిచి, తన పదవ శిరస్సును కూడా సమర్పించుకోవడానికి రావణుడు సిద్ధపడుతూండడం చూసి, ప్రీతితో బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకోమంటాడు. అంతగా శక్తిమంతులు కాని మానవుల వలన, వారి కంటె హీనజాతివారైన వానరుల వలన తనకు ముప్పేమీ వాటిల్లదు కనుక వారిని గురించిన చింతేమీ తనకు లేదనీ, దేవ దానవ యక్ష కిన్నర కింపురుషాది మరే జాతికి చెందినవారి చేతిలోనూ తనకు మరణం కలగని వరం ఇమ్మంటాడు రావణుడు. అలాగే ఇస్తాడు బ్రహ్మ. అంతే కాకుండా రావణుడు తపస్సులో అర్పించిన తొమ్మిది తలలను కూడా తిరిగి ఇచ్చేస్తాడు.



బ్రహ్మ అలా వరం ఇవ్వగానే, రావణుని తొమ్మిది తలలు ఒకటొకటిగా వచ్చి మిగిలివున్న శిరస్సు చెంతనే చేరతాయి. తపస్సనే సాధనంతో బ్రహ్మను సైతం మెప్పించి తాను కోరుకున్నది సాధించుకున్న రావణుడి శిరస్సులు ఒకటొకటిగా మళ్ళీ వచ్చి చేరే అద్భుతమైన ఆ సందర్భాన్ని

‘వెల్లువ ముంచి పిదప నీ
రెల్లను వెస డొంక గొలన నెసగెడు చంచ
త్ఫుల్లారవిందముల క్రియ
నల్లన వదనములు దోచె నాశ్చర్యముగాన్’

అని అంతే అద్భుతంగా, మనోహరమైన పోలికతో వర్ణించి చెప్పాడు తిక్కన తన రచనయైన ‘నిర్వచనోత్తర రామాయణము’ తృతీయాశ్వాసంలో!

పెద్ద వాన పడిన కారణంగా వెల్లువ వచ్చి కొలను మునిగిపోయింది. వాన వెలిసిన కొంతసేపటికి, వచ్చిన వెల్లువ తగ్గి, అధికంగా వచ్చి చేరిన నీరు కొలనులోంచి బయటకు వెళ్ళిపోయి, కొలనుకు పూర్వస్థితి రాగా, ఆ కొలను నీటిలోంచి ఒకటొకటిగా మళ్ళీ వికసిస్తూ ప్రత్యక్షమైన కమలముల వలె, దశకంధరుడైన రావణుని తలలు ఒకటొకటిగా మళ్ళీ వచ్చి చేరి, చూసే వారికి ఆశ్చర్యము, ఆనందము కలుగజేశాయి అని పై పద్యం భావం. భావం మనసుకు హత్తుకుని, ‘ఆహా!’ అనిపించేలా చెప్పడం మహాకవుల లక్షణం. అందులో ఆరితేరినవాడు తిక్కన మహాకవి.

– భట్టు వెంకటరావు

సస్పెండైన సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

- అప్పులు, అవమానభారంతో మనస్తాపానికి గురై...
- రూ. 20 లక్షల పల్లెప్రగతి పనుల బిల్లులు మంజూరు కాని వైనం
- ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితుడిగా బాధితురాలి భర్త
- ఎమ్మెల్యేతో విభేదాల కారణంగానే బిల్లులు మంజూరుకాలేదని చర్చ



చికిత్స పొందుతున్న సస్పెండైన సర్పంచ్ లావణ్య

ఖలీల్‌వాడి: పల్లెప్రగతి పనుల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఇటీవల సస్పెండైన నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలంలోని కల్లెడి గ్రామ సర్పంచ్ లావణ్య తన ఇంట్లో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పల్లెప్రగతిలో భాగంగా సర్పంచ్‌గా ఉన్న లావణ్య రూ.20 లక్షలు అప్పు చేసి గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేశారు. ఆ అప్పు వడ్డీతో సహా రూ.30 లక్షలు అయింది. అయితే రూ.20 లక్షల పనుల బిల్లులు ఇప్పటికీ ప్రభుత్వం నుంచి మంజూరుకాలేదు. గ్రామానికి చెందిన సంతోష్‌గౌడ్ అలియాస్ సంతూగౌడ్ నుంచి రూ.3 లక్షల వరకు తీసుకున్నారు. ఇప్పటికే అప్పు ఇచ్చి చాలాకాలం అయిపోవడంతో సంతోష్‌గౌడ్ భార్య, తన పిల్లలతో వచ్చి లావణ్య ఇంటివద్ద ఆందోళనకు దిగింది. మూడు నెలలు సమయమిస్తే అప్పు మొత్తం ఇచ్చేస్తానని ఎంతచెప్పినా సంతోష్‌గౌడ్ భార్య వినకపోవడంతో అవమానంగా భావించిన లావణ్య మంగళవారం నిద్రమాత్రలు మింగారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జీజీహెచ్‌కు తరలించారు.

ఆ విభేదాలతోనే మంజూరు కాలేదా?

కల్లెడ గ్రామంలో చేసిన అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు మాక్లూర్ మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) నివేదిక రూపొందించి కలెక్టర్‌కు నివేదించగా...గ్రామ సర్పంచ్ లావణ్యను సస్పెండ్ చేశారు. దీంతో లావణ్య భర్త ప్రసాద్ ఎంపీవోపై దాడికి పాల్పడగా అతడిపై కేసు నమోదైంది. ఈ ఘటన తర్వాత లావణ్య సస్పెన్షన్ వ్యవహారం, బిల్లుల మంజూరుకోసం ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని కలిసేందుకు ప్రసాద్ దంపతులు 2022 ఆగస్టు 1న హైదరాబాద్ వెళ్లారు. అక్కడ జీవన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రసాద్‌పై కేసు నమోదైంది. దీంతో లావణ్య మీడియా ముందుకు వచ్చి తాము ఎలాంటి దాడికి పాల్పడలేదని వివరణ ఇచ్చారు. దీంతోపాటు సామాజిక మాధ్యమాల్లో కూడా జీవన్‌రెడ్డికి వ్యతిరేకంగా వీడియో పోస్ట్ చేశారు. ఈ విభేధాల కారణంగానే పల్లెప్రగతి బిల్లులు మంజూరు కానివ్వకుండా ఆపుతున్నట్లు మండలంలో జోరుగా చర్చ జరుగుతోంది.

సెల్‌ఫోన్ వాడొద్దన్నందుకు బాలుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: ఎక్కువసేపు సెల్‌ఫోన్ వాడొద్దన్నందుకు ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటకు చెందిన మ్యాడ నరేశ్–జల దంపతుల కుమారుడు సాయిచరణ్(12) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. నరేశ్ ఉపాధి కోసం ఏడాది క్రితం దుబాయ్ వెళ్లగా, జల తన కుమారుడు సాయిచరణ్‌తో కలిసి గ్రామంలో ఉంటోంది. సోమవారం సాయిచరణ్ కాలుకు దెబ్బతగిలిందని ఇంటి వద్దే ఉన్నాడు. అదేపనిగా సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతూ కనిపించాడు. మంగళవారం బడిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు కూడా వెళ్లలేదు. తల్లి వద్ద ఉన్న సెల్‌ఫోన్ తనకు ఇవ్వాలని సాయిచరణ్ అడగ్గా ఆమె నిరాకరించింది. సెల్‌ఫోన్ ఎక్కువసేపు వాడొద్దని చెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు ఇంట్లోని దూలానికి టవల్‌తో ఉరేసుకున్నాడు.

అప్పులు తీరక.. పెట్టుబడి లేక..

కౌలు రైతు బలవన్మరణం



భాస్కర్ (ఫైల్)

ఐనవోలు: కుమార్తెల పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీరలేదు.. కౌలు భూమికి పెట్టుబడులు పెట్టేదారి లేదు.. దీంతో మనస్తాపానికి గురై ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తిలో మంగళవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. కొండపర్తి గ్రామానికి చెందిన ఈద భాస్కర్ (42) వ్యవసాయ కూలి పనులతోపాటు కొంత వ్యవసాయ భూమిని కౌలుకు చేస్తున్నాడు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేశాడు. ఈక్రమంలో పెళ్లిళ్లకు, వ్యవసాయానికి కలిపి రూ.5 లక్షల మేర అప్పులు అయ్యాయి. ప్రస్తుత సీజన్‌లో పెట్టుబడికి డబ్బులు లభించలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భాస్కర్ వ్యవసాయ భూమి వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మళ్లీ కేసీఆర్ వస్తేనే అందరికీ మంచిది

- సారంపల్లి నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నా
- 9 ఏళ్లలో కులాలు, మతాలకు అతీతంగా అభివృద్ధి.. సంక్షేమం
- తెలంగాణ పచ్చబడ్డది.. అది కేసీఆర్ సాధించిన ప్రగతి
- 76 ఏళ్లలో రూ.73 వేల కోట్లు రైతుల ఖాతాల్లో ఎవరూ వేయలే
- కాంగ్రెసోళ్లు విడిచిపెట్టిన అన్ని పనులూ చేస్తున్నాం
- ఈ టైమ్‌లో ప్రజలు తప్పు చేయొద్దు: మంత్రి కేటీఆర్



ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల ఆవిష్కరణల పనితీరు, వాటి వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల/తంగళ్లపల్లి: 'కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే.. బీద, బిక్కి మంచిగుంటరు.. కులాలు, మతాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం అందరికీ అందుతోంది.. కరెంట్ మంచిగైంది... ఎరువులు అందుతున్నయి.. తెలంగాణ పచ్చబడ్డది.. ఈ టైమ్‌లో తప్పు చేయొద్దు.. ఈ తొమ్మిదేళ్లలో రైతులను, పేదలను కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నాం'అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో ఆయన మంగళవారం జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాకు ప్రతి ఎన్నికల్లోనూ సారంపల్లి నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించడం ఆనవాయితీ.. మళ్లీ ఇక్కడ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నానని కేటీఆర్ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు అయింది.. రైతుల ఖాతాల్లో రూ.73 వేల కోట్లు వేసిన సీఎం, పీఎంలు ఎవరైనా ఉన్నారా అని కేటీఆర్ ప్రజలను ప్రశ్నించారు. సమస్యలు ఎప్పటికీ ఒడిసిపోవు.. కానీ 50 ఏళ్లు పాలించిన కాంగ్రెసోళ్లు ఇడిసిపెట్టిపోయిన పనులను ఒక్కొక్కటీ చేస్తున్నామన్నారు. కరెంట్ మంచిగయింది.. సాగునీరు వచ్చింది. ఇంటింటికీ మంచినీరు వచ్చింది.. ఇవి కేసీఆర్ సాధించిన ప్రగతి అని కేటీఆర్ స్పష్టం చేశారు. రూ.99,999 లోపు రుణాలను మాఫీ చేస్తూ ఒక్క రోజే రూ.6వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. పేదలను కడుపులో పెట్టుకుని చూసుకునే కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని కేటీఆర్ అన్నారు.

తెలంగాణ ఆచరిస్తే.. దేశం అనుసరిస్తుంది..

తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా ఉందని, రాష్ట్రం ఆచరిస్తే దేశం అనుసరిస్తోందని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పలు పథకాలను కేంద్రం కూడా అమలు చేస్తోందని తెలిపారు. సిరిసిల్ల మధ్యమానేరు జలాశయంలో రూ.2 వేల కోట్లతో 10 వేల మందికి ఉపాధి కల్పించే అక్వాహబ్‌కు సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేస్తామన్నారు. బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, ఆసరా పెన్షన్లు అందిస్తున్నామని, పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు పలు పథకాలతో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

'బస్‌లో భరోసా'కు శ్రీకారం..

రాష్ట్రంలోనే తొలిసారి మహిళల భద్రతకు 'బస్‌లో భరోసా'కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ శ్రీకారం చుట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 77 బస్సులు, పాఠశాల బస్సుల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. షీ టీమ్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని, నేరాల నియంత్రణకు ఇవి దోహదపడతాయని కేటీఆర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మంత్రి కేటీఆర్ అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టిస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల నుంచే పోటీ చేస్తా

తాను సిరిసిల్ల నియోజకవర్గం నుంచే ఎమ్మెల్యేగా పోటీలో ఉంటున్నట్లు మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కొన్ని రోజులుగా మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని, సిరిసిల్ల నియోజకవర్గాన్ని వదిలేస్తారని వస్తున్న ఊహాగానాలకు తెరదించారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారులూ 'గృహలక్ష్మి'కి అర్హులే

- ఇంటికి ఆర్‌సీసీ శ్లాబ్ లేకుంటే చాలు
- పేదల కొత్త ఇళ్ల పథకంపై స్పష్టతనిస్తున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: కొత్తగా ప్రారంభిస్తున్న పేదల ఇళ్ల పథకం 'గృహలక్ష్మి'విషయంలో నిబంధనలు సరళంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ఈ పథకం విషయంలో విమర్శలు రాకుండా జాగ్రత్త పడుతోంది. సాధారణంగా పేదలకు ప్రభుత్వం సొంతింటిని సమకూర్చే విషయంలో, గతంలో ఇలాంటి పథకంలో లబ్ధిపొందిన వారిని అనర్హులుగా ప్రకటిస్తారు. కానీ, గృహలక్ష్మి విషయంలో మాత్రం ఆ దిశలో కూడా కొంత సానుకూలంగానే ఉండాలని నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలైన ఇందిరమ్మ పథకం కింద ఇల్లు పొంది, ఆర్‌సీసీ రూఫ్ కాకుండా ఇతర కచ్చా కప్పుతో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులు కూడా గృహలక్ష్మి కింద కొత్త ఇంటి కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవటానికి వెసులుబాటు కల్పించింది.

అలాంటి వాళ్లు వేలల్లోనే..

ఇటీవలే ప్రభుత్వం గృహలక్ష్మి మార్గదర్శకాలను జారీ చేసిన విషయం తెలిసిందే. సొంత స్థలం ఉండి, ఆర్‌సీసీ కప్పు లేని ఇల్లున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని అందులో స్పష్టం చేసింది. దేశవ్యాప్త దృష్టిని ఆకర్షిస్తూ ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం భారీఎత్తున పేదల కోసం ఇళ్ల నిర్మాణం జరిపిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన సాయానికి సొంత డబ్బులు జత చేసుకుని చాలామంది కాస్త విశాలంగా ఇళ్లను నిర్మించుకున్నారు. ఈ ప్రయత్నంలో వారు ఖర్చు తగ్గించుకోవటానికి స్థానికంగా లభించే మెటీరియల్‌ను ప్రత్యామ్నాయ పైకప్పుగా వేసుకునేందుకు అనుమతి కోరారు. దానికి నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతంలో రేకులతో, వికారాబాద్, తాండూరు ప్రాంతంలో నాపరాళ్ల (షాబాద్ బండలు)తో పైకప్పు నిర్మించుకున్నారు. గోడలు కాంక్రీట్‌తో నిర్మించుకున్నా, పైకప్పు ఆర్‌సీసీతో లేనందున ఇప్పుడు వాటిని కచ్చా ఇళ్లుగానే పరిగణిస్తున్నారు. అలాంటి ఇళ్ల యజమానులు కూడా ఇప్పుడు మళ్లీ గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించారు. ఇలాంటి వారు వేల సంఖ్యలో ఉన్నారు.

ఇటీవలే రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటికే దాదాపు 14 లక్షల దరఖాస్తులు అందినట్టు తెలిసింది. గృహలక్ష్మి కింద 4 లక్షల ఇళ్లను మాత్రమే మంజూరు చేశారు. ఒక్కో శాసన సభ నియోజకవర్గానికి 3 వేల ఇళ్లకు తగ్గకుండా మంజూరు చేస్తారు. ఆ సంఖ్యకు మూడునాలుగు రెట్ల దరఖాస్తులు వచ్చినందున ఎంపిక ప్రక్రియ క్లిష్టంగా మారే అవకాశం కనిపిస్తోంది.

ఫామ్‌హౌజ్‌లో కాల్పుల కలకలం!

- ఒకరికి గాయాలు.. హైదరాబాద్‌కు తరలింపు
- వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి జిల్లాలోని ఓ ఫామ్‌హౌజ్‌లో జరిగిన కాల్పులు స్థానికంగా కలకలం రేపాయి. ఈ ఘటనలో ఓ యువకుడు గాయపడ్డాడు. లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డి సమీపంలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి ఫామ్‌హౌజ్ ఉంది. ఫాంహౌస్‌లో ఏం జరిగిందో ఏమోగానీ అటుగా వెళ్తున్న శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన రాజు అనే యువకుడికి బుల్లెట్ దిగింది. దీంతో బాధితున్ని వెంటనే గ్రామస్తులు ఆస్పత్రికి తరలించారు. కాగా, ఘటనపై సమాచారం అందుకున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులుతోపాటు సీఐ, ఎస్సైలు అక్కడికి చేరుకుని సమాచారం సేకరించారు. అది ఏ తుపాకీ అన్నదానిపై ఆరా తీస్తున్నారు. ఎవరు కాల్చారు అన్నది తేలాల్సి ఉంది. గతంలోనూ లింగంపేట మండలంలో వన్యప్రాణులను వేటాడిన వ్యక్తుల వద్ద నుంచి తుపాకులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

కళ్లలో కారం పెట్టి.. చెట్టుకు కట్టేసి కొట్టి

దొంగతనం పేరుతో బాలికలపై దాష్టీకం

పాలకుర్తి: ఇద్దరు బాలికలు డబ్బులు తీసుకున్నారనే నెపంతో చెట్టుకు కట్టేసి కళ్లల్లో కారం పెట్టి కొట్టారు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలికల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుస్కూరి మధుకర్‌రావు ఇంటిలో 15 రోజుల కిందట రూ.1.35 లక్షలు చోరీకి గురయ్యాయి. ఆ డబ్బులను ఇద్దరు బాలికలతోపాటు వారి తల్లిదండ్రులు తీశారనే అనుమానంతో మధుకర్‌రావు.. వారిని తీసుకువచ్చి దారుణంగా హింసలు పెట్టారు. చెట్టుకు కట్టేసి కళ్లలో కారం పెట్టి తీవ్రంగా కొట్టారు. ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా పాకి మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఓ బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఇదిలా ఉండగా కొట్టిన తరువాత పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు వాపోయారు. దీనిపై ఎస్సైని వివరణ కోరగా తమ దగ్గరికి ఎవరూ రాలేదని, మంగళవారం వచ్చి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా, దొంగతనం చేసినట్లు అనుమానిస్తున్న బాలికల్లో ఒకరు.. స్వయానా మధుకర్‌రావు సోదరుడి కూతురు. దీనిపై గ్రామంలో పెద్దలు పంచాయితీ కూడా పెట్టారని తెలిసింది.

సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే దిక్సూచి తెలంగాణ

- మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేట ఐటీటవర్ వెబ్‌సైట్ ప్రారంభం

సాక్షి, సిద్దిపేట: తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే దిక్సూచిగా మారాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో మంగళవారం స్వాతంత్ర్యవేడుకల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో సబ్బండ వర్గాలు ఏకమై మహోద్యమాన్ని నిర్మించి తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసుకున్నామన్నారు. పసి రాష్ట్రంగా అవతరించిన పదేళ్లలోనే తెలంగాణలో నూరేళ్ల అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. తెలంగాణలో వ్యవసాయం దండగంటూ సమైక్య పాలకులు చిత్రీకరించారని, అదే తెలంగాణ ఇప్పుడు సగం దేశానికి అన్నం పెడుతుందని చెప్పారు. సమైక్య పాలకుల పాలనలో కన్నీళ్లు పెట్టిన తెలంగాణ పల్లెలు నేడు కళకళలాడుతున్నాయన్నారు. ఎక్కడాలేని విధంగా ఆసరా పింఛన్లను, ఏ రాష్ట్రానికి సాధ్యం కాని విధంగా 24గంటల ఉచిత విద్యుత్తును సీఎం కేసీఆర్ అందిస్తున్నారని తెలిపారు. అనంతరం సిద్దిపేట ఐటీ టవర్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.



తల్లీ.. కూరగాయల గిరాకీ ఎట్లుంది?

'ఏం తల్లీ బాగున్నావా? గిరాకీ ఎట్లుంది? గిట్టుబాటవుతుందా..? పిల్లలేం చదువుతున్నారు?' అంటూ ఆర్థిక, వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు రైతులను పలకరించారు. మంగళవారం సిద్దిపేట మోడల్ రైతుబజార్‌ను మంత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా రైతులతో ముచ్చటిస్తూ, కూరగాయలను తూకం వేశారు. – సిద్దిపేట జోన్

కేసీఆర్ పాలన పోతేనే నిజమైన స్వాతంత్ర్యం

వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ నియంతృత్వ పాలన పోతేనే తెలంగాణకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ఒక్కమాటైనా నిలబెట్టుకోలేదని విమర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇక్కడి లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె జాతీయజెండాను ఎగరవేశారు. షర్మిల మాట్లాడుతూ 'తెలంగాణలో మహిళలకు గౌరవమే లేదు.. ఎక్కడ చూసినా వైన్ షాపులు, బార్లు, పబ్బులే. గుడులు, బడుల కంటే వైన్‌షాపులు, బెల్ట్ షాపులే ఎక్కువ. మహిళలకు భద్రత ఎక్కడి నుంచి వస్తుంది'అని అన్నారు. మరోవైపు మతం పేరుతో చిచ్చు పెట్టడం, ఆ మంటలో చలి కాచుకోవడం కేంద్రంలోని బీజేపీకి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు.

షర్మిల పాదయాత్రకు 'ఇండియన్ బుక్'లో చోటు

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్రకు చోటు దక్కింది. రాష్ట్రంలో ఆమె 3,800 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసిన విషయం తెలిసిందే. ఈ ఘనత సాధించిన మొదటి మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. పార్టీ కార్యాలయంలో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు షర్మిలను కలిసి అవార్డు ప్రదానం చేశారు.



పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న వైఎస్ షర్మిల

ఎమ్మెల్సీ కవితతో డీజేహెచ్‌ఎస్ ప్రతినిధుల భేటీ

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అంశంపై చర్చ



కవితకు వినతిపత్రం ఇస్తున్న డీజేహెచ్‌ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అంశంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మంగళవారం డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్‌ఎస్) అధ్యక్షుడు బొల్లోజు రవి, ఉపాధ్యక్షుడు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు దండా రామకృష్ణ, సలహాదారు మల్లికార్జున్‌రెడ్డి, సభ్యులు వేములపల్లి రాజు, ప్రతిభా దేవి, శ్రావణి, సోమేశ్వర్ తదితరులు కలిశారు. డీజేహెచ్‌ఎస్ గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. ఇది తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఏర్పాటైన తొలి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అని ప్రతినిధులు వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ తీసుకొని ఖమ్మం, నిజామాబాద్, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లోని జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. కేసీఆర్ వల్లనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తమకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కవితకు వినతిపత్రం అందించారు. జర్నలిస్టుల ఇంటి కలను సాకారం చేయడంలో చేదోడు వాదోడుగా నిలుస్తానని కవిత భరోసా ఇచ్చారు.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌తోనే వైద్య సీట్ల భర్తీ

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించకుండా అలాగే వదిలేయాలని సూచించింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శికి లేఖ రాసింది.

ప్రతిభకు న్యాయం

2023–24 వైద్య విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్, పీజీ మెడికల్ సీట్ల భర్తీ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఎన్ఎంసీ సంచలన నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో సీట్ల బ్లాకింగ్ నిలిచిపోతుందని, ఫలితంగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు న్యాయం జరుగుతుందని అంటున్నారు. అభ్యర్థుల ఫిర్యాదులు, కోర్టు కేసులను పరిష్కరించడంలో ఇది సాయపడుతుందని ఎన్ఎంసీ కూడా స్పష్టం చేసింది. కాగా ఈసారి ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీఎస్ యాజమాన్య సీట్లు దాదాపు 50కు పైగా, పీజీ మెడికల్‌లో 30కి పైగా మిగిలిపోయే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

బ్లాకింగ్‌తో కోట్లు దండుకున్న కాలేజీలు!

గతేడాది వరకు ఎంబీబీఎస్, పీజీ సీట్ల బ్లాకింగ్‌తో ప్రైవేట్ మెడికల్ కాలేజీలు అక్రమ వ్యాపారం చేశాయనే ఆరోపణలున్నాయి. ప్రతిభ కలిగిన విద్యార్థులు తమ కాలేజీల్లోని ఏ, బీ కేటగిరీ సీట్లలో చేరేలా యాజమాన్యాలు ముందస్తు అవగాహన కుదుర్చుకునేవి. దీంతో ఈ కేటగిరీలకు రెండు విడతల కౌన్సెలింగ్, చివరి మాప్ అప్ రౌండ్ కౌన్సెలింగ్‌లు పూర్తయ్యేవరకు ఉత్తమ ర్యాంకర్లు తమ సీట్లను అలాగే అట్టిపెట్టుకునేవారు. అన్ని కౌన్సెలింగ్‌లూ పూర్తయిన తర్వాత ఒకవేళ సీట్లు మిగిలితే అవి ఆటోమెటిక్‌గా సీ (ఎన్ఆర్ఐ) కేటగిరీ సీట్లుగా మారిపోతాయి. ఆ సమయంలో అప్పటికే ఫీజు చెల్లించిన మెరిట్ విద్యార్థులు ముందుగా కుదుర్చుకున్న అవగాహన మేరకు తమ సీట్లు వదిలేసుకునేవారు. దీంతో ఇవి కూడా నిబంధనల ప్రకారం సీ కేటగిరీ సీట్లుగా మారిపోతాయి. వీటికి అభ్యర్థులతో ప్రత్యక్ష కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా ప్రైవేట్ కాలేజీలు కోట్లు దండుకునేవి. కన్వీనర్ కోటాకు ఏడాదికి రూ.60 వేలు, బీ కేటగిరీ సీటుకు రూ.11.55 లక్షల ఫీజు ఉంటుంది. ఇక సీ కేటగిరీ సీటుకు బీ కేటగిరీ సీటు కంటే రెట్టింపు ఫీజు ఉంటుంది. అంటే ఏడాదికి రూ.23.10 లక్షల వరకు ఉంటుందన్న మాట. ఇలా కోర్సు మొత్తానికి కోటికి పైగా వసూలు చేస్తారు. రూ.60 వేలున్న కన్వీనర్ కోటా సీటును కూడా అదే రేటుకు అమ్ముకునేవారు. ఇక అవగాహన మేరకు వర్సిటీకి రూ.3 లక్షల జరిమానా చెల్లించి మరీ సీట్లు వదులుకున్న విద్యార్థులకు వాళ్లు చెల్లించిన ఫీజుతో పాటు రూ.10 లక్షల వరకు అదనంగా యాజమాన్యాలు చెల్లిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఈ విద్యార్థులు ఆ తర్వాత ఇతర కాలేజీల్లో చేరిపోతున్నారు.

ఇతర రాష్ట్రాల ముఠాల ప్రమేయం

గతంలో మాదిరిగానే ఏ, బీ కేటగిరీ సీట్లను సీ కేటగిరీగా మార్చుకునేలా యాజమాన్యాలు విద్యార్థులకు వల వేసినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ దందాలో అనేక ఇతర రాష్ట్రాల ముఠాలు, ప్రైవేటు కాలేజీలు, కొందరు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాలు పంచుకుంటున్నట్లు తెలిసింది. గతంలో కర్ణాటకలో జరిగిన ఎంబీబీఎస్ సీట్ల కుంభకోణంలో కాలేజీల చైర్మన్లు, వైద్యాధికారులు కూడా ఉన్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో ఇప్పటివరకు ఇదంతా గుట్టుగా సాగిపోతుండటం గమనార్హం. ఎన్ఎంసీ తాజా నిర్ణయంతో సీట్ల బ్లాకింగ్‌కు చెక్ పడుతుందనే ఆశాభావం వ్యక్తం అవుతోంది.

కౌన్సెలింగ్ తర్వాతే క్లాసులు..

▶ మొదటి పేజీ తరువాయి

అధిగమించడంపై అవగాహన కల్పించాలని భావించింది. ఇందులో భాగంగా కొత్తగా చేరే విద్యార్థులకు ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దేశంలోని అన్ని ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎంలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కేంద్రాలు (ఐఐఎస్ఈఆర్), ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎయిమ్స్)లను ఆదేశించింది. ఈ సంస్థల్లో 2018 నుంచి 2022 వరకు జరిగిన విద్యార్థుల ఆత్మహత్యలు, వాటి కారణాలపై కేంద్రం అధ్యయనం చేసింది.

ఐఐటీల్లో పెరుగుతున్న ఆత్మహత్యలు

గత ఐదేళ్లలో ఐఐటీల్లో 32 మంది, ఎన్ఐటీల్లో 21 మంది, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో 20 మంది, ఎయిమ్స్ సంస్థల్లో 11 మంది విద్యార్థులు అర్ధంతరంగా తనువు చాలించారు. జాతీయ స్థాయిలో తీవ్ర పోటీని తట్టుకుని సీట్లు తెచ్చుకున్న ఈ విద్యార్థులు మానసిక ఒత్తిడి, అనుకోకుండా డిప్రెషన్‌లోకి వెళ్లిపోవడం ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. జాతీయ కాలేజీల్లో చేరిన రెండో సంవత్సరం నుంచి వారికి తెలియకుండానే మానసిక ఒత్తిడి మొదలవుతోందని నిపుణులు చెబుతున్నారు. మొదటి ఏడాదిలో మిగిలిపోయే బ్యాక్‌లాగ్స్‌తో ఒక్కసారిగా బెంబేలెత్తిపోతున్నారని, కోర్సు ముగిశాక అనుకున్న రీతిలో జీవితంలో స్థిరపడలేమనే నైరాశ్యం వారిలో గూడుకట్టుకుంటోందని జాతీయ ఇంజనీరింగ్ సంస్థల డైరెక్టర్లు అభిప్రాయపడుతున్నారు.

2018–2022 మధ్య జాతీయ సంస్థల్లో జరిగిన విద్యార్థుల ఆత్మహత్యలు

సంస్థ	2018	2019	2020	2021	2022
ఐఐటీలు	8	8	3	4	9
ఎన్ఐటీలు	3	8	1	2	7
కేంద్ర వర్సిటీలు	6	4	4	1	5
ఐఐఎస్ఈఆర్	1	0	0	0	2
ఐఐఎంలు	1	0	1	1	1
ఎయిమ్స్	2	0	4	2	3
మొత్తం	21	20	13	10	27

బట్టీ విధానమే కారణమా?

ప్రతీ రాష్ట్రంలోనూ ఇంటర్మీడియెట్ వరకు కాలేజీల్లో బట్టీ విధానంలోనే బోధన సాగుతోందని నిపుణులు అంటున్నారు. జాతీయ పోటీ పరీక్షలైన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ కోసం కోచింగ్ కేంద్రాలు ఒక తరహా బట్టీ పద్ధతిలోనే బోధన చేస్తున్నాయని చెబుతున్నారు. ఇది అసలైన మేధో విధానం కాకపోవడం, ఇంజనీరింగ్‌లో చేరిన తర్వాత ఇదే పద్ధతి ఉండకపోవడం సమస్యకు మూలంగా పేర్కొంటున్నారు. ఆత్మహత్యల నేపథ్యాన్ని పరిశీలిస్తే గణితం, ఫిజిక్స్ ప్రామాణికంగా ఉండే సబ్జెక్టుల్లోనే విద్యార్థులు వెనుకబడుతున్నారు. ఐఐటీలు, ఎన్ఐటీలు పూర్తిగా పరిశోధనాత్మకంగా ఉండాలని జాతీయ విద్యావిధానం చెబుతోంది. మేథ్స్‌లో ఏదైనా సమస్యను విశ్లేషణాత్మకంగా పరిష్కరించే విధానం జాతీయ సాంకేతిక విద్యలో ఇప్పుడు కీలకమైంది. బట్టీ విధానంలో వచ్చిన విద్యార్థులు ఇక్కడే గందరగోళానికి గురవుతున్నారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఏ మాత్రం ధైర్యం కోల్పోతున్నా...

ఉమ్మడి సీట్ల కేటాయింపునకు సంబంధించిన ఆరు దశల 'జోసా'కౌన్సెలింగ్ పూర్తయింది. మరికొద్ది రోజుల్లో ఎన్ఐటీలు, ఐఐటీల్లో క్లాసులు మొదలవుతాయి. అందువల్ల ముందుగా ప్రతీ బ్రాంచీలోని విద్యార్థులను సమైక్య పర్చాలి. వారిలో ఉత్తేజాన్ని, మనోధైర్యాన్ని కల్పించేలా కౌన్సెలింగ్ నిర్వహించాలి. సమస్యలకు పరిష్కారం సాధించే మార్గాలను ముందే వివరించాలి. ప్రతీ విద్యార్థి వ్యక్తిగత నేపథ్యం, వారి కుటుంబ వివరాలు తెలుసుకోవాలి. కొన్ని రోజులు విద్యార్థులను దగ్గర్నుంచి పరిశీలించాలి. ఏమాత్రం ధైర్యం కోల్పోతున్నట్టు గుర్తించినా అతన్ని ప్రత్యేక పద్ధతిలో కౌన్సెలింగ్ చేయాలి. ఈ దిశగా అన్ని కాలేజీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కేంద్ర విద్యాశాఖ సూచించింది.


కౌన్సెలింగ్ అవసరం



విద్యార్థుల ఆత్మహత్యలను సీరియస్‌గా తీసుకోవాలి. మనోనిబ్బరం కోల్పోయిన వారికి ఒకసారి సాదాసీదా కౌన్సెలింగ్ ఇస్తే సరిపోదు. దశలవారీగా కౌన్సెలింగ్ ఇవ్వాలి. అతనిలో వచ్చే మార్పులను గమనించాలి. అవసరమైతే తల్లిదండ్రులనూ పిలిచి వారితో ధైర్యం చెప్పించాలి. ప్రతీ ఎన్ఐటీలోనూ కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆలోచన మంచిదే.

– ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ (నిట్ డైరెక్టర్, వరంగల్)

ఒత్తిడికి లోనవుతున్నారు



జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీటు వచ్చే వరకూ చదవడం వేరు. వచ్చిన తర్వాత చేయాల్సిన కృషి వేరు. ఈ తేడాను గుర్తించలేక విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ఇలాంటి వారిని గమనించేందుకు ప్రతీ పది మంది విద్యార్థులకు ఒక మెంటార్‌ను నియమించాం.

– డాక్టర్ ఎన్‌వీ రమణారావు (నిట్ డైరెక్టర్, రాయ్‌పూర్)

క్లుప్తంగా...

2024లో బీజేపీ ప్రభుత్వం నుంచి స్వాతంత్ర్యం: నితీశ్



పట్నా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి త్వరలోనే మనకు స్వాతంత్ర్యం లభిస్తుందని బిహార్ సీఎం నితీశ్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలన్నిటినీ ఏకం చేసి బీజేపీని అధికారం నుంచి గద్దెదించుతానని ప్రతిజ్ఞ చేశారు. మంగళవారం పట్నాలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మేం పనులు చేస్తుంటే ఢిల్లీలో ఉన్న వాళ్లు దుష్ప్రచారంలో మునిగిపోయారని మోదీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అనంతరం డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ మాట్లాడారు. మళ్లీ తమదే అధికారమంటూ ప్రధాని మోదీ చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై మండిపడ్డారు. 'అది అహంకారం. ఏదీ శాశ్వతం కాదన్న సంగతిని ప్రధాని మర్చిపోయినట్లున్నారు' అని వ్యాఖ్యానించారు.

ఇక మా వంతు: లాలూ

పట్నా: ఢిల్లీలో ఎర్రకోటపై జెండా ఎగరేసే చిట్టచివరి అవకాశాన్ని ప్రధాని మోదీ వాడేశారని, ఇక వచ్చే ఏడాది మా వంతు వస్తుందని రాష్ట్రీయ జనతా దళ్ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ వ్యాఖ్యానించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత వచ్చే స్వాతంత్ర్యదినోత్సవాల్లో ఎర్రకోటపై మోదీ జెండా ఎగరేస్తారా? అన్న మీడియా ప్రశ్నకు లాలూ బదులిచ్చారు. ' లేదు. ఆ అవకాశమే లేదు. అప్పుడు మా వాళ్లు వస్తారుగా' అని వ్యాఖ్యానించారు. విపక్షాల ఇండియా కూటమి గెలుపు ఖాయమన్నారు.

మెరుగైన 'ఇండియా' కోసం కృషిచేద్దాం: మమత

కోల్‌కతా: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విపక్షాల కూటమి 'ఇండియా'ను పరోక్షంగా గుర్తుచేస్తూ తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ట్వీట్లు చేశారు. '' దేశ చరిత్ర సమస్తం ధైర్యసాహసాలతో నిండినదే. జాతీయజెండాను ఎగరేస్తున్న ఈ క్షణాన మనం స్వాతంత్ర్యసమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం. వారు పోరాడి నిలిపిన విలువలను మరింత సమున్నత స్థాయికి తీసుకెళ్దాం. అంకితభావంతో ముందడుగు వేయాల్సిన త్యాగ స్ఫూర్తిని అందించారు. వైషమ్యాలు, విభేధాలను విడనాడి ఐక్యంగా మెరుగైన, వెలుగుల 'ఇండియా' కోసం శ్రమిద్దాం'' అని ట్వీట్‌చేశారు.

రాష్ట్ర జాబితాలోకి విద్యను మార్చాలి: స్టాలిన్



చెన్నై: రాజ్యాంగంలో ప్రస్తుతం ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను రాష్ట్ర జాబితాలో చేర్చాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో ఆయన ఈ మేరకు రాష్ట్రపతి ముర్మును కోరారు. రాష్ట్ర జాబితాలో ఉన్న విద్య 1976లో 42వ రాజ్యాంగ సవరణ ఫలితంగా ఉమ్మడి జాబితాలోకి మారిందని గుర్తు చేశారు. విద్య సహా ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం కలిగి ఉండే అంశాలన్నీ రాష్ట్ర జాబితాలోనే ఉండాలన్నారు. విద్యను రాష్ట్ర జాబితాలోకి మార్చడం ద్వారా మాత్రమే, క్రూరమైన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) వంటి అర్హత పరీక్షా విధానం పూర్తిగా రద్దవుతుందన్నారు. నీట్ అర్హత పరీక్ష నుంచి రాష్ట్రాన్ని మినహాయించాలంటూ తమిళనాడు ప్రభుత్వం పంపిన బిల్లుపై ఆమోదముద్ర వేయాలని విజ్ఞప్తి చేశారు.

సీజేఐపై ప్రధాని ప్రశంసలు

న్యూఢిల్లీ: ఎర్రకోట నుంచి ప్రసంగించిన ప్రధాని మోదీ సుప్రీంకోర్టును ప్రశంసించారు. సుప్రీం ఇచ్చే తీర్పుల్లో ముఖ్యమైన భాగాలను ప్రాంతీయ భాషల్లో అనువదించి ఇవ్వాలని తీసుకున్న నిర్ణయాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ గురించి ప్రధాని ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వం మాతృభాషలో విద్యాబోధనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఉంటే భారత ప్రధాన న్యాయమూర్తి తీర్పుల్ని పిటిషన్‌దారుల మాతృభాషలో అనువదించి ఇవ్వాలని నిర్ణయించడం హర్షణీయమని అన్నారు. దీని వల్ల మాతృభాషకుండే ప్రాధాన్యత మరింత పెరుగుతుందన్నారు. అదే సమయంలో సభికుల మధ్యలో ఉన్న సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ రెండు చేతులు జోడించి ప్రధానికి నమస్కరించారు.

ప్రతి భారతీయుడి గొంతుక.. భరత మాత: రాహుల్



న్యూఢిల్లీ: అశక్తులు, శక్తివంతులు అనే బేధం లేకుండా ప్రతి ఒక్క భారతీయుని గొంతుకే 'భరత మాత' అని కాంగ్రెస్ నేత రాహుల్ వ్యాఖ్యానించారు. 77వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం రాహుల్ గాంధీ ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో హిందీలో సందేశం ఇచ్చారు. ' నా ప్రేమమయ భరత మాత ఒక భూభాగం కాదు. ఏకరీతి ఆలోచనల సమూహం అంతకన్నా కాదు. ఒకే సంస్కృతి, చరిత్ర, మతం, కులం కాదు. అది ప్రతి ఒక్క భారతీయుడి గొంతుక. అందరిలో లోలోతుల్లో నిగూఢంగా దాగి ఉన్న సంతోషం, ఆందోళనలు, కష్టాల ప్రతిబింబమే భరత మాత. వారి ఆకాంక్షలు, లక్ష్యాలు వినాలంటూ కాస్తంత మౌనంగా ఉండాలి. నిశ్శబ్దంగా, వినమ్రతతో ఉన్నప్పుడు నా భరతమాత గొంతుక వినిపిస్తుంది' అని రాహుల్ ట్వీట్‌చేశారు.

మళ్లీ నేనే!

ఎర్రకోటపై నుంచి ఎన్నికల భేరీ మోగించిన నరేంద్ర మోదీ

వచ్చే ఏడాదీ ఇక్కడినుంచి నేనే జాతినుద్దేశించి ప్రసంగిస్తా

- అవినీతి, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలు.. మూడు చీడ పురుగులు
- ప్రజలంతా వాటిని తప్పనిసరిగా వదిలించుకోవాలి
- ప్రజలంతా నా వాళ్లే.. ప్రజల నుంచే వచ్చా.. ప్రజల కోసమే జీవిస్తా
- అవినీతి పార్టీల కూటమి 'ఇండియా'.. ఎన్డీయే పాలనలో 'న్యూ ఇండియా'
- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి మోదీ



ఎర్రకోట పై నుంచి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఆగస్టు 15వ తేదీన ఢిల్లీ ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేస్తానని, దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తానని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గి, మళ్లీ తానే ప్రధానమంత్రి అవుతానని పరోక్షంగా తేల్చిచెప్పారు. '2047 నాటికి సౌభాగ్యవంతమైన భారత్ అనే కలను సాకారం చేసుకొనే దిశగా రాబోయే ఐదేళ్ల కాలం ఒక స్వర్ణయుగమే అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ మంగళవారం ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి 90 నిమిషాలపాటు ప్రసంగించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సమరశంఖం పూరించారు. రెండోసారి ప్రధానిగా మోదీకి ఇదే చివరి పంద్రాగస్టు ప్రసంగం కావడం విశేషం. ఎర్రకోటపై ప్రసంగించడం ఇది వరుసగా పదోసారి. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే...

దుష్ట రాజకీయాలపై యుద్ధమే

వారసత్వ పార్టీలను ప్రజలంతా వ్యతిరేకించాలి. బుజ్జగింపు రాజకీయాలు సామాజిక న్యాయానికి చాలా హాని కలిగించాయి. అవినీతి, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలు కొన్ని దశాబ్దాలుగా మన వ్యవస్థలో ఒక భాగంగా మారిపోయాయి. దుష్ట రాజకీయాలపై ప్రజలు యుద్ధం ప్రకటించాలి. రాబోయే ఐదేళ్లు చాలా కీలకం. ఈ ఐదేళ్ల కాలంలో మనం చేసే పనులు మరో 1,000 సంవత్సరాలపాటు ప్రభావం చూపుతాయి. మనకు సమర్థవంతమైన యువ జనాభా ఉంది, గొప్ప ప్రజాస్వామ్యం ఉంది, వైవిధ్యం ఉంది. మన ప్రతి కల నెరవేరడానికి ఈ మూడు అంశాలు(త్రివేణి) చాలు. ప్రతిపక్ష కూటమి 'ఇండియా' అవినీతి పార్టీలతో నిండిపోయింది. బుజ్జగింపు రాజకీయాలకు, కుటుంబ పాలనకు పెద్దపీట వేసే పార్టీలు 'ఇండియా' పేరిట ఒక్కటయ్యాయి. ఎన్డీయే పాలనలో 'న్యూ ఇండియా' ఆత్మవిశ్వాసంతో ప్రకాశిస్తోంది.

'బంగారు పక్షి'గా భారత్

మనం గత 1,000 సంవత్సరాల బానిసత్వం, 1,000 సంవత్సరాల భవ్యమైన భవిష్యత్తు మధ్య మైలురాయి వద్ద ఉన్నాం. పరుగు ఆపొద్దు. కోల్పోయిన వైభవాన్ని తిరిగి సంపాదించుకోవాలి. రాబోయే వెయ్యేళ్ల దిశగా మన అడుగులను నిర్దేశించుకోవాలి. 2047 నాటికి మనదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది. ఇది కేవలం ఒక కల కాదు, 140 కోట్ల మంది సంకల్పం. మనలో ప్రతిభాపాటవాలకు, శక్తి సామర్థ్యాలకు కొదవ లేదని 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశ చరిత్ర నిరూపించింది. 'బంగారు పక్షి'గా మన దేశం మళ్లీ మారడం ఖాయం. మణిపూర్‌లో శాంతి నెలకొంటుంది.



ఎన్‌సీసీ క్యాడెట్లతో మోదీ ముచ్చట్లు

ధరల నియంత్రణకు మరిన్ని చర్యలు

ధరల పెరుగుదలను అడ్డుకోవడానికి చర్యలు తీసుకుంటాం. ఉక్రెయిన్-రష్యా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ప్రపంచమంతటా ద్రవ్యోల్బణం అధికంగా ఉంది.

6జీ టెక్నాలజీకి దేశం సన్నద్ధం

దేశంలో 5జీ టెక్నాలజీ శరవేగంగా విస్తరిస్తోంది. ఇక 6జీ టెక్నాలజీ కోసం భారత్ సన్నద్ధమవుతోంది. ఈ విషయంలో ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం. దేశంలో ప్రతి గ్రామానికీ ఇంటర్నెట్ చేరుకుంది. క్వాంటమ్ కంప్యూటర్ల రాక కోసం దేశం ఎదురు చూస్తోంది. ఆధునిక ప్రపంచాన్ని సాంకేతికత ప్రభావితం చేస్తోంది. 'డిజిటల్ ఇండియా' విజయగాథలను తెలుసుకోవడానికి అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఆసక్తి చూపుతున్నాయి. అవినీతి అరికట్టడానికి ప్రభుత్వం టెక్నాలజీని ఉపయోగించుకుంటోంది. మన దేశంలో సెమీకండక్టర్లను ఉత్పత్తి చేయబోతున్నాం. గతంతో పోలిస్తే డేటా చార్జీలు భారీగా తగ్గాయి. దీనివల్ల ప్రజలకు డబ్బు ఆదా అవుతోంది. శక్తివంతమైన జీ-20 కూటమికి ఈసారి మనమే సారథ్యం వహిస్తున్నాం.

స్వయం సహాయక సంఘాలకు అగ్రి-డ్రోన్లు

వ్యవసాయ రంగంలో టెక్నాలజీని ప్రవేశపెట్టడానికి కొత్త పథకం రూపొందిస్తున్నాం. ఇందులో భాగంగా వేలాది మహిళా స్వయం సహాయక సంఘాలకు డ్రోన్ల వాడకంలో, మరమ్మతుల్లో శిక్షణ ఇస్తాం. తొలుత 15,000 స్వయం సహాయక సంఘాలతో ఈ పథకాన్ని ప్రారంభించబోతున్నాం. వారికి అగ్రి-డ్రోన్లు అందజేస్తాం. మహిళల సారథ్యంలోనే దేశాభివృద్ధి జరగాలని కోరుకుంటున్నాం, ఆ దిశగా కృషి చేస్తున్నాం. 2 కోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా మార్చాలన్నదే నా లక్ష్యం. రైతాంగ ప్రయోజనం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.2.5 లక్షల కోట్లకుపైగా సొమ్మును రైతుల ఖాతాల్లో జమచేశాం. ఎరువులపై భారీగా రాయితీలు ఇస్తున్నాం. అలాగే చౌక ధరలకే ఔషధాలు విక్రయించే 'జన ఔషధి కేంద్రాల' సంఖ్యను 25,000కు పెంచుతాం. నగరాల్లో సొంత ఇల్లు సమకూర్చుకోవాలని భావించే మధ్యతరగతి ప్రజలకు బ్యాంకు రుణాల వడ్డీల నుంచి ఉపశమనం కలిగించడానికి పథకం ప్రారంభిస్తాం.

మన స్టార్టప్‌లు భేష్

ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ మనదేశంలోనే ఉంది. మన యువత కృషితోపాటు ప్రభుత్వం అందించిన ప్రోత్సాహమే ఇందుకు కారణం. యువ శక్తిపై నాకు ఎంతో విశ్వాసం ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి 98,119 స్టార్టప్‌లను ప్రభుత్వం గుర్తించింది. వాటికి నిధులతోపాటు ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తోంది. వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో మనం ముందంజలో ఉన్నాం. నిర్దేశిత హరిత లక్ష్యాలను గడువు కంటే ముందే సాధించాం. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం. మన సైనిక దళాలను ఆధునీకరించడానికి నిరంతరం కృషి చేస్తున్నాం. గతంలో బాంబుపేలుళ్ల గురించి వినేవాళ్లం. ఇప్పుడు దేశం భద్రంగా ఉంది. శాంతి భద్రతలు ఉన్నప్పుడే అభివృద్ధిపై దృష్టి పెట్టగలుగుతాం. స్పేస్ టెక్నాలజీలో అభివృద్ధి సాధిస్తున్నాం. వందే భారత్ రైళ్లు ప్రారంభించుకుంటున్నాం. బుల్లెట్ రైళ్ల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

9 కోట్ల మంది అనర్హులను ఏరిపారేశాం



గత తొమ్మిదేళ్లలో సంక్షేమ పథకాలను ప్రక్షాళన చేశాం. పారదర్శకత తీసుకొచ్చాం. 9 కోట్ల మంది అనర్హులను ఏరిపారేశాం. అవినీతిపరుల ఆస్తుల స్వాధీనం తొమ్మిదేళ్లలో 20 రెట్లు పెరిగింది. అవినీతిపరులకు కోర్టుల నుంచి బెయిల్ దొరకడం కష్టంగా మారింది. ఎన్నో ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశాం. పునాదిరాళ్లు వేశాం. వాటిని నేనే ప్రారంభిస్తానన్న విశ్వాసం ఉంది. పార్లమెంట్ నూతన భవన నిర్మాణాన్ని గడువు కంటే ముందే పూర్తిచేశాం. 2014లో మనది ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. 140 కోట్ల మంది శ్రమతో ఇప్పుడు ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదిగాం. ఇదంతా సులభంగా జరగలేదు. అవినీతిని అరికట్టాం. బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించాం. గ్లోబల్ సప్లై చైన్‌లో భారత్ ఇప్పుడు ముఖ్యమైన భాగస్వామి. మన దేశం సాధించిన విజయాలు ప్రపంచ స్థిరత్వానికి ఒక హామీగా నిలుస్తాయి. భారత్‌కు ఇక తిరుగులేదని ప్రపంచ నిపుణులు చెబుతున్నారు. శషభిషలకు ఇక తావు లేదు. మన పట్ల ప్రపంచానికి నమ్మకం పెరిగింది. బంతి మన కోర్టులోనే ఉంది. ఈ అవకాశం జారవిడుచుకోవద్దు.

నా ప్రతి కల జనం కోసమే

ప్రజలంతా నా వాళ్లే. నేను ప్రజల నుంచే వచ్చా. ప్రజల కోసమే జీవిస్తా. నేను ఏదైనా కల కన్నానంటే అది జనం కోసమే. వారి కోసం కష్టపడి పని చేస్తున్నా. ఇదంతా కేవలం ఒక బాధ్యత అప్పగించారు కాబట్టి చేయట్లేదు, ప్రజలను నా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నాను కాబట్టి చేస్తున్నా. ప్రజల్లో ఒకడిగా ఆ ప్రజల బాధలను, కష్టాలను సహించలేను. ప్రజల కలలు విచ్ఛిన్నమైపోవడాన్ని అనుమతించను. 'దేశమే ప్రథమం' అనే స్ఫూర్తితో జనం కోసం పని చేస్తున్నా.

విశ్వకర్మ యోజన

రూ.13,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్లతో విశ్వకర్మ యోజన అమలు చేస్తాం. వడ్రంగులు, స్వర్ణకారుల వంటి సంప్రదాయ వృత్తుల్లో ఉన్న వారికి జీవనోపాధి అవకాశాలు పెంచడమే ఈ పథకం లక్ష్యం. దీంతో ప్రధానంగా ఓబీసీలు ప్రయోజనం పొందుతారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 17న ఈ పథకాన్ని ప్రారంభిస్తాం. పేదరికం తగ్గితే మధ్య తరగతి ప్రజల బలం పెరుగుతుంది. దేశంలో గత ఐదేళ్లలో 13.5 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ఇంతకంటే జీవితంలో సంతృప్తి ఇంకేమీ ఉండదు.

ట్రంప్‌పై మరో తీవ్రమైన అభియోగం

అధ్యక్ష ఎన్నికల్లో ఫలితాల తారుమారుకు యత్నించారని ఆరోపణ

వాషింగ్టన్: రెండోసారి అమెరికా అధ్యక్షునిగా ఎన్నికయ్యేందుకు అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి జార్జియా రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని డొనాల్డ్ ట్రంప్‌పై అమెరికా గ్రాండ్ జ్యూరీ అభియోగాలు నమోదుచేసింది. మరోసారి అధ్యక్షపీఠంపై కూర్చుకునేందుకు తహతహలాడుతున్న ట్రంప్‌పై అభియోగాలు నమోదవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఫుల్టన్ కౌంటీ గ్రాండ్ జ్యూరీ సోమవారం తన 41-చార్జ్ అభియోగాల పత్రంలో సంబంధిత వివరాలను పొందుపరిచింది. ట్రంప్‌తోపాటు మరో 18 మందిపై అభియోగాలు నమోదయ్యాయి. ఎన్నికల ఫలితాలు ట్రంప్‌కు అనుకూలంగా వచ్చేలా చేసేందుకు తోటి వ్యక్తులు కుట్ర పన్నారని జ్యూరీ పేర్కొంది. ఆగస్ట్ 25వ తేదీలోపు ఈ 19 మంది స్వచ్ఛందంగా సరెండర్ కావాలని ఫుల్టన్ కౌంటీ జిల్లా మహిళా అటార్నీ ఫ్యానీ విల్లీస్ సోమవారం ఆదేశించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ట్రంప్ మాజీ న్యాయవాది రూడీ గిలియానీ, శ్వేతసౌధం మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మార్క్ మిడోస్, అధ్యక్షభవనం మాజీ న్యాయవాది జాన్ ఈస్ట్‌మన్, న్యాయశాఖ మాజీ ఉన్నతాధికారి జెఫ్రీ క్లార్క్ ఉన్నారు.



రాజకీయ దురుద్దేశం: ట్రంప్

'ఇదంతా రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న ఆరోపణ' అని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అభియోగాలను అధికార డెమొక్రటిక్ పార్టీ నేతలు సమర్థించారు. 'ఎన్నికల ప్రక్రియను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ట్రంప్ పన్నిన కుట్రను ఈ అభియోగాలు బట్టబయలుచేస్తున్నాయి' అని సెనేట్ మెజారిటీ లీడర్ షూమర్, హౌజ్ మైనారిటీ లీడర్ హకీమ్ అన్నారు.



రష్యా గ్యాస్ స్టేషన్‌లో భారీ పేలుడు

35 మంది మృతి, 115 మందికి గాయాలు

మాస్కో: రష్యాలోని దక్షిణ ప్రాంత దగెస్తాన్ రిపబ్లిక్‌లోని ఓ గ్యాస్ స్టేషన్‌లో సంభవించిన భారీ పేలుడులో 35 మంది చనిపోగా మరో 115 మంది క్షతగాత్రులయ్యారు. దగెస్తాన్ రాజధాని మఖాచ్కాలా శివారులో సోమవారం రాత్రి ఈ పెను విషాద ఘటన చోటుచేసుకుంది. మృతుల్లో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన మరో 16 మంది చిన్నారులు సహా 65 మందిని ఆస్పత్రులకు తరలించారు. వీరిలో ఇద్దరు చిన్నారులు సహా 11 మంది పరిస్థితి విషమంగా ఉంది. మొదటగా కారు రిపేరు షెడ్డులో ప్రారంభమైన మంటలు సమీపంలోని గ్యాస్ స్టేషన్‌కు పాకడంతో పేలుడు సంభవించినట్లు అధికారులు వివరించారు. ఇటీవలి కాలంలో రష్యాలో సంభవించిన అతిపెద్ద పేలుడు ఘటన ఇదే.

53కు చేరిన 'హిమాచల్' మరణాలు

షిమ్లా: వర్షబీభత్సంతో అతలాకుతలమైన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో తాజాగా వర్షసంబంధ ఘటనల్లో మరణాల సంఖ్య 53కు పెరిగింది. షిమ్లాలోని శివాలయంపై కొండచరియలు పడిన దుర్ఘటనలో ఘటనాస్థలి నుంచి మరో రెండు మృతదేహాలను వెలికితీశారు. సమ్మర్‌హిల్, ఫాగ్లీలో కొండచరియలు పడిన ఘటనలో ఇప్పటిదాకా 16 మృతదేహాలను వెలికితీశారు. ఇంకా ఈ ప్రాంతాల్లో మరో 10 మంది శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని అధికారులు భావిస్తున్నారు. బాధితుల జాడ కోసం ఘటనాస్థలాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్, సైన్యం ముమ్మర గాలింపు చర్యలను చేపట్టిందని షిమ్లా డెప్యూటీ కమిషనర్ ఆదిత్య నేగీ చెప్పారు. భారీ వర్షాల కారణంగా సోమవారం సహాయక చర్యలను ఆపేయాల్సి వచ్చింది. కొండచరియలు పడటంతో ప్రఖ్యాత వారసత్వ షిమ్లా-కల్కా రైల్వేలైన్ మార్గం దెబ్బతింది. 50 మీటర్లమేర వంతెన కొట్టుకుపోవడంతో అక్కడి రైలు పట్టాలు గాల్లో వేలాడుతున్నాయి. రాష్ట్రంలో 12 జిల్లాలుండగా 11 జిల్లాల్లో వేలకొలదీ విద్యుత్, వందలకొలదీ నీటి సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. 10వేల గృహాలు ధ్వంసమయ్యాయి. కాగా, ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కొండచరియలు పడిన ఘటనల్లో గల్లంతైన వారి జాడ కోసం అన్వేషణ మంగళవారం మొదలైంది. ఇప్పటిదాకా వర్ష సంబంధ ఘటనల్లో ఉత్తరాఖండ్‌లో నలుగురు మరణించారు. వేర్వేరు చోట్ల తొమ్మిది మంది జాడ తెలియాల్సిఉంది.

'సులభ్' పాఠక్ కన్నుమూత

- స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న కొద్దిసేపటికే అస్వస్థత
- ఢిల్లీ ఎయిమ్స్‌లో తుదిశ్వాస

న్యూఢిల్లీ: సులభ్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు, సామాజిక కార్యకర్త బిందేశ్వర్ పాఠక్(80) కన్నుమూశారు. ప్రజా మరుగుదొడ్లను నిర్మించడంలో ఆద్యుడిగా ఆయనకు పేరుంది. మంగళవారం ఉదయం పాఠక్ పాలమ్-డాబ్రి రోడ్డులో ఉన్న సులభ్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కొద్ది సేపటి తర్వాత ఇబ్బందిగా ఉందని చెప్పడంతో ఆయన్ను ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రిలోనే ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు సన్నిహితులు వెల్లడించారు. పాఠక్ నెలకొల్పిన సులభ్ ఇంటర్నేషనల్ సామాజిక సేవా సంస్థ మానవ హక్కులు, పర్యావరణ పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, విద్యా సంస్కరణల కోసం కృషి చేస్తోంది. బిహార్ రాష్ట్రం వైశాలి జిల్లా రాంపూర్ బఘేల్ గ్రామంలో ఓ బ్రాహ్మణ కుటుంబంలో పాఠక్ జన్మించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతిపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. 'పరిశుభ్ర భారత్ లక్ష్యంగా పనిచేశారు. స్వచ్ఛ భారత్ మిషన్‌కు మద్దతుగా నిలిచారు'అంటూ 'ఎక్స్'లో ట్వీట్లు చేశారు.



టాయిలెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా

పాఠక్‌ను 'టాయిలెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేర్కొంటారు. పీహెచ్‌డీ థీసిస్‌లో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటించి పారిశుధ్య కార్మికులతో గడిపారు. 1968లో పారిశుధ్య కార్మికుల సమస్యలపై పోరాటానికి ఆయన 'భంగి ముక్తి'ఉద్యమంలో పాల్గొన్నారు. బహిరంగ మల విసర్జనను రూపుమాపేందుకు 1970ల్లో సులభ్ సంస్థను స్థాపించి మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభించారు. సులభ్ టాయిలెట్లను అనుసంధానించి దుర్వాసన రాని బయోగ్యాస్ తయారు చేసే విధానానికి మూడు దశాబ్దాల క్రితమే ఆయన ప్రారంభించారు. కేంద్రం ఆయన్ను పద్మభూషణ్‌తో సత్కరించింది. ఆయన్ను ఎన్నో అంతర్జాతీయ పురస్కారాలు వరించాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న 1,600 పట్టణాల్లోని 9 వేలకు పైగా పబ్లిక్ టాయిలెట్లను సులభ్ నిర్వహిస్తోంది.

అబద్ధాలు, అతిశయోక్తులు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: స్వాతంత్ర్యదిన వేడుకల్లో ప్రధాని మోదీ ప్రసంగంపై విపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. వక్రీకరణలు, అబద్ధాలు, అతిశయోక్తులు, శుష్కవాగ్దానాలతో కూడిన ఎన్నికల ప్రసంగం చేశారని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. స్వాతంత్ర్యదినోత్సవ వేళ దేశ ప్రజలందరినీ ఏకతాటికి పైకి తేవాల్సిన ప్రధాని ప్రసంగంలో తన గొప్పలు, ప్రతిష్ఠ గురించి చెప్పుకోవడానికే సరిపోయిందని పేర్కొంది. స్వాతంత్ర్యదినోత్సవం నాడు ప్రధాని ప్రతిపక్షాలను విమర్శిస్తున్నారంటే భారత్‌ను ఆయన ఎలా తీర్చిదిద్దగలరని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ప్రశ్నించారు. గత తొమ్మిదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రజలకి ఏం చేసిందో చెప్పకుండా ఎన్నికల ప్రసంగంలా మార్చేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఆరోపించారు.

అక్షయ్ కుమార్‌కు భారత పౌరసత్వం



ముంబై: ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్(55)కు భారత పౌరసత్వం లభించింది. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంగళవారం ఆయన స్వయంగా ప్రకటించారు. 'నేను మళ్లీ భారత పౌరుడినయ్యా. నా హృదయం, పౌరసత్వం రెండూ హిందుస్తానీయే. హ్యాపీ ఇండిపెండెన్స్ డే, జై హింద్!' అని పేర్కొన్నారు. భారత పౌరసత్వం ధ్రువీకరణ పత్రాన్ని ఆయన షేర్ చేశారు. 1990ల్లో తను నటించిన సినిమాలు వరుసగా 15 వరకు ఫ్లాప్ కావడంతో కెనడా పౌరసత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లు గతంలో ఆయన తెలిపారు. 2019 ఎన్నికల సమయంలో ప్రధాని మోదీతో అక్షయ్ కుమార్ భేటీ అయ్యారు. దీని తర్వాత ఆయన పౌరసత్వం అంశంపై మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. దీంతో, ఆ ఎన్నికల్లో ఆయన ఓటు వేయలేదు. భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అక్షయ్ ఆ తర్వాత ప్రకటించారు. అక్షయ్ హీరోగా నటించిన 'ఓఎంజీ 2' సినిమా గత వారం దేశవ్యాప్తంగా థియేటర్లలో విడుదలయింది.

అల్లర్ల బాధితులకు రెడీమేడ్ ఇళ్లు



ఇంఫాల్: మణిపూర్ అల్లర్లలో నిరాశ్రయులైన 3 వేల కుటుంబాలకు మొదటి విడతలో ఫ్యాబ్రికేటెడ్ ఇళ్లను సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జూన్ 26వ తేదీ నుంచి రాష్ట్రంలోని అయిదు ప్రాంతాల్లో రెడీమేడ్ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించింది. ఈ బాధ్యతను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించింది. గత మూడు నెలలుగా కొనసాగుతున్న అల్లర్లలో ఇళ్లు కోల్పోయిన వేలాదిమంది ప్రభుత్వం నిర్వహిస్తున్న తాత్కాలిక సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. మణిపూర్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.బ్రోజెంద్రో వివరాలు వెల్లడించారు. 'రహదారుల దిగ్బంధం కారణంగా ఇంటి సామగ్రి రవాణా కష్టంగా మారింది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిబ్బందిని విమానాల ద్వారా అక్కడికి తరలిస్తున్నాం. పశ్చిమ ఇంఫాల్‌లోని సెక్మాయ్, తూర్పు ఇంఫాల్‌లోని సవోంబుగ్‌ల్లో ఇళ్లు నిర్మిస్తున్నాం. వైరి వర్గాల మధ్య కాల్పుల ఘటనల కారణంగా క్వాక్తా ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం ఆగిపోయింది' అని చెప్పారు.

చైనాలో తగ్గని వరదలు

బీజింగ్: చైనాను వరదలు ఇంకా వణికిస్తున్నాయి. ఈశాన్య చైనాలో ఏకంగా 90 నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. వీటిలో 24 ప్రమాదకర స్థాయి దాటి ప్రవహిస్తున్నాయి. బీజింగ్‌కు ఉత్తరాన ఉన్న సొంగలియో తీర ప్రాంతానికి వరద ముప్పు ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ తీర ప్రాంతంలో నాలుగు ప్రావిన్స్‌లు, పలు నగరాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో దాదాపుగా 10 కోట్ల మంది నివసిస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో సహాయ సిబ్బంది రంగంలోకి దిగారు. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలను తరలిస్తున్నారు. వాతావరణ మార్పులతో చైనాలో కనీవినీ ఎరుగని రీతిలో వర్షాలు కురుస్తున్నాయి. జులైలో కురిసిన వర్షాలకు 150 మంది వరకు మరణించారు. భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

సాక్షి
హైదరాబాద్
బుధవారం । 16 । ఆగస్టు । 2023



మతోన్మాదాన్ని తుదముట్టించాలి

దేశంలో మతోన్మాదాన్ని తుదముట్టించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. -8లో



సాధన, శిక్షణతోనే నైపుణ్యం

సాధన,శిక్షణ ద్వారానే క్రీడా నైపుణ్యం వెలుగులోకి వస్తుందని అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు సునీల్ జోషి అన్నారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో నాకౌట్ క్రికెట్ పోటీలను ఆయన వీక్షించారు. -8లో

18న పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా 30 కేంద్రాల్లో జూన్ 30 నుంచి జులై 10 వరకు జరిగిన ఉమ్మడి పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షల ఫలితాలు ఈ నెల 18న విడుదల కానున్నాయి. టీఎస్‌పీజీసీఈటీ-2023లో భాగంగా ఓయూ నిర్వహించిన 44 పీజీ కోర్సుల ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాయలంలో అధికారులు విడుదల చేయనున్నారు.

మురిసిన మువ్వన్నెలు



ఝాన్సీ లక్ష్మీబాయ్, సుభాష్ చంద్రబోస్ వేషధారణలో చిన్నారులు

బేగంబజార్‌లో జాతీయ జెండాతో బాలిక

గోల్కొండ కోటపై జెండావిష్కరణ చేసేందుకు వస్తున్న సీఎం కేసీఆర్





గోల్కొండ కోటలో సాంస్కృతిక ప్రదర్శన, పోలీసు బలగాల కవాతు

దేశభక్తి ఉప్పొంగింది. జాతీయతా భావం వెల్లివిరిసింది. ఐక్యతా రాగం రాజిల్లింది. మువ్వన్నెల జెండా మురిసిపోయింది. భారత మాతాకీ జై అనే నినాదాలు మార్మోగాయి. మంగళవారం స్వాతంత్య్ర దిన వేడుకలు ఘనంగా జరిగాయి. గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. బల్దియా కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్ రాస్, కలెక్టరేట్‌లో అనుదీప్ దురిశెట్టి, జలమండలి కార్యాలయంలో ఎండీ దానకిశోర్, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరించి పంద్రాగస్టు సంబరాలను వేడుకగా నిర్వహించారు. గోల్కొండ కోటలో సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీసు బలగాల కవాతు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. - సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు



సచివాలయం ఎదుట యువతుల కేరింతలు





ట్యాంక్‌బండ్‌పై జాతీయ జెండాల ప్రదర్శన



బేగంబజార్‌లో..

మాది ఉత్తమ పాలన

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

హిమాయత్‌నగర్: జీహెచ్‌ఎంసీ ప్రజల పక్షాన నిలుస్తూ అత్యుత్తమ పాలన అందిస్తోందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ రోనాల్డ్ రాస్‌తో కలిసి ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం యూబీడీకి చెందిన బెస్ట్ నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్‌లో ఉత్తమ సేవలను అందించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఈఎన్‌సీ జియావుద్దీన్, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, సరోజ తదితరులు పాల్గొన్నారు.





ట్యాంక్‌బండ్‌పై..



ఎన్టీఆర్ గార్డెన్ వద్ద కిక్కిరిసి..

సందర్శకుల సందడి

ఖైరతాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సాగర తీరంలో జాతీయ జెండాలతో నగరవాసులు సందడి చేశారు. సచివాలయం, లుంబినీ పార్క్, ఎన్టీఆర్ గార్డెన్, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, నెక్లెస్ రోడ్‌లలో బైక్‌లు, వాహనాల్లో జాతీయ జెండాలను చేబూని వేడుకలను జరుపుకొన్నారు. లుంబినీ పార్క్, ఎన్టీఆర్ గార్డెన్‌లు పర్యాటకులతో నిండిపోయాయి.



అంబేద్కర్ విగ్రహం వద్ద సందర్శకుల సెల్ఫీలు

త్రిచక్రవాహనం.. త్రివర్ణ పతాకం: నెక్లెస్ రోడ్డులో..

న్యూస్‌రీల్

24 గంటల తాగునీటి సరఫరాకు ప్రణాళిక

- జలమండలి ఎండీ దాన కిశోర్



సాక్షి, సిటీబ్యూరో: భవిష్యత్తులో 24 గంటలు తాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జలమండలి ఎండీ దాన కిశోర్ వెల్లడించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నగర భవిష్యత్తు తాగునీటి అవసరాల దృష్ట్యా అదనంగా మరో 10 టీఎంసీల నీటిని సరఫరా చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. మురుగు నీటి నుంచి హైడ్రోజన్ ఇంధనాన్ని ఉత్పత్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. రాష్ట ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న దళితబంధు పథకంలో భాగంగా కార్మికులకు 160 వాహనాలను సైతం త్వరలో అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎండీ దానకిశోర్‌ను రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ పి.నారాయణ శాలువాతో సన్మానించారు.

ఇంటింటా ఇన్నోవేటర్‌కు అనూహ్య స్పందన

రాయదుర్గం: గ్రామీణ ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో తెలంగాణ ముందంజలో ఉంది. నగరంలో మంగళవారం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంట్లో దాగి ఉన్న ఆవిష్కర్తలను వెలికి తీయడమే ఇంటింటా ఇన్నోవేటర్ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతా తౌటం పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పల్లెపల్లెకూ తీసుకెళ్తున్నామన్నారు.

బాధ్యతలు నిబద్ధతతో నిర్వర్తిస్తే .. అంతకు మించిన దేశభక్తి లేదు

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, సిటీబ్యూరో: ప్రతి ఉద్యోగి తన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తే అంతకుమించిన దేశభక్తి లేదని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. జిల్లాలో విశేష సేవలందించిన 64 మంది అధికారులకు, సిబ్బందికి ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్, ఆర్డీఓ వెంకటాచారి పాల్గొన్నారు.

గ్రీన్ సిగ్నల్

వచ్చే నెలలో ఎయిర్‌పోర్టు మెట్రో పనులు

- సకాలంలో పూర్తి చేసేందుకు కార్యాచరణ
- ఎల్‌అండ్‌టీ చేతికే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు
- త్వరలో అధికారికంగా వెల్లడించే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టు పనులు వచ్చే నెలలో ప్రారంభం కానున్నాయి. నిర్ణీత గడువులోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేసేలా హెచ్ఏఎంఎల్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించింది. మరోవైపు రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు 31 కిలోమీటర్ల మార్గంలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టును ఎల్‌అండ్‌టీ సంస్థ దక్కించుకుంది. ఈ మేరకు త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి 13 అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు పోటీ పడగా చివరకు ఎల్‌అండ్‌టీతో పాటు ఎన్‌సీసీ సంస్థలో బరిలో పోటీకి నిలిచిన సంగతి తెలిసిందే. ఈ రెండు సంస్థలు రూ.5,688 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ముందుకు వచ్చాయి. దీంతో నిర్మాణ రంగంలో ఉన్న అపారమైన అనుభవం, మెట్రోరైల్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన అర్హతలు, ప్రామాణికత, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, యంత్రాలు, నిర్మాణ పద్ధతులు, వివిధ రంగాల్లో ఇప్పటి వరకు పూర్తి చేసిన నిర్మాణాలు, ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణంలో అనుభవాలు తదితర అంశాలను ప్రాతిపదికగా చేసుకొని అంతిమంగా ఎల్‌అండ్‌టీ సంస్థ ఎంపిక చేసినట్లు సమాచారం.

పూర్వానుభవంతో..

నగరంలో 72 కి.మీ మెట్రో రైల్ మార్గాన్ని నిర్మించిన అనుభవం కూడా ఉంది. దీంతో ప్రతిష్ఠాత్మకమైన ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టును త్వరలోనే ఆ సంస్థకు అప్పగించే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు సుమారు 31 కి.మీ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ కోసం ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో నిర్మించనున్నారు. వచ్చే సెప్టెంబరులో పనులు ప్రారంభించి 36 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలను సిద్ధం చేశారు.

పూర్తి బాధ్యత నిర్మాణ సంస్థదే...

- ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్ పూర్తయింది. పెగ్‌మార్కింగ్ కూడా చేశారు. భూసార పరీక్షలు సైతంపూర్తయ్యాయి. త్వరలో నిర్మాణ సంస్థకు పనులను అప్పగించనున్నారు. సెప్టెంబరులోనే పనులు చేపట్టనున్నారు. రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు 31 కి.మీ మార్గంలో 29.3 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ కాగా, మరో 1.7 కి.మీ మార్గంలో భూగర్భ లైన్లు నిర్మించనున్నారు.
- మొదటి దశ మెట్రోలో డిజైన్,బిల్డ్,ఫైనాన్స్,ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ విధానాన్ని పాటించారు.ఈ మేరకు హెచ్ఎంఆర్ఎల్‌తో పాటు, ఎల్‌అండ్‌టీ సంస్థలు కూడా భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. ఎయిర్‌పోర్టు మెట్రో పూర్తిగా ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న ప్రాజెక్టు. అందుకే దీన్ని ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ పద్ధతిలో నిర్మించనున్నారు. ఈ నిర్మాణంలో భాగంగా ప్రాజెక్టును చేపట్టిన సంస్థే ఎలివేటెడ్ వయాడక్ట్‌తో పాటు ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్ పనులు చేపట్టాల్సి ఉంటుంది. ట్రాక్స్, రోలింగ్ స్టాక్, విద్యుత్, టెలీ కమ్యూనికేషన్స్, ఆటోమేటిక్ ఫేర్ సిస్టమ్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది

ఔటర్ అంచుల్లో మణిహారం...

ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణంతో నగరంలో పడమటి వైపు నుంచి దక్షిణాది అభివృద్ధి మరింత పరుగులు పెట్టే అవకాశం ఉంది. నిర్మాణరంగం ఉరకలు వేయనుంది. ఔటర్ మార్గంలో 31 కి.మీ వరకు ఇదో అద్భుతమైన మణిహారంలా భాసిల్లనుంది. ఎయిర్‌పోర్టు మెట్రో అందుబాటులోకి వస్తే కేవలం ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులకే కాకుండా నార్సింగి, కోకాపేట్, మణికొండ, బుద్వేల్ తదితర ప్రాంతాల నుంచి శంషాబాద్ వరకు సాధారణ ప్రజలకు కూడా రవాణా సేవలు లభిస్తాయి.




9 నంబర్లు వస్తే.. లిఫ్ట్ చేయొద్దు

ఫోన్ కోడ్ అంకెలు మార్ఫింగ్ చేస్తూ సైబర్ మోసాలు

- 9 అంకెల నంబర్ ఫోన్ కాల్స్ డేంజర్
- సమాధానం ఇస్తే బ్యాంకు బ్యాలెన్స్ జీరో
- సైబర్ క్రిమినల్స్ నయా క్రైమ్

సాక్షి, సిటీబ్యూరో: +91తో కలిపి 9 అంకెల నంబర్‌తో మీకు ఫోన్ కాల్స్ వస్తున్నాయా.. ఆ ఫోన్ కాల్స్ సమాధానం ఇస్తున్నారా.. అయితే మీ ఖాతాలు ఖాళీ. కేవలం మహిళలను కలవర పెట్టి, భయం సృష్టించి సైబర్ మోసగాళ్లు లక్షలాది రూపాయలను కొల్లగొడుతున్నారు. నగరంలో నమోదైన 30 ఫిర్యాదులే ఇందుకు నిదర్శనం. నేర ప్రక్రియ ఇలా సాగుతోంది..



- సైబర్ మోసగాళ్లు తాజాగా voip (వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్) ద్వారా +91 తో కలిపి 9 అంకెల నంబర్లతో ఫోన్ చేస్తున్నారు. ఈ ఫోన్ ఎత్తగానే మేం ముంబై సీబీఐ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నాం. మీ ఆధార్, మీ పేరు ఇదేనా అని అడుగుతారు. మీరు ముంబై నుంచి తైవాన్‌కు ఫెడ్‌ఎక్స్ కొరియర్ ద్వారా పార్శిల్ పంపిస్తున్నారని అందులో డ్రగ్స్ ఉన్నాయని, ఇంకా అనుమానాస్పద పత్రాలు ఇతర దేశాలకు పంపిస్తున్నారని, మీరు మనీ లాండరింగ్‌కు పాల్పడుతున్నారని కొరియర్ ప్రతినిధి చెప్తాడు. మీ మీద ముంబై సీబీఐ కేసు నమోదు చేసిందని.. ఈ సమాచారాన్ని మీ స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చామని వారు 20 నిమిషాల్లో మిమ్మల్ని అరెస్టు చేసి మాకు అప్పగిస్తారని వివరిస్తాడు. ఈ మాటలకు భయపడి మా తప్పు లేదు మమ్మల్ని రక్షించండి అని ప్రాధేయపడగానే లూటీ మొదలు పెడతారు. స్క్రీన్ షేరింగ్ యాప్స్‌తో అకౌంట్ ఖాళీ అవుతుంది.
- మీరు నిర్దోషి అని తెలియాలంటే మీ బ్యాంకు ఖాతాలు తనిఖీ చేయాలి. మీకు మొత్తం ఎన్ని ఖాతాలు ఉన్నాయి చెప్పండి అని బ్యాంకు ఖాతా వివరాలు సేకరిస్తారు. స్క్రీన్ షేరింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయిస్తారు. దీంతో మీ ఫోన్ మొత్తం వారి కంట్రోల్‌కి వెళ్లిపోతుంది. వెంటనే మీ ఖాతా నుంచి మా సీబీఐ ఖాతాకు కొంత డబ్బు పంపమని చెబుతారు. ఈ సమయంలో సైబర్ మోసగాళ్లు స్క్రీన్ షేరింగ్ యాప్స్ ద్వారా మీ బ్యాంకు ఖాతా నంబర్, పాస్‌వర్డ్, యూజర్ నేమ్, పిన్ నంబర్లను తెలుసుకుంటారు. దాదాపు అలా 3 గంటల పాటు మాటల్లో పెట్టి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తారు.
- ఇలా హైదరాబాద్ నగరంలో ఇలాంటి మోసానికి గురైన వారి సంఖ్య 30 వరకు చేరింది. ఇందులో 23 మంది మహిళలు బాధితులుగా పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కారు. అత్యధికంగా ఓ మహిళ రూ.40 లక్షలు పోగుట్టుకుంది. మొత్తం సైబర్ నేరగాళ్లు దాదాపు రూ.1.5 కోట్లు కాజేశారని నమోదైన ఫిర్యాదులతో వెల్లడైంది.

మోసాలకు చెక్ పెట్టాలంటే..

- మనకు వచ్చే ఫోన్ కాల్స్ +91 తో కలిపి 10 అంకెలు ఉంటాయని గ్రహించాలి. 'ముంబై టూ తైవాన్ ఫెడ్ ఎక్స్ కొరియర్' పేరు చెప్పగానే సైబర్ మోసానికి సంబంధించిన కాల్‌గా అనుమానించాలి.
- సీబీఐ పేరు చెప్పి పోలీసులు వస్తున్నారని మాట్లాడితే సరే పోలీసులు వచ్చిన తర్వాత మాట్లాడుతామని ఫోన్ కట్ చేయాలి.
- స్క్రీన్ షేరింగ్ యాప్స్ డౌన్ లోడ్ చేసుకోమంటే అసలు చేయొద్దు.
- గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్లకు రెస్పాండ్ అవొద్దు.
- గుర్తు తెలియని వ్యక్తులు సుదీర్ఘంగా మాట్లాడేందుకు ప్రయత్నిస్తే అది సైబర్ మోసగాళ్ల ఫోన్ కాల్‌గా భావించాలి.
- ఈ 9 అంకెల ఫోన్ కాల్స్ voip ద్వారా వస్తుండడంతో వీటి ఐపీ అడ్రస్‌లు విదేశాల్లో ఉంటున్నాయి. కొట్టేసిన నగదు కూడా వర్చువల్ కరెన్సీ రూపంలో విదేశాలకు పంపిస్తున్నారని పోలీసులు గుర్తించారు. నయా మోసం నుంచి అప్రమత్తంగా ఉండాలని సిటీ పోలీసులు సూచిస్తున్నారు.డార్క్ వెబ్ ద్వారా సైబర్ క్రిమినల్స్ పలు కొరియర్ సంస్థల నుంచి డేటా కొట్టేశారని పోలీసులు అనుమానిస్తున్నారు.

త్రివర్ణ పతాక రెపరెపలు

నగరంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా విభాగాల అధిపతులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పలువురు అధికారులు, సిబ్బందిని సత్కరించారు. – సిటీ బ్యూరో

సీకా కార్యాలయంలో...



చంచల్‌గూడలోని జైళ్ల శాఖ శిక్షణ సంస్థ (సీకా) మైదానంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండా ఎగరవేస్తున్న ఆ శాఖ డైరెక్టర్ జనరల్ జితేందర్, కార్యక్రమంలో ఐజీ రాజేష్, డీఐజీలు మురళీబాబు, డా. శ్రీనివాస్, సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు. - చంచల్‌గూడ:



జలమండలిలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎండీ దానకిశోర్



కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అనుదీప్







సాక్షి, సిటీ బ్యూరో: గ్రేటర్ లోని మూడు పోలీసు కమిషనరేట్లలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బంజారాహిల్స్ లోని టీఎస్‌పీఐసీసీసీ లో అడ్మిన్ జాయింట్ సీపీ, డీఐజీ పరిమళ హన నూతన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ జెండావిష్కరణ చేశారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ లో సీపీ స్టీఫెన్ రవీంద్ర జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

• 'సాక్షి' ప్రధాన కార్యాలయంలో..



'సాక్షి' ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న 'సాక్షి' సీఈఓ అనురాగ్ శర్మ, డైరెక్టర్లు కేఆర్‌పీరెడ్డి, వైఈపీ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ (హెచ్‌ఆర్) చైతన్య రెడ్డి తదితరులు. - లక్ష్మీకాపూర్

ఎఫ్‌సీఐలో..



ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో సంస్థ డిప్యూటీ జనరల్‌మేనేజర్ కిరణ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

• పవర్‌గ్రిడ్ సదరన్‌రీజియన్‌లో ..



పవర్ గ్రిడ్ సదరన్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టం(సికింద్రాబాద్) ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న సంస్థ ఈడీ రాజేష్ శ్రీవాత్సవ, సీజీఎంలు అలోక్ కుమార్ శర్మ, సంజయ్‌కుమార్‌గుప్తా, హరినాయణ్, తదితరులు పాల్గొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో

ఉత్తమ అధికారులకు ప్రశంస పత్రాలు



స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు గాను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతులు మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న రెవెన్యూ న్యాయ విభాగం సూపరింటెండెంట్ ఎం. నర్సయ్య, పౌరసంబంధాల శాఖ డివిజినల్ అధికారిని అరుంధతి – సాక్షి, సిటీబ్యూరో

జాతీయ జెండాను అవమానించిన వ్యక్తులపై కేసులు నమోదు

చాంద్రాయణగుట్ట: ఓ రౌడీషీటర్ మృతదేహంపై జాతీయ జెండాను చుట్టి అవమానించిన వ్యక్తులపై చాంద్రాయణగుట్ట పోలీసులు కేసులు నమోదు చేశారు. చాంద్రాయణగుట్ట పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రౌడీషీటర్ షేక్ సయీద్ బావజీర్ ఈ నెల 11న తెల్లవారుజామున హత్యకు గురయ్యాడు. దీంతో అతడి అనుచరులు ఖాజా అలీముద్దీన్‌తో పాటు పలువురు ఉస్మానియా మార్చురీలో బావజీర్ మృతదేహంపై జాతీయ జెండాను కప్పి బార్కాస్ వరకు తీసుకొచ్చారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ బావజీర్ మృతదేహంపై జాతీయ జెండాను ఎలా కప్పుతారని జాతీయ జెండాను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 14న స్థానిక బీజేవైఎం ఉపాధ్యక్షులు రాజేశ్ చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఖాజా అలీముద్దీన్‌తో పాటు మరి కొందరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాధన, శిక్షణతోనే నైపుణ్యం



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న సునీల్‌జోషి, మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్ : సాధన,శిక్షణ ద్వారానే క్రీడా నైపుణ్యం వెలుగులోకి వస్తుందని అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు సునీల్ జోషి అన్నారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో జరుగుతున్న నాకౌట్ క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి వీక్షించారు. అనంతరం క్రీడాకారులకు ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో యువత క్రీడలపై ఆశక్తి చూపడం లేదన్నారు. సరైన శిక్షణలేక ఎంతో నైపుణ్యం ఉన్నా కొందరు క్రీడాకారులు క్రీడలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహిండం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం ఫైనల్స్‌లో గెలుపొందిన శ్రీనగర్ కాలనీ జట్టుకు నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, రాజ్ కుమార్ పటేల్, దేదీప్య, డివిజన్ అధ్యక్షులు సంజీవ్, ప్రదీప్, తన్నుఖాన్, సంతోష్ ముదిరాజ్, నాయకులు దుబాయ్ నజీర్, కొండాపురం నాగరాజు, తన్నుఖాన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించినందుకు..

రెడ్డి సంఘాల నేతలపై కేసులు నమోదు

బంజారాహిల్స్: ముందస్తు సమాచారం లేకుండా మంత్రుల నివాసాలను ముట్టడించడమే కాకుండా మంత్రి కాన్వాయ్‌కి అడ్డుపడి గన్‌మెన్‌లను దూషించడంతో పాటు పోలీసు విధులకు ఆటంకం కలిగించినందుకు రెడ్డి సంఘాలకు చెందిన 15 మంది పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రెడ్డి సంఘాలతో పాటు రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో బంజారా హిల్స్ రోడ్డు నెంబర్ 12లోని మంత్రుల నివాసాలను ముట్టడించే ప్రయత్నం చేశారు. మంత్రి జగదీశ్వర్‌రెడ్డి కాన్వాయ్‌ను అడ్డగించేందుకు ప్రయత్నించిన వారు ఆయన గన్‌మెన్‌లను దూషించారు. పోలీసులు వారిని నిలువరించేందుకు ప్రయత్నించగా వారి విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ వెంకటేష్ ఫిర్యాదు మేరకు సంతోష్‌రెడ్డి, రామిరెడ్డి, మాధవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులతో సహా 15 మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాన్ షాప్‌ల్లో హుక్కా ఫ్లేవర్ల విక్రయం

ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

హస్తినాపురం: పాన్ షాపుల్లో నిషేధిత హుక్కా ఫ్లేవర్లను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేంధర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మజీద్‌గల్లీకి చెందిన మహ్మద్ సంయుల్లా షరీఫ్, మహ్మద్ ఇదయాతుల్లా షరీఫ్ నిషేధిత హుక్కా ఫ్లేవర్లను కొనుగోలు చేసి పాన్ షాపులలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం రాత్రి పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా హుక్కా ఫ్లేవర్లు, హుక్కా పాట్, హుక్కా స్మోకింగ్ పైపులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

క్యూనెట్ కేసులో మరొకరి అరెస్ట్



ఉపేంద్రనాథ్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: మల్టీ లెవల్ మార్కెటింగ్(ఎంఎల్ఎం) క్యూనెట్ కేసులో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు మరొకరిని అరెస్ట్ చేశారు. కర్నూలు జిల్లా, చిన్నంపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ ఉపేంద్ర నాథ్ రెడ్డిని సీసీఎస్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నా రు. విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ (క్యూనెట్)పై మహంకాళి పోలీస్ స్టేషన్‌లో నాలుగు కేసులు నమో దయ్యాయి. అనంతరం అదనపు సీపీ(ఎస్‌ఐటీ) ఆదేశాల మేరకు ఈ కేసుల ను హైదరాబాద్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో వి-అంపైర్ పేరుతో నకిలీ కంపెనీలు ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో గుర్తించిన అధికారులు 15 మంది నిందితులపై కేసులు నమోదు చేశారు. వీరు అధిక లాభాలు ఆశ చూపించి నిరుద్యోగులు, గ్రామీణులు, అమాయకుల నుంచి డబ్బులు సేకరించినట్లు గుర్తించారు. ఈ క్రమంలో ప్రధా న నిందితులు రాజేష్‌ఖన్నా, సీహెచ్ ఉపేంద్రనాథ్ రెడ్డి ప్రేరణ క్లాసులు నిర్వహించి సామాన్యులను మల్టీ లెవల్ మార్కెటింగ్‌లో పెట్టుబడులను ఆకర్షించే వారు, ఈ క్రమంలో పెట్టుబడుల పెట్టిన వారికి నెలకు రూ.20 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు సంపాదించుకోవచ్చని ఆశ చూపారు. రిజిస్ట్రేషన్ పేరుతో ఒక్కో బాధితుడి నుంచి రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు చార్జీల రూపంలో వసూలు చేశారు. ఇదే తరహాలో దాదాపు 163 మంది బాధితుల నుంచి రూ.3 కోట్ల వరకు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. విహాన్ డైరెక్ట్ సెల్లింగ్‌లకు చెందిన 35 బ్యాంకు ఖాతాల్లోని రూ.54 కోట్ల నగదును సీజ్ చేసిన పోలీసులు ఇప్పటివరకు 15 మంది నిందితుల్లో 9 మందిని అరెస్ట్ చేశారు.

ప్రధాని నిర్ణయం సాంకేతికాభివృద్ధికి ఊతం

స్టార్టప్ ఇన్నోవేటర్ మారుత్ డ్రోన్స్ వ్యవస్థాపకుడు ప్రేమ్‌కుమార్



ప్రధాని నరేంద్రమోదీతో ప్రేమ్‌కుమార్ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: దేశంలో సాంకేతికంగా నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మహిళలకు డ్రోన్ శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని ప్రధాని ప్రకటించడం శుభ పరిణామమని నగరానికి చెందిన స్టార్టప్ ఇన్నోవేటర్ (ఐఐటీ)–మారుత్ డ్రోన్స్ వ్యవస్థాపకుడు ప్రేమ్‌కుమార్ విస్లావత్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో ప్రధాని గ్రిటెక్ ప్రయోజనాల కోసం డ్రోన్‌ల ఆపరేట్, మరమ్మతు చేయడానికి 15,000 మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులకు శిక్షణ ఇస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు.

మతోన్మాదాన్ని తుదముట్టించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో మతోన్మాదాన్ని తుదముట్టించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో '76 ఏళ్ల స్వాతంత్రం, ఎదురవుతున్న సవాళ్లు' అంశంపై సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లు పూర్తయినా నేటికీ ప్రజలకు రక్షణ కరువైందన్నారు. దళితులు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతుందన్నారు. మణిపూర్ రావణకాష్టంలా మారినా కేంద్ర ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశంలో విద్యా, వైద్యం అందక బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉపాధి లేక యువత అయోమయంలో ఉన్నారన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఎం.దశరథ్, డాక్టర్ అల్వాల్ స్వామి, జి.రాములు, పల్లెల వీరస్వామి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఆర్టీసీ కండక్టర్ దుర్మరణం

- ఢీకొన్న బొలేరో.. ఆర్టీసీ బస్సు
- బస్సు దిగిన కండక్టర్
- అదే సమయంలో వేగంగా ఢీ కొట్టిన లారీ
- అక్కడికక్కడే మృతి



ప్రమాదానికి కారణమైన లారీ



ప్రమాదానికి గురైన బొలేరో, ఆర్టీసీ బస్సు

శామీర్‌పేట్: కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు కండక్టర్ మృతి చెందగా డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సిద్దిపేట జిల్లా, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ బ్యాగరి నవీన్‌కుమార్, వెంకటాపూర్‌కు చెందిన బాలనర్సయ్య(49) మంగళవారం ప్రయాణికులతో జేబీఎస్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో శామీర్‌పేట మండలం, అచ్చాయిపల్లి చౌరస్తా వద్ద ప్రయాణికులను దించేందుకు రోడ్డుపక్కన బస్సును నిలపడంతో అదే సమయంలో వేగంగా వచ్చిన బొలేరో వాహనం బస్సును ఢీ కొట్టింది. దీంతో బస్సు డ్రైవర్, కండక్టర్‌లు కిందకు దిగి బస్సును పరిశీలిస్తుండగా అదే సమయంలో వెనకనుంచి వేగంగా వచ్చిన బస్సును ఢీ కొట్టింది. దీంతో బస్సు బొలేరో వాహనాన్ని తగలడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో కండక్టర్ అక్కడికక్కడే మృతిచెందగా, బస్సు డైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మువ్వన్నెల జెండా రెపరెపలు


బీజేపీ నేత వివేక్ వెంకటస్వామి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


శ్రీరాంనగర్‌లో జెండా ఎగురవేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ


గాయత్రీహిల్స్‌లో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్


కాంగ్రెస్ డీసీసీ ఖైరతాబాద్ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి

జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ జోన్ పరిధిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కార్పొరేటర్లు, వివిధ పార్టీల సీనియర్ నేతలతో పాటు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

–ఖైరతాబాద్/ జూబ్లీహిల్స్ జోన్ బృందం


యూసుఫ్‌గూడ సాయిరాం గార్డెన్స్‌లో చిన్నారి ..


ఫిలింనగర్‌లో స్వాన్ మోడల్ స్కూల్‌లో ఎస్సై అంజనాయాదవ్


ఉదయ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీ సరస్వతి స్కూల్ విద్యార్థులు


కార్పొరేటర్ కవితారెడ్డి, మాజీ కార్పొరేటర్ భారతి నాయక్


సాయి స్ఫూర్తి ఎన్‌క్లేవ్‌లో జూబ్లీహిల్స్ సీఐ రవీంద్రప్రసాద్


జూబ్లీహిల్స్‌లో సీఆర్‌పీఎఫ్ సౌత్ సెక్టార్ ఐజీ చారుసిన్హా


ఫిలింనగర్‌లో విద్యార్థుల విన్యాసాలు


బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్ నరేందర్


ఎఫ్‌ఎన్‌సీసీలో ఆదాయపన్ను శాఖ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాష్


జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


అశ్విన్ ఆసుపత్రి ఆవరణలో..


సైనిక వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు


చిన్నారులతో బీజేపీ నాయకురాలు కీర్తిరెడ్డి జూటూరు


ఎల్లారెడ్డిగూడలో క్రికెటర్, కాంగ్రెస్ మాజీ ఎంపీ అజారుద్దీన్


యాదగిరినగర్‌లో కార్పొరేటర్ దేదీప్యవిజయ్


వేడుకల్లో ఆశ్రయ్-ఆకృతి బధిర విద్యార్థులు


శ్రీ సరస్వతీ విద్యామందిర్ పాఠశాలలో వెలగపూడి సుధాకర్


బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ వకుళాభరణం


ఖైరతాబాద్ నిషుల్క్ ప్రభాత్ ప్రభుత్వ పాఠశాలలో..


బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉలూమ్ కాలేజీలో..


యూసుఫ్‌గూడలో మాజీ ఎమ్మెల్యే విష్ణు, సురేందర్‌యాదవ్


ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో విజయారెడ్డి


టీఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: హైలాంకాలనీ 11కేవీ ఫీడర్, యూసుఫ్‌గూడ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలీస్‌లైన్స్, వాటర్‌ట్యాంక్, గాయత్రీహిల్స్, హైలాంకాలనీ, 12 నుంచి 2 గంటల వరకు ఫ్లెజెంట్ వ్యాలీ మెయిన్‌రోడ్డు, యూసుఫ్‌గూడ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

- ఐదృష్టి 11కేవీ ఫీడర్, ముఫకంజ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా రత్నదీప్ సూపర్‌మార్కెట్, ఐ దృష్టిలైన్, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- పాటిగడ్డ 11కేవీ ఫీడర్ ఎస్–పార్క్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాటిగడ్డ క్వార్టర్స్, నూర్‌బాగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ప్రకటించారు.
- హుడా ఎయిర్‌పోర్ట్, చిరాన్‌పోర్ట్, చికోటి గార్డెన్ 11కేవీ ఫీడర్, ఎయిర్‌పోర్ట్, ఎస్–పార్క్, సబ్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా హుడాలైన్, చిరాన్‌పోర్ట్ క్లబ్, పాస్‌పోర్ట్ ఆఫీస్, ప్రకాశ్‌నగర్, రాహుల్ బాజాజ్ వెనుకవైపు, చికోటి గార్డెన్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ప్రకటించారు.

స్కూల్ మ్యాగజైన్ ఆవిష్కరణ



ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎస్‌కె. జనార్దన్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్కూల్ మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అకాడమిక్ డైరెక్టర్ రమాదేవి, స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకార మహోత్సవం కనుల పండువగా జరిగింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా స్కూల్ చైర్మన్ మురళీముకుంద్, ప్రిన్సిపాల్ వరలక్ష్మి జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

పంజగుట్ట: బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిపై అదే పార్టీకి చెందిన నాయకుడు దాడి చేయించడం తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక పేర్కొంది. మంగళవారం తుమ్మలబస్తీలో రాష్ట్ర అధ్యక్షుడు నరసింహయాదవ్, నగర వర్కింగ్ ప్రసిడెంట్ శ్రీరాములు మాట్లాడుతూ.. బీజేపీ హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి, ఆమె భర్త రామన్‌గౌడ్‌లు విఠల్‌వడీలోని ఓ జెండా కార్యక్రమంలో పాల్గొని జెండా ఎగరవేస్తుండగా.. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అనుచరులు రామన్‌గౌడ్‌పై విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచారని ఆరోపిస్తూ.. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంటనే బహిరంగంగా క్షమాపన చెప్పాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర కోశాధికారి శెట్టి ప్రదీప్‌యాదవ్, నగర కార్యదర్శి పూస సత్యనారాయణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, రాజేష్‌యాదవ్, వెంకటేష్ తదితరులున్నారు.

బాలిక అదృశ్యం

కాచిగూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మైనర్ బాలిక అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎస్.రామలక్ష్మణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సోమయ్య రెండో కుమార్తె రమ్య (15) ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. గత కొంత కాలంగా బాలిక మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో 10 రోజులుగా స్కూల్‌కు వెళ్లడం లేదు. ఇంట్లో తల్లిదండ్రులు బయటకు వెళ్లిన సమయంలో సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు, బంధుమిత్రులు వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం బాలిక తండ్రి కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులతోనే సమాజంలో మార్పు


స్కాలర్‌షిప్స్ అందుకున్న విద్యార్థులు

వెంగళరావునగర్: సమాజంలో పెనుమార్పులు తీసుకొచ్చి దేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచస్థాయికి ఎదిగేలా చేయాల్సిన బాధ్యత నేటితరం విద్యార్థులపైనే ఉందని న్యాయశాఖ రిటైర్డ్ సెక్రటరీ కె.సత్యనారాయణ మూర్తి అన్నారు. మధురానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అట్లూరి సీతారామారాజు, ప్రొఫెసర్ జయశంకర్ జ్ఞాపకార్థం అక్షరజ్యోతి స్కాలర్‌షిప్స్ స్కీం కింద మంగళవారం 129 మంది నిరుపేద విద్యార్థులకు దాదాపు రూ.7 లక్షల స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంకోసం ఎంతోమంది ప్రాణాలను అర్పించారని వారి త్యాగాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. చదువు వల్లే సంస్కారం వస్తుందని, దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. కాగా పేదరికం చదువుకు ఆటంకం కాకూడదనే మంచి ఉద్దేశంతో ప్రతి ఏటా మధురానగర్ అసోసియేషన్ నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్నామన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివరావు, ఎం.కళ్యాణ చక్రవర్తి, వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణరాజు, కోశాధికారి ఉప్పలయ్య, రాజన్‌బాబు, హరితారెడ్డి, సుగుణమ్మ, వై.శ్రీనివాసరావు, చంద్రమోహన్, కె.సుగుణ, వెంకట్రావు, చంద్రావతి, రాజేంద్రప్రసాద్, సుధ, జీఎస్‌ఆర్‌కేవి ప్రసాద్, విశ్వప్రకాష్, వాణి, చారి, జీవీకృష్ణ, రాజగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో న్యూసెన్స్ చేసిన వ్యక్తికి జైలు


నిందితుడు రుద్రప్ప

బంజారాహిల్స్: మద్యం మత్తులో న్యూసెన్స్‌కు పాల్పడుతుండటమే కాకుండా నివాసిత ప్రాంతాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తూ.. ప్రశ్నించిన పోలీసులను దుర్భాషలాడిన నిందితుడికి 5 రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకృష్ణానగర్‌కు చెందిన బి.రుద్రప్ప (26) కొంత కాలంగా మద్యంమత్తులో స్థానికంగా న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతడిపై కేసు నమోదు చేసి నాంపల్లి పదో ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. నిందితుడికి 5 రోజుల జైలుశిక్ష విధిస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

లాభాల బాటలో ఎస్‌బీఐ

లక్డీకాపూల్: స్టేట్ బ్యాంక్ ఇండియ (ఎస్‌బీఐ) అనేక ఒడిదుగులను ఎదుర్కొని ప్రస్తుతం లాభాల బాటలో పయణిస్తుందని హైదరాబాద్ సర్కిల్ సీబీఎం రాజేష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆయన జాతీయ జెండాను ఎగరవేశారు. రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో వెల్లడించారన్నారు. కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంలో తమ బ్యాంక్ ముందంజలో ఉందన్నారు. ముఖ్యంగా ముద్ర వంటి క్రెడిట్ క్యాంప్‌లను నిర్వహించడంలో ఎస్‌బీఐ తన ప్రత్యేకతను చాటుకుంటుందన్నారు. జనరల్ మేనేజర్ దేబాషిష్ మిత్ర, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లోనూ సగానికిపైగా ఏకగ్రీవాలు

- 66 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతుంటే 32 ఏకగ్రీవం.. మరో 32 చోట్ల పోటీ

సాక్షి, అమరావతి: ఏపీలో 484 మండలాల పరిధిలో మొత్తం 1,033 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికల్లో సగానికి పైగా స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 66 సర్పంచ్ స్థానాలతో పాటు 1,064 వార్డు సభ్యులకు ఉప ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే. పదో తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగగా, సోమవారం సా.3 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు.. సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగే మొత్తం 66 గ్రామాల్లో 32 చోట్ల ఎన్నిక ఏకగ్రీవం కాగా, రెండుచోట్ల అభ్యర్థులెవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. కేవలం 32 చోట్ల మాత్రమే సర్పంచ్ స్థానాలకు ఈనెల 19న పోలింగ్ జరగనుంది. మరోవైపు.. 1,064 వార్డు సభ్యులకు ఉప ఎన్నికలు జరుగుతుండగా.. 757 స్థానాలు ఏకగ్రీవం కాగా, 261 చోట్ల 19న పోలింగ్ జరగనుంది.

పుంగనూరు నిందితులంతా పాత నేరస్తులు

దాడుల కోసం పార్టీలో గూండాలను ఎంపిక చేసి మరీ తెచ్చిన టీడీపీ

సాక్షి, చిత్తూరు, పుంగనూరు (చిత్తూరు జిల్లా): చిత్తూరు జిల్లా పుంగనూరులో ఇటీవల తెలుగుదేశం పార్టీ సృష్టించిన విధ్వంసంలో విస్తుపోయే నిజాలు వెలుగుచూస్తున్నాయి. పక్కా ప్రణాళిక, భారీ వ్యూహంతోనే ఈ దాడులు జరిగినట్లు స్పష్టమవుతోంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపడం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయంగా అణగదొక్కటమే లక్ష్యంగా టీడీపీ ఈ దాడులకు వ్యూహ రచన చేసింది. పక్కా ప్రణాళికతో జిల్లా నలుమూలల నుంచి టీడీపీకి చెందిన గుండాలను ఎంపిక చేసి మరీ పుంగనూరుకు తెచ్చినట్లు వెల్లడైంది. వారిపై జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో అనేక కేసులు ఉన్నాయి. వీరిని ముందుగానే మారణాయుధాలతో సహా పుంగనూరులో మోహరించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అంటరానితనంపై యుద్ధం

విజయవాడలో 77వ స్వాతంత్ర్య దినోత్సవంలో ఏపీ సీఎం వైఎస్ జగన్

"అంటరానితనం అంటే ఫలానా వ్యక్తులు తాకటానికి వీల్లేదని భౌతికంగా దూరం పెట్టటం మాత్ర మే కాదు.. వారికి అందాల్సిన సంక్షేమాన్ని అడ్డుకోవడం కూడా అంటరానితనమే.. అలాంటి రూపం మార్చుకున్న అంటరానితనంపై ఈ రోజు మనం యుద్ధం చేస్తున్నాం! పేదలు గెలిచేదాకా, వారి బతుకులు బాగుపడే వరకు ఇది కొనసాగుతుంది. - ఏపీ సీఎం వైఎస్ జగన్

- భౌతికంగా దూరం పెట్టడం ఒక్కటే కాదు.. సంక్షేమాన్ని అడ్డుకోవడం కూడా అంటరానితనమే
- మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించి సాయుధ దళాల వందనాన్ని స్వీకరించిన సీఎం



విజయవాడలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రూపం మార్చుకున్న అంటరానితనం, పేద వర్గాలను అణచివేస్తున్న పెత్తందారీ భావజాలం ధోరణులపై ఈ నాలుగేళ్ల పాలనలో యుద్ధాన్ని ప్రకటించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం జగన్ సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మహనీయుల త్యాగనిరతి, స్వాతంత్ర్య సమర యోధుల బలి దానాలను గుర్తు చేస్తూ ప్రసంగించారు. స్వతంత్ర భారత దేశ చరిత్రలో మరే ప్రభుత్వం, రాష్ట్రం చేయని గొప్ప మార్పులు, గ్రామ స్వరాజ్యానికి అసలైన అర్థాన్ని నాలుగేళ్లలోనే తెచ్చామని చెప్పారు. '76 ఏళ్ల ప్రయాణంలో మన దేశం, రాష్ట్రం ఎంతో పురోగమించాయని చెప్పేందుకు పలు ఉదాహరణలు కనిపిస్తాయి. ఆర్థిక వ్యవస్థకు మూలమైన వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు లాంటి మూడు రంగాలలో ఎంతో ప్రగతి కనిపిస్తుంది. కానీ అదే సమయంలో ఈ వేగాన్ని అందుకోలేని, అందుకునే అవకాశాలు తగినంతగా లభించని కుటుంబాలు, వర్గాలు, సామాజిక వర్గాలు, ప్రాంతాలు ఈ ఏడు దశాబ్దాల ప్రయాణంలో ఇంకా వెనకబడే ఉన్నాయి' అని పేర్కొన్నారు. సీఎం జగన్ తన ప్రసంగంలో ఇంకా ఏమన్నారంటే..

రూపం మార్చుకున్న అంటరానితనం, పెత్తందారీ భావజాలం..

అంటరానితనం అంటే కేవలం భౌతికంగా దూరం పెట్టటం మాత్రమే కాదు! పేదలు ఏ బడిలో చదువుకుంటున్నారో ఆ గవర్నమెంట్ బడిని పాడు పెట్టడం! డబ్బున్న వారి పిల్లలకు ఒక మీడియం, పేదల పిల్లలకు మరో మీడియం అని వివక్ష పాటిస్తూ పేద బిడ్డలు తెలుగు మీడియంలోనే చదవాలని బరితెగించి వాదించటం కూడా అంటరానితనమే! పేదలు ఏ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారో అక్కడ ఉచిత సేవలు అందకుండా చేయటం, పేదలు ఏ బస్సు ఎక్కుతున్నారో ఆ బస్సును ప్రైవేట్‌కు విక్రయించాలని చూడటం, పేదలు కోరుకునే చిన్నపాటి ఇంటి స్థలం, ఇంటిని వారికి ఇవ్వకుండా ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటం, చివరికి కోర్టుల్లో రకరకాల కేసులు వేసి పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇవ్వటానికి వీల్లేదని అడ్డుకోవటం కూడా అంటరానితనమే! పౌర సేవలు ఏవి కావాలన్నా పేదలు, మధ్యతరగతి వర్గాల వారు కార్యాలయాలు, కమిటీల చుట్టూ తిరిగేలా వారి సహనాన్ని పరీక్షించటం, అవ్వాతాతలు పెన్షన్ అందుకోవాలన్నా, రైతన్నలకు ఎరువులు కావాలన్నా పొద్దున్నే లేచి పొడవాటి క్యూల్లో నిలబడి, చివరికి ఆ క్యూ లైన్లలో మనుషులు చనిపోతున్నా పాలకుల గుండెలు కరగకపోవటం... ఇవన్నీ రూపం మార్చుకున్న అంటరానితనం, పెత్తందారీ భావజాలంలో భాగాలే. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడిచినా ఇప్పటికీ అలాగే మిగిలి ఉన్న, రూపం మార్చుకున్న అంటరానితనంపై యుద్ధం చేస్తున్న ప్రభుత్వం మనది. పేదలు గెలిచే వరకూ, వారి బతుకులు బాగుపడేవరకూ ఈ యుద్ధం కొనసాగుతుంది.





మెడల్స్ ప్రదానం సందర్భంగా కింద పడిపోయిన మెడల్‌ను తీసి పోలీస్‌కు పిన్ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దుష్ట సంప్రదాయాన్ని తుదముట్టించాం

ఎన్నికల సమయంలో ప్రకటించే మేనిఫెస్టోను ఆ తరువాత చెత్తబుట్టలో పడేసే దుష్ట సంప్రదాయాన్ని మనం తుదముట్టించాం. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తూ ఇందులో ఇవి చెప్పాం.. ఇవి చేశాం.. 98.5 శాతం వాగ్దానాలను ఇప్పటికే అమలు చేశామని ప్రింట్ తీసి మరీ గడప గడపకూ వెళ్లి చూపిస్తూ ప్రజల ఆశీస్సులు తీసుకుంటున్నాం. సామాజిక న్యాయం అన్నది కేవలం నినాదం కాదు.. అది అమలు చేయాల్సిన విధానమని నిరూపిస్తూ మంత్రి మండలిలో ఏకంగా 68 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే ఇచ్చాం. ఐదుగురు ఉప ముఖ్యమంత్రుల్లో నలుగురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారే. వికేంద్రీకరణను విధానంగా మార్చుకుని రాష్ట్రం ఏర్పడిన తరవాత మరో 13 కొత్త జిల్లాలను ఏర్పాటు చేశాం. రాజధానులను కూడా మూడు ప్రాంతాల హక్కుగా, రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతగా వికేంద్రీకరణ చేయబోతున్న ప్రభుత్వం కూడా మనదే. ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయిలో కేవలం 15 పైసలు మాత్రమే లబ్ధిదారులైన ప్రజలకు చేరుతున్నాయని దాదాపు 38 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని చెప్పిన మాటలు ఇప్పటికీ ప్రచారంలో ఉన్నాయి. గత 50 నెలల్లో ఎలాంటి అవినీతి, లంచాలు, వివక్షకు తావు లేకుండా ఏకంగా రూ.2.31 లక్షల కోట్లను అత్యంత పారదర్శకంగా పేదలకు అందించాం. డీబీటీతో నేరుగా ఖాతాల్లోకి జమ చేశాం. సంక్షేమ పథకాలన్నీ అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాలకే ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాం. మహిళా సాధికారతకు బాటలు వేశాం. సోషల్ ఆడిట్‌ను తప్పనిసరి చేయటం ద్వారా పారదర్శకంగా లబ్ధి చేకూరుస్తున్నాం.

2047 నాటికి ఏపీని నంబర్ వన్ చేస్తా

- అభివృద్ధి ఆలోచనలన్నీ నావే
- హైదరాబాద్‌లో స్కూల్ నుంచి వర్సిటీ వరకు నేనే అభివృద్ధి చేశా
- అవినీతి, నేరాల్ని కాపాడుకుంటే సంక్షేమం పరుగులు పెడుతుంది
- సంస్కరణల ఫలితంగా కోవిడ్‌లోనూ గ్రోత్ వచ్చిన రాష్ట్రం ఇండియా
- ఇంజనీరింగ్ చేయాలంటే బైపీసీ చదవాలి
- ఇండియా విజన్–2047 డాక్యుమెంట్ ఆవిష్కరణలో చంద్రబాబు



సాక్షి, విశాఖపట్నం : మళ్లీ తనని అధికారంలోకి తీసుకొస్తే.. 2047 నాటికల్లా ఆంధ్రప్రదేశ్‌ని నంబర్ వన్ చేస్తానని, తనని గెలిపించే బాధ్యత మీరు తీసుకుంటే అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అన్నారు. చంద్రబాబు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్‌టీసీ) సంస్థ రూపొందించిన ఇండియా విజన్–2047 డాక్యుమెంట్‌ని ఆయన మంగళవారం విశాఖ ఎంజీఎం గ్రౌండ్స్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అవినీతి, నేరాల్ని కాపాడుకుంటేనే సంక్షేమం పరుగులు పెడుతుందని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చినా అవినీతి పోలేదని, అందుకే ఫ్రీ ఫ్రం కరెప్షన్, ఫ్రీ ఫ్రం క్రైమ్ అనే నినాదంతో ముందుకెళ్దామని అన్నారు. పీపుల్ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీ4) మోడల్‌తో పేదరికం లేని సమాజం సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. బటన్ నొక్కడం వల్ల ఎవరికి లాభమో చూడాలే తప్ప, ఉత్తుత్తి బటన్‌లు నొక్కడం కాదన్నారు. విద్యుత్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, టెలికమ్యూనికేషన్, హైవేల నుంచి దేశంలో అమలైన ప్రతి ఒక్కటీ తన ఆలోచనే అని చెప్పారు. హైదరాబాద్‌లో ఎలిమెంటరీ స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు తన వల్లే అభివృద్ధి చెందాయన్నారు. డబ్బులు ఎలా సంపాదించాలో చాలా మందికి నేర్పించానన్నారు.

విజన్ డాక్యుమెంట్ అట్టర్‌ఫ్లాప్

ఇండియా విజన్–2047 పేరుతో చంద్రబాబు చేసిన షో అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్న సభలో చెప్పిన మాటలే చెప్పి, తానే గొప్పంటూ డబ్బా కొట్టుకొని, అందులోనూ సవాలక్ష తప్పులు చెప్పడంతో అందరూ మధ్యలోనే వెళ్లిపోయారు. చంద్రబాబు మాట్లాడుతుండగానే 80 శాతం ఖాళీ అయిపోయింది. ఆయన రావడమే రెండు గంటలు ఆలస్యం. వచ్చీరాగానే అడ్డగోలు అబద్ధాలు చెబుతుండటంతో అందరూ విసుక్కొంటూ వెళ్లిపోయారు. ఆర్థిక సంస్కరణల ఫలితంగా కోవిడ్ సమయంలోనూ గ్రోత్ వచ్చిన ఏకైక రాష్ట్రం భారత్ అని చెప్పడంతో అందరూ నవ్వుకున్నారు. హైదరాబాద్‌లో ఎలిమెంటరీ స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు అన్నీ తానే అభివృద్ధి చేశానని, ఆర్థిక సంస్కరణలకు బాటలు వేశానని, విద్యుత్ నుంచి రోడ్ల వరకూ ఎలా డెవలప్ చెయ్యాలో కేంద్రానికి రిపోర్టులు ఇచ్చిందీ తానే అని అనడంతో అందరూ విస్తుపోయారు. ఇంటర్‌లో ఇంజనీర్ కావాలంటే బైపీసీ చదవాలని చెప్పడంతో అందరికీ బుర్రలు తిరిగిపోయాయి. అవినీతి, నేరాల్ని కాపాడుకుంటనే సంక్షేమం పరుగులు పెడుతుందని ఓ సందర్భంలో చెప్పడంతో విన్న వారందరూ అవాక్కయ్యారు.

ఇక విజన్ 2047పై దృష్టి

- మహిళా నేతల సమావేశంలో పవన్‌కళ్యాణ్
- ఇప్పుడున్న పథకాలన్నీ కొనసాగిస్తామని హామీ



సాక్షి, అమరావతి: విజన్–2020 అయిపోయిందని.. ఇకపై విజన్–2047పై దృష్టి పెట్టాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం పార్టీ మహిళా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజన్ 2047 గురించే ఇప్పుడు అందరూ మాట్లాడుతున్నారన్నారు. ప్రస్తుతం 2023 నడుస్తోందని.. 2047 నాటికి ఉపాధి అవకాశాలు బాగుండాలని, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తాను కోరుకుంటున్నానన్నారు. పెరుగుతున్న సంపద అంతా రాజకీయాల్లోకి వచ్చి పదవులు పొంది దోపిడీ చేసే కొందరి వద్దే పేరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జి కట్టినా ముఖ్యమంత్రులకు కమీషన్లు ఇవ్వాల్సి వస్తోందని.. ఆంధ్రాలో అయితే 8 శాతం అంటున్నారన్నారు. సరైన వ్యక్తులకు ఓటు వేయకపోతే 2047 కల్లా మన బిడ్డలను మనమే సర్వనాశనం చేసుకుంటామని వ్యాఖ్యానించారు.

పథకాలేవీ ఆగవు

వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాకపోతే పథకాలు ఆగిపోతాయేమో.. సంక్షేమం నిలిచిపోతుందేమో అనుకోవద్దని పవన్ పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రస్తుత పథకాల కంటే పదింతలు ఎక్కువగా గొప్ప పథకాలే ఉంటాయి తప్ప ఈ పథకాలు తీసేసే పరిస్థితి ఉండదన్నారు. ప్రతి ఒక్కరికీ మాట ఇస్తున్నానని.. జగన్‌ను ఎన్నుకోకపోతే ఏం జరుగుతుందో అనే మాట అవసరం లేదన్నారు.

నగర వార్తలు

సమష్టిగా పనిచేస్తే సింగరేణికి వందేళ్ల భవిష్యత్

సింగరేణి ఎండీ ఎన్.శ్రీధర్



సురేష్‌ను సత్కరిస్తున్న ఎన్.శ్రీధర్

నాంపల్లి: దేశంలోని దాదాపు 200కు పైగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలలో కెల్లా అద్భుతమైన ప్రగతితో సింగరేణి సంస్థ పురోగమిస్తోందని ఇదే ఒరవడితో పనిచేస్తూ వచ్చే ఐదేళ్లలో 12 కొత్త గనులు, 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి రూ.50 వేల కోట్ల టర్నోవర్ సాధించే లక్ష్యంతో ముందుకు పోతోందని ఆ సంస్థ చైర్మన్ ఎన్.శ్రీధర్ వెల్లడించారు. నగరంలోని సింగరేణి భవన్‌లో మంగళవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తొమ్మిదేళ్ల కాలంలో దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థ సాధించని టర్నోవర్, లాభాలను గడించిందన్నారు. తెలంగాణ రాక ముందు 2013–14లో కేవలం రూ.419 కోట్ల లాభాలను మాత్రమే సాధించిన సింగరేణి గతేడాది రూ.2,222 కోట్ల లాభాలను ఆర్జించిందని తెలిపారు. అలాగే రూ.83 కోట్లు లాభాల బోనస్‌గా చెల్లిస్తే ఈ ఏడాది రూ.700 కోట్లు లాభాల బోనస్‌ను త్వరలోనే కార్మికులకు చెల్లించబోతున్నామన్నారు. సింగరేణి మనుగడను దృష్టిలో ఉంచుకుని వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా సింగరేణి సంస్థ నెలకొల్పిన 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పవర్ ప్లాంట్లలో నంబరు వన్ స్థానంలో ఉందన్నారు. రానున్న ఐదేళ్లల్లో 12 కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రణాళికలు సమర్పించామని, వీటిలో నాలుగు ప్రాజెక్టులను ఈ ఏడాది డిసెంబరులో ప్రారంభించబోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వైజర్లు డి.ఎన్.ప్రసాద్(మైనింగ్), సురేంద్ర పాండే (ఫారెస్ట్రీ), కోల్ మూమెంట్ ఈడీ జె.ఆల్విన్, జీఎం (కోఆర్డినేషన్) ఎం.సురేష్, జీఎం (మార్కెటింగ్) జి.దేవేందర్, అడ్వైజర్ (లా) లక్ష్మణరావు, సీఎంవోఏఐ జనరల్ సెక్రెటరీ ఎన్.వి. రాజశేఖర రావు, సేవా అధ్యక్షురాలు ఆశా సురేష్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సత్కారం..

గత మూడున్నర దశాబ్దాలుగా వివిధ ఏరియాల్లో జీఎంగా పనిచేసే సంస్థ అభివృద్ధికి కృషి చేసిన ప్రస్తుత జీఎం (కోఆర్డినేషన్) ఎం.సురేష్‌ను ఆ సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.శ్రీధర్ సత్కరించారు. అలాగే లైజన్ అండ్ ప్రొటోకాల్ ఆఫీసర్ ఎస్.హరినాథ్, ఎస్సీడబ్ల్యూఏ ఉద్యోగుల నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ కరుణశ్రీ, ఆఫీస్ అటెండెంట్ కొప్పుల సాయిబాబాను సత్కరించారు.

నిమ్స్‌కు అరుదైన పురస్కారం



మహేష్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

లక్డీకాపూల్: ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న నిమ్స్ ఆస్పత్రికి అరుదైన పురస్కారం దక్కింది. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నిమ్స్ తరపున ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ మహేష్ బాబుకి పురస్కారాన్ని అందజేశారు. ఆస్పత్రిలో ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేస్తూ వీటి ద్వారా పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నందుకు ఆస్పత్రిని ఎంపిక చేశారు.

దురలవాట్లతో కాలేయ సంబంధ రుగ్మతలు

నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప



పురస్కారం అందజేస్తున్న డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్ : దురలవాట్లతో కాలేయ సంబంధ రుగ్మతలు వస్తున్నాయని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. మద్యం, ధూమపానం, జంక్‌ఫుడ్, కొవ్వు పదార్థాలు, నిల్వ ఆహారం అధికంగా తీసుకోవడంతో కాలేయంతో పాటు పెద్ద, చిన్నపేగుల సమస్యలు వస్తున్నాయన్నారు. మంగళవారం నిమ్స్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన జాతీయ జెండాను ఎగరవేసి వైద్యులు, ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. మద్యం దెబ్బకు ఫ్యాటీ లివర్ రుగ్మతలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ తర్వాత స్థానంలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలే ఉంటున్నాయన్నారు. కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు దక్కుతుందని ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులు (గార్బేజ్) లింగయ్య, ఆహ్మద్‌ల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఉత్తమ వైద్యుడిగా యూరాలజీ అధిపతి డాక్టర్ రాహుల్ దేవరాజ్, హెడ్‌నర్సు కృష్ణ, నర్సింగ్ స్టాఫ్లో హెడ్ నర్స్ సుశీల కుమారి, మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ డానియా దిల్‌షద్, సెక్యూరిటీ గార్డులు కే. తిరుపతి రెడ్డి, డి. కమల్‌కు పురస్కారాలు అందజేశారు.

త్రివర్ణ శోభితం



బేగంబజార్‌లో జరిగిన తిరంగా ర్యాలీకి తరలివచ్చిన జనం

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణమధ్య రైల్వేలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ జాతీయ జెండాను ఎగరవేసి గౌరవ వందనం స్వీకరించారు.

బేగంపేట్‌లో..

బేగంపేట్‌లోని హైదరాబాద్ మెట్రో భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఆర్‌ఎల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో..

ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జేటీసీ పాండురంగ్‌నాయక్ పాల్గొని జెండాను ఆవిష్కరించారు. పలువురు ఆర్టీఓలు, ఎంవీఐలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమీర్‌పేట్‌లో..

హెచ్‌ఎండీఏలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అమీర్‌పేట్‌లోని కార్యాలయంలో నిర్వహించిన జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ కార్యదర్శి చంద్రయ్య పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ప్లానింగ్ డైరెక్టర్లు విద్యాధర్, శ్రీనివాస్, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ విజయలక్ష్మి, అర్బన్ ఫారెస్ట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ సోమేశ్వర్ రావు, లీగల్ స్పెషలిస్ట్ యశస్వి సింగ్, సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ) పరంజ్యోతి, ల్యాండ్ ఎక్విజేషన్ ఆఫీసర్ (ఎల్ఏఓ) ప్రసూనాంబ, ఓఎస్డీ రాంకిషన్, తదితరులు పాల్గొన్నారు. నానక్‌రామ్‌గూడలోని హెచ్‌జీసీఎల్ ఆవరణలో హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



హైదరాబాద్ మెట్రో భవన్‌లో..

జనసంద్రంగా మారిన బేగంబజార్

అబిడ్స్: బేగంబజార్ జనసంద్రంగా మారింది. స్వాతంత్ర్య సంబరాలను పురస్కరించుకుని భగత్ సింగ్ యువసేన అధ్యక్షుడు లడ్డూ యాదవ్ నిర్వహించిన తిరంగా ర్యాలీకి గోషామహల్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 20 నుంచి 30 వేల మంది ప్రజలు తరలి వచ్చారు. ఈ తిరంగా ర్యాలీకి ఉత్తర భారతదేశంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ధీరేంద్రకృష్ణ శాస్త్రి వస్తున్నాడని ఆయనను చూసేందుకు పాతబస్తీతో పాటు పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఉదయమే బేగంబజార్‌కు తరలివచ్చారు.



ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో..

స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

నాంపల్లి: ఏడవ నిజాం ఖానా జదాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కింగ్‌కోఠిలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలకు నవాబు హైదర్ అలీ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... త్యాగాల పునాదుల మీద భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. ప్రముఖులు యూసుఫ్ మస్కతి పాల్గొన్నారు.



హెచ్ఎండీఏలో...



జెండా వందనం చేస్తున్న నవాబు హైదర్ అలీ, యూసుఫ్ మస్కతి



సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో..

ఆకట్టుకున్న వన్ వరల్డ్ ఫ్యూజన్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సంగీతాంజలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన్ వరల్డ్ ఫ్యూజన్ పేరిట మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించిన సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా బాలీవుడ్ గాయని సంజీవని బెలాండే దేశభక్తి గీతలాపన, తబలా కళాకారిణి అనురాధ పాల్ వాయిద్య కచేరి ప్రేక్షకులను మంత్రముగ్దులను చేశాయి. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అభిజిత్ తదితరులు పాల్గొన్నారు.



జెండావిష్కరణలో బీజేపీ నేతల బాహాబాహీ

హిమాయత్‌నగర్: స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా జెండా ఆవిష్కరణ విషయంపై మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ భర్త గడ్డం రామన్‌గౌడ్ కార్యకర్తల ఎదుట బాహాబాహీకి దిగారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లోని విఠల్‌వాడీలో బీజేపీ కార్యకర్త అనీల్ ఏర్పాటు చేసిన జెండావిష్కరణలో జరిగిన ఘటన చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఇరు వర్గీయులు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. అనీల్ ఏర్పాటు చేసిన జెండావిష్కరణకు చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ మహాలక్ష్మి గౌడ్‌కు ఆహ్వానం అందింది. మొదట చింతల రాగా, 20 నిమిషాల పాటు కార్పొరేటర్ కోసం వేచి ఉండగా ఆమె రావడం ఆలస్యమైంది. దీంతో చింతల జెండాను ఆవిష్కరించి వెనుదిరిగారు. ఇదే సమయంలో కార్పొరేటర్ మహాలక్ష్మిగౌడ్ ఆమె భర్త రామన్‌గౌడ్ వారి వర్గీయులు వస్తున్నారు. కార్పొరేటర్ వర్గీయుల్లో ఒకరు 'మేం రాకుండా జెండా ఆవిష్కరిస్తారా? నువ్వు అంత పెద్ద రాజకీయం చేసేవాడివి అయ్యావా? అంటూ' అనీల్‌ను ప్రశ్నించగా మీరు రావడం ఆలస్యమైంది సార్ ఇంకో చోటకు వెళ్లాల్సి ఉంది అందుకే ఆవిష్కరించారని జవాబిచ్చారు. అంతే. ఇరు వర్గాల వారు ఒకరికొకరు తిట్టుకోవడంలో రెచ్చిపోయారు. అందరి సమక్షంలో బాహాబాహీకి దిగి ఇరు వర్గాల వారు ముష్టికొమ్ములాటకు దిగారు.

డీవీఎస్ రాజు విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో ఇన్‌కంట్యాక్స్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాష్

ఫిలింనగర్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్(ఎఫ్ఎన్‌సీసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ నిర్మాత పద్మశ్రీ డీవీఎస్ రాజు విగ్రహావిష్కరణ వేడుక మంగళవారం క్లబ్ ఆవరణలో ఘనంగా జరిగింది. క్లబ్ సభ్యులతో పాటు సినీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇన్‌కం ట్యాక్స్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్, సినీ నటుడు శ్రీకాంత్, దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, క్లబ్ అధ్యక్షుడు ఆది శేషగిరిరావు, సెక్రటరీ ముళ్లపూడి మోహన్, ఉపాధ్యక్షుడు రంగారావు, జాయింట్ సెక్రటరీ వీవీఎస్ఎస్ పెద్ది రాజు, కే.ఎస్.రామారావు, మురళీ మోహన్, కాజా సూర్యనారాయణ, పరుచూరి గోపాలకృష్ణ, మాదాల రవి, శివాజీరాజా, జె. బాలరాజు, జె. శైలజ, డీవీఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇష్టమే పెట్టుబడి

ఇష్టంగా నేర్చుకోవాలే కానీ మట్టి కూడా పాఠాలు నేర్పుతుంది. కొత్త ఆవిష్కరణలతో పాటు ఉపాధికీ బాటలు వేస్తుంది. హైదరాబాద్‌లోని ఏఎస్‌రావు నగర్‌లో ఉంటున్న సంగిశెట్టి సంగీత తన కళ ద్వారా ఈ విషయాన్ని మనందరికీ చాటుతోంది. సరదాగా నేర్చుకున్న కళ ద్వారా ఉపాధి పొందుతూ, మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.


సంగిశెట్టి సంగీత





''కస్టమైజ్డ్ గిఫ్ట్ ఆర్టికల్స్, ఇంటి అలంకరణ వస్తువులు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వర్క్ షాప్స్.. ఆర్టిస్ట్‌గా నాకు నేను గుర్తింపు సంపాదించుకోవడానికి పదిహేనేళ్లకు పైగా పట్టింది. నేటి రోజులకు తగినట్టు స్టాచ్యూ, త్రీడీ ఎఫెక్ట్స్, క్యూబిజమ్, జపనీస్ ఆర్ట్, మల్టీపర్పస్ గిఫ్ట్ ఆర్టికల్స్ తయారుచేస్తుంటాను. ఇవన్నీ మట్టితో రూపొందించేవే. ఎకో, పాటరీ క్లే, పాలిమర్ క్లే, మోడలింగ్ క్లేతో కళారూపాల రూపకల్పన ఉంటుంది. ఇవి ఎప్పటికీ పాడవవు. నీటిలో కరగవు, కిందపడినా పగిలిపోవు. ఇల్లు, ఆఫీసులలో అలంకరణ వస్తువులుగా క్లే ఆర్ట్ కళాకృతులను ఎక్కువ వినియోగిస్తుంటారు. డిజైన్ బట్టి ధర ఉంటుంది. రెయిజన్ మెటీరియల్‌తో కస్టమైజ్డ్ గిఫ్ట్ ఐటమ్స్, షాడో బాక్స్‌లు.. పెళ్లి, పుట్టిన రోజులు వంటి సందర్భాన్ని పురస్కరించుకొని వచ్చిన ఆర్డర్స్‌ని బట్టి డిజైన్స్ చేస్తుంటాను. పెన్సిల్, చార్కోల్, మ్యూరల్, ఆయిల్ పెయింటింగ్స్ కూడా నా రోజు వారి వర్క్‌లో భాగమే.

వర్క్‌షాప్స్

ఎం.కామ్. వరకు చదువుకున్నాను. పెళ్లి, పిల్లలు జీవితంలో ఎప్పుడూ హడావిడి ఉంటూనే ఉంటుంది. ఉద్యోగం చేయాలనుకున్నా వద్దనుకొని, హాబీకే టైమ్ కేటాయించాను. ఇదే ఉపాధిగా మారుతుందని ముందు అనుకోలేదు. కానీ, ఇష్టమైన పనే ఆదాయ మార్గాన్ని కూడా చూపిస్తుందని వచ్చిన ఆర్డర్స్ ద్వారా అర్థమైంది. 'డూడుల్ బగ్స్' పేరుతో ఆర్ట్ స్టూడియో ఏర్పాటు చేశాను. ఆన్‌లైన్ ద్వారా అమెరికా, కెనడాలోనూ నాకు స్టూడెంట్స్ ఉన్నారు. కొందరు గృహిణులు గ్రూపుగా ఏర్పడి తమకు ఈ క్లే ఆర్ట్ నేర్పించమని అడుగుతారు. ఐదారు గురు గ్రూప్‌గా ఉన్నా వారి కోసం వర్క్‌షాప్స్ నిర్వహిస్తుంటాను. ఇప్పటికి వందల సంఖ్యలో మహిళలు శిక్షణ తీసుకున్నవారున్నారు. ప్రతిరోజూ సాయంకాలాలు క్లే ఆర్ట్ ట్రెయినింగ్ క్లాసులు తీసుకుంటాను. వచ్చిన ఆర్డర్స్‌ను బట్టి నా దగ్గర వర్క్ నేర్చుకున్న వాళ్లకు అవకాశాలు ఇస్తుంటాను.

రికార్డులు తెచ్చిన ఆర్ట్

రెండేళ్ల క్రితం పిస్తా పొట్టుపై చేసిన మైక్రో క్లే ఆర్ట్ మంచి పేరుతో పాటు అవార్డులు కూడా తెచ్చిపెట్టింది. పండ్లు, కూరగాయలు, స్వీట్లు, ఇతర ఆహార పదార్థాలు 150 కంటే ఎక్కువ రకాలు పిస్తా పొట్టుపై 74 గంటలలో చేసి చూపించాను. ఈ సూక్ష్మ కళా నైపుణ్యాలను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసించింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు వచ్చేలా చేసింది. వర్చువల్ అవార్డులూ వరించాయి.

సాధనమున..

ఆసక్తి ఉండి, ఫీజు చెల్లించలేం అనుకునే వారికి మెటీరియల్ ఇచ్చి మరీ ఈ వర్క్స్ నేర్పిస్తుంటాను. ఏ కళ అయినా సాధన చేస్తూ ఉంటే కొత్త కొత్త నైపుణ్యాలు వచ్చి చేరుతాయి. అవే ఉపాధికి మార్గం చూపుతాయి. అందుకే, వర్క్ నేర్చుకున్నవాళ్లను మోటివేట్ చేస్తూ, తమను తాము బిల్డ్ చేసుకునేలా గైడెన్స్ ఇస్తుంటాను. నాకు ఇష్టమైన పని కావడంతో మరింత కొత్తదనం కోసం సాధన చేస్తూ ఉంటాను. ఎందుకంటే ఈ కళారంగంలో ఇష్టమే పెట్టుబడి అవుతుంది'' అని వివరిస్తుంది ఈ హార్టిస్ట్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: నోముల రాజేష్‌రెడ్డి

టీ తోట నుంచి చైతన్యం

మనదేశంలో పోష్ యాక్ట్ వచ్చి పదేళ్లయింది. ఇలాంటి చట్టం ఉందని తెలియని వాళ్లే ఎక్కువ. చట్టం తెలియలేదంటే లైంగిక వేధింపులు లేవనా? ఎందుకు లేవు... అన్ని చోట్లా ఉన్నాయి. ఫైళ్లు పట్టుకునే చేతులకు ఉన్నాయి. ఇటుక మోసే భుజాలకూ ఉన్నాయి. టీ ఆకు తుంచే వేళ్లు సంఘటితమై శాసించాయి. సంఘటిత శక్తి సత్తా ఏమిటో తెలియచేశాయి.



పోష్ (ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ ఫ్రమ్ సెక్సువల్ హెరాస్‌మెంట్) యాక్ట్ 2013 ప్రకారం వ్యవస్థీకృతమైన రంగాల్లో మహిళల పట్ల లైంగిక వేధింపులను నివారించడానికి ఇంటర్నల్ సెల్ ఏర్పాటు చేయడం జరుగుతోంది. కానీ అసంఘటిత రంగాల్లో పని చేసే మహిళలకు ఇలాంటి ఒక చట్టం ఉందనే సంగతి కూడా తెలియదు. ఇలాంటి స్థితిలో అస్సాంలోని టీ తోటల్లో పని చేసే మహిళలు సంఘటితమై తమ హక్కును కాపాడుకోవడానికి ఉద్యమించారు.

ఒకరికొకరు అండగా

మనదేశంలో వ్యవసాయరంగం తర్వాత మహిళలు అతిపెద్ద సంఖ్యలో పని చేస్తున్నది టీ తోటల్లోనే. ఈ తోటల్లో పని చేసే కార్మికుల్లో ఎనభైశాతం మహిళలే. అస్సాం, వెస్ట్‌బెంగాల్, కేరళ, తమిళనాడులన్నీ కలిపి దేశంలో 350కి పైగా టీ తోటలున్నాయి. దాదాపుగా ఒక్కో తోటలో వెయ్యికి పైగా మహిళలు పనిచేస్తుంటారు. దేశవ్యాప్తంగా మూడు లక్షల అరవైవేలకు పైగా మహిళలు టీ తోటల్లో పని చేస్తున్నారు. ఈ మహిళల పరిస్థితి ఒకప్పుడు అత్యంత దయనీయంగా ఉండేది. వాళ్ల మాటకు ఇంట్లో విలువ ఉండేది కాదు, పని చేసే చోట లైంగిక వేధింపులు, వివక్ష తప్పేది కాదు. ఒకరి కష్టాన్ని మరొకరికి చెప్పుకుని ఓదార్పు పొందడమే తప్ప, ఆ కష్టాల నుంచి బయటపడవచ్చని తెలియని రోజులవి. ఒకసారి తెలిసిన తరవాత ఇక వాళ్లు ఆలస్యం చేయలేదు. ఉమెన్స్ సేఫ్టీ యాక్సిలరేటర్ ఫండ్ (డబ్ల్యుఎస్ఏఎఫ్) స్వచ్ఛంద సంస్థ అండతో ముందుకురికారు.

అస్సాం నుంచి కేరళ వరకు

తమకు భద్రత కల్పించడానికి పోష్ అనే చట్టం ఉందని తెలిసిన తర్వాత ఆ చట్టం ద్వారా ఎన్ని రకాలుగా రక్షణకవచంగా ఉపయోగించుకోవచ్చనే వివరాలు కూడా తెలుసుకున్నారు. 'సమాజ్' పేరుతో వాళ్లలో వాళ్లు కమిటీలుగా ఏర్పడ్డారు. బృందంగా వెళ్లి ప్రభుత్వ అధికారులను కలుస్తూ... ప్రతి తోటలో ఇంటర్నల్ సెల్ ఏర్పాటయ్యే వరకు తమ ఉద్యమాన్ని ఆపలేదు. లైంగిక వేధింపులకు గురయినప్పుడు ఎలా ప్రతిఘటించాలో, ఎలాంటి ఆధారాలతో ఇంటర్నల్ సెల్‌కు ఎలా తెలియచేయాలో కళ్లకు కడుతూ చిన్నచిన్న నాటికలు ప్రదర్శించారు. అస్సాం, బెంగాల్ నుంచి కొంతమంది చురుకైన మహిళలు కేరళ, తమిళనాడులకు వచ్చి ఇక్కడి వారిని చైతన్యవంతం చేసే పని మొదలు పెట్టారు. ర్యాలీలు నిర్వహిస్తున్నారు.


తేయాకు తోట కార్మికుల ర్యాలీ

చట్టం... కమిటీలే కాదు... ప్రభుత్వం ఇంకా చేయాలి!

వ్యవస్థీకృత రంగంలో పనిచేసే మహిళల కోసం ఇంటర్నల్ కమిటీలున్నట్లే అసంఘటితరంగంలో కూడా కమిటీలుండాలి. ఇళ్లలో పని చేయడం, వీధుల్లో తిరుగుతూ కూరగాయలు, పండ్లు అమ్ముకోవడం వంటి ఇతర పనుల్లో ఉండే మహిళల కోసం లోకల్ కంప్లయింట్స్ కమిటీలుండాలి. కమిటీలు వేయడంతో సమస్య పరిష్కారం కాదు. ఇలాంటి కమిటీలున్నాయనే విషయం మహిళలకు తెలియాలి. లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు ఆయా కమిటీలకు కంప్లయింట్ ఎలా ఇవ్వాలో తెలియచేయాలి. ఫోన్ నంబర్ లేదా హెల్ప్‌లైన్ నంబర్‌లను పని ప్రదేశంలోనూ ఇతర కమ్యూనిటీ సెంటర్‌లలోనూ బాగా కనిపించేటట్లు బోర్డు మీద రాయాలి. అందుకు ప్రభుత్వమే పూనుకోవాలి. చట్టం చేసి తన బాధ్యత అయిపోయిందనుకుంటే సరిపోదు. చట్టాన్ని అమలు చేయడం, అమలయ్యే పరిస్థితులు కల్పించడం, చట్టం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, తమ హక్కుల ఉల్లంఘన కలిగినప్పుడు గళమెత్తగలిగేటట్లు భరోసా కల్పించడం కూడా ప్రభుత్వం నిర్వర్తించాల్సిన బాధ్యతలే.



– కొండవీటి సత్యవతి,
భూమిక ఉమెన్స్ కలెక్టివ్,
మెంబర్, లోకల్ కంప్లయింట్ కమిటీ, రంగారెడ్డి జిల్లా

ఒక్క ఫోన్ కాల్ చాలు!

పోష్ చట్టం ప్రకారం సెక్సువల్ హెరాస్‌మెంట్ రిడ్రెసల్ కమిటీలు భవన నిర్మాణ రంగంలో కూడా ఉండాలి. అయితే టీ తోటల్లో మహిళల్లాగ భవన నిర్మాణంలో పని చేసే మహిళలు సంఘటితం అయ్యే అవకాశాలు చాలా తక్కువ. ఎందుకంటే ఎక్కువ కాలం ఒకే చోట నివసిస్తున్న వాళ్లు మాత్రమే వేధింపులకు గురవుతున్న విషయాన్ని ఒకరితో ఒకరు పంచుకోగలుగుతారు. వాళ్లలో వాళ్లు మాట్లాడుకుని కలిసికట్టుగా పోరాటానికి సిద్ధమవుతారు. టీ తోటల్లో పని చేసే వాళ్లు సుదీర్ఘకాలం ఒకే చోట నివసిస్తూ, అదే తోటల్లో కలిసి పనిచేస్తూ ఉంటారు. భవన నిర్మాణ కార్మికులు అలా కాదు. ఒక భవనం పూర్తి కాగానే మరో భవనం కోసం వెళ్లిపోతుంటారు. తమ సమస్యకు పరిష్కారం కోసం సంఘటితం కాగలిగినంత సమయం కూడా ఒకేచోట ఉండరు. కాబట్టి పని చేసే ప్రదేశంలో కంప్లయింట్ ఇవ్వాల్సిన వివరాలతోపాటు ఫోన్ నంబరు రాయడమే వారిలో చైతన్యాన్ని కలిగిస్తుంది. అలాగే రైతుబజార్‌లు, కూరగాయల మార్కెట్‌లలో కూడా మహిళలు ఎక్కువగా ఉంటారు. అధికారులు సమావేశం ఏర్పాటు చేసి లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు కంప్లయింట్ ఇవ్వవచ్చని తెలియచేయాలి. కంప్లయింట్ విభాగానికి చెందిన ఫోన్ నంబర్‌ను ఆ మార్కెట్‌లో కూరగాయల ధరల పట్టిక కనిపించినట్లు బాగా కనిపించేటట్లు రాయాలని సూచించారు మహిళల హక్కుల యాక్టివిస్టు కొండవీటి సత్యవతి.

ఒక నోడల్ పాయింట్

లైంగిక వివక్ష, వేధింపు, హింస, బాల్య వివాహాలు, అక్రమ రవాణా, ప్రసవ సమయంలో మరణాలు దేశంలో అస్సాం మొదటిస్థానంలో ఉంటుంది. అస్సాం, బెంగాల్‌లో మహిళల కోసం ప్రాతినిధ్యం వహించేవాళ్లు లేరు.

టీ ఎస్టేట్‌లలో పనిచేసే బాలికలు, మహిళల భద్రత, హింస నిరోధం కోసం ఏర్పడిన కన్సార్టియం డబ్ల్యుఎస్ఏఎఫ్... మహిళలను చైతన్యవంతం చేయడంతోపాటు లీగల్ సర్వీసెస్ అథారిటీ, హెల్త్ డిపార్ట్‌మెంట్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌లు, పోలీస్, గ్రామీణ ఉపాధి కార్యక్రమాలన్నింటినీ ఒక గొడుగు కిందకు తీసుకువచ్చింది. ఆ ప్రయత్నం మంచి ఫలితాన్నిచ్చింది. అస్సాం టీ తోటల్లో పని చేసే మహిళలు దేశానికి దిక్సూచి అయ్యారు.

– వాకా మంజులారెడ్డి

స్ఫూర్తి



వయసు 96 బీచ్‌కు కాపలాదారు

చెన్నైలోని బీచ్‌లను అభివృద్ధి పేరుతో ధ్వంసం చేయాలంటే అందరికీ భయం. దానికి కారణం కామాక్షి సుబ్రమణియన్. బీచ్‌లకు రక్షకురాలిగా 'అమ్మమ్మ'గా అందరూ పిలుచుకునే కామాక్షి గత 40 ఏళ్లుగా చెన్నైలోని బీచ్‌లను కాపాడుతోంది. ఈ పనికి అందరూ పెట్టిన పేరు 'విషన్ కామాక్షి'.

1930లో మద్రాసులో ఒక ఘటన జరిగింది. అక్కడి బెసెంట్ నగర్ బీచ్ (ఎలియెట్స్ బీచ్)లో ఒక బ్రిటిష్ అమ్మాయి స్నానం చేస్తూ మునిగిపోబోయింది. ఒడ్డున ఉన్న కాజ్ ష్మిడ్ అనే డెన్మార్క్ నావికుడు అది గమనించాడు. వెంటనే సముద్రంలోకి పరిగెత్తి ఆ అమ్మాయిని కాపాడబోయాడు. అలల తీవ్రత ఎక్కువగా ఉండింది. అమ్మాయిని ఒడ్డుకు తోసేశాడు. తాను మాత్రం సముద్రంలో మునిగిపోయాడు. అమ్మాయి ఆ సంగతి గురించి కిక్కురుమనకుండా సాయంత్రం జరిగిన పార్టీకి హాజరైంది. కాని నాటి గవర్నర్‌కు ఎలాగో సంగతి తెలిసింది. ఆయన ఆగ్రహంతో ఆ అమ్మాయి మీద కేకలేసి కాజ్ ష్మిడ్ సాహసానికి గుర్తుగా ష్మిడ్ మెమోరియల్ కట్టించాడు. చాలా తమిళ సినిమాల్లో ఈ మెమోరియల్ కనిపిస్తుంది. అయితే ఇది అనేక ఏళ్లపాటు శిథిలావస్థలో ఉండింది. కార్పొరేషన్ వారిని వేధించి, వెంటబడి దానిని పునరుద్ధరించిన వ్యక్తి కామాక్షి సుబ్రమణియన్. ఇవాళ ష్మిడ్ మెమోరియల్ ఎంతో చక్కగా పర్యాటకుల్ని ఆకర్షిస్తూ ఉంది. ఏ సాయంత్రం బీచ్‌కు వెళ్లినా ఆ చుట్టుపక్కల నవ్వుతూ కామాక్షి సుబ్రమణియన్ కనిపిస్తుంది.

బీచ్ ఒడ్డు మనిషి

కామాక్షి సుబ్రమణియన్ బెసెంట్ నగర్‌లో పుట్టి పెరిగింది. బెసెంట్ నగర్ అడయార్ పక్కనే ఉంటుంది. పెళ్లయ్యాక భర్తతో 1980 వరకూ ఢిల్లీలో ఉండిపోయింది కామాక్షి. భర్త రాష్ట్రపతి భవన్‌లో కార్యదర్శిగా పని చేసేవాడు. 'ఆ సమయంలో నా భర్త వల్ల బ్యూరోక్రసిలో ఎలాంటి అలక్ష్యం జరుగుతుందో, తెలిసీ తెలియక ఎన్ని మతలబులు చోటు చేసుకుంటాయో తెలుసుకున్నాను' అంటుంది కామాక్షి. భర్త రిటైర్ అయ్యాక చక్కా వచ్చి బెసెంట్ నగర్‌లో నివాసం ఏర్పాటు చేసుకున్న కామాక్షి ఆ రోజుల్లో దట్టంగా ఉన్న చెట్లను కొందరు వంట చెరుకు కోసం కొట్టడం బాల్కనీలో నుంచి గమనించేది. ఆ చెట్లు కొట్టేస్తే నీడ ఏం కాను? అందుకని వారు రావడంతోటే పెద్దగా అరుస్తూ తరిమి కొట్టేది. 'అలా నా పౌర సేవ మొదలైంది' అని గుర్తు చేసుకుంది కామాక్షి. ఆమెకు రోజూ బీచ్‌కు వెళ్లడం అలవాటు అలా బీచ్ మీద ప్రేమ ఏర్పడింది.

ఆక్రమణలపై పోరు

బెసెంట్ నగర్‌లో అడయార్‌లో ఏ కార్పొరేషన్ పనులు జరుగుతున్నా వాటి అజమాయిషీకి కామాక్షి హాజరయ్యేది. జరగని పనుల కోసం కార్పొరేషన్ చుట్టూ తిరిగేది. కార్పొరేటర్‌లను, మేయర్‌ను కలిసి వారిని నిలదీసేది. 'మనం ట్యాక్స్ ద్వారా కట్టే డబ్బుతో ప్రభుత్వం పనులు చేయిస్తుంది. ఆ పనులు సక్రమంగా జరిగేలా చూడటం మన బాధ్యత' అంటుంది కామాక్షి. బెసెంట్ నగర్‌లో ఒక రోడ్డు వేస్తుంటే రోజూ వెళ్లి అజమాయిషీ చేసింది కామాక్షి. కాంట్రాక్టర్‌ను క్వాలిటీగా పని చేయమని దబాయించింది. 'ఇవాళ్టికి 12 ఏళ్లు. రోడ్డు కొంచెం కూడా చెక్కు చెదరలేదు' అంటుంది నవ్వుతూ. బెసెంట్ నగర్‌లో, బీచ్ చుట్టుపక్కల ఆక్రమణలు ఏవైనా జరిగితే ఆమె సహించదు. ధర్నాకు కూచుంటుంది.

96 ఏళ్ల వయసులో

'నగర పౌరులకు హక్కులుంటాయి. పబ్లిక్ స్థలాలు వారి ఆహ్లాదం కోసం. పార్కులు వారికి కావాలి. పేవ్‌మెంట్‌లు కావాలి. బీచ్ శుభ్రంగా ఉండాలి. వాటి కోసం నేను పోరాటం చేస్తాను' అంటుంది కామాక్షి. ఆ మధ్య జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో 174 వ వార్డులో ఇండిపెండెంట్‌గా నిలుచుంది కామాక్షి. పత్రికలు ఆమె గురించి విస్తృతంగా రాశాయి. 'పార్టీ జెండా కింద నిలబడితే పార్టీ పనులన్నీ సమర్థించాలి. నేను అలా చేయలేను' అందామె. అందుకే ఓడిపోయింది కూడా. కాని నేటికీ ఆమె పౌరుల హక్కుల కోసం పని చేస్తూనే ఉంది. 'బెసెంట్ నగర్ బీచ్ దగ్గర వాకింగ్ ట్రాక్‌ను అడ్డుకుంటూ పబ్లిక్ టాయిలెట్లు కడుతున్నారు. దానిని అడ్డుకోవడానికి ధర్నా చేస్తున్నాను' అని ధర్నాకు కూచుందామె. కార్పొరేషన్ అధికారులకు ఆమెను చూస్తే భయం. ఎవరో ఒకరు భయపెట్టకపోతే పనులెలా జరుగుతాయి? 96 ఏళ్లలో కామాక్షి అన్ని పనులు చేస్తుంటే మనం ఎన్ని పనులు చేయాలి?

యూత్ పల్స్

పదిహేను వసంతాల యువసంతకం

భారతదేశంలో పదిహేను వసంతాలను పూర్తి చేసుకున్న యూట్యూబ్ (ఇండియా) పల్లె నుంచి మహా పట్నం వరకు యువతరంలో ఎంతోమందిని కంటెంట్ క్రియేటర్స్‌గా మార్చింది. ఎప్పటికప్పుడు ప్రేక్షకుల నాడిని తెలుసుకుంటూ, యూట్యూబ్ కొత్త టూల్స్‌ను అందిపుచ్చుకుంటూ తమ సృజనాత్మక శక్తులను బలోపేతం చేసుకుంటున్నారు యంగ్ క్రియేటర్‌లు. వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ అయిన యూట్యూబ్ యువత రంగుల కలలను సాకారం చేసే రంగస్థలం అయింది. ప్యారే దోస్తుగా మారింది...



'మన దేశ డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ పదిహేను సంవత్సరాల యూట్యూబ్ ప్రయాణంలో కనిపిస్తుంది' అంటాడు యూ ట్యూబ్ ఇండియా డైరెక్టర్ ఇషాన్ ఛటర్జీ. డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ మాట ఎలా ఉన్నా యువతరం క్రియేటివ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది. యూట్యూబ్ ఎంతోమంది క్రియేటర్‌లను సృష్టించింది. కొత్త కెరీర్ దారులను పరిచయం చేసింది.

చెన్నైకి చెందిన మలర్ సరదాగా యూట్యూబ్‌లో ఇంగ్లీష్-స్పీకింగ్ కోర్సు మొదలుపెట్టింది. ఆ తరువాత ఆఫ్‌లైన్‌లో కూడా సక్సెస్ అయింది. తన యూట్యూబ్ కుకింగ్ చానల్‌తో సక్సెస్ అయిన పశ్చిమబెంగాల్‌లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన పుష్పరాణి సర్కార్ 'ఈ చానల్ ద్వారా నలుగురికి నా పేరు తెలియడమే కాదు ఉద్యోగం చేయాల్సిన అవసరం లేకుండా పోయింది' అంటుంది.

ఎబిన్ జోస్ పాపులర్ యూట్యూబ్ చానల్ 'ఫుడ్ అండ్ ట్రావెల్'కు 7,00,000 సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు.

'అనుకరణతో ఫలితం ఉండదు. ఎవరి సక్సెస్ ఫార్ములాను వారు రూపొందించుకోవాల్సిందే' అంటాడు జోస్.

2008లో మన దేశంలోకి యూ ట్యూబ్ లోకలైజ్‌డ్ వెర్షన్ అడుగు పెట్టింది. ఈ పదిహేను సంవత్సరాల కాలంలో ఎన్నో అవతారాలు ఎత్తింది. ఎన్నో ట్రెండ్స్‌ను పరిచయం చేసింది. ఈ ట్రెండ్స్‌లో యువతరానిదే పై చేయిగా మారింది.

యూట్యూబ్ ట్రెండ్స్-2023 రిపోర్ట్ ప్రకారం జెన్ జడ్‌లో 69 శాతం మంది ప్రేక్షకులు షార్ట్ ఫామ్, లాంగ్ ఫామ్, లైవ్‌స్ట్రీమ్... ఇలా ఏ ఫార్మట్‌లోనైనా తమ అభిమాన క్రియేటర్ కంటెంట్‌ను చూడడానికి ఇష్టపడుతున్నారు. నిర్దిష్టమైన కంటెంట్, ఆర్టిస్టులు, పబ్లిక్ ఫిగర్స్‌కు సంబంధించి ఫ్యాన్స్ రూపొందించిన వీడియోలను చూడడానికి ఇష్టపడుతున్నట్లు జెన్ జడ్‌లో 48 శాతం మంది చెబుతున్నారు.

పదిహేను సంవత్సరాల కాలంలో యూట్యూబ్ యూత్ ఫ్రెండ్లీ ప్లాట్‌ఫామ్‌గా మారింది.

మహానగరంలో ఉన్నా, మారుమూల పల్లెలో ఉన్నా ఒక చిన్న బ్రైట్ ఐడియాతో అంతర్జాతీయ స్థాయిలో మెరిసిపోయేలా ఈ వేదిక యూత్‌కు ఉపకరించింది. డ్యాన్స్ ట్యుటోరియల్స్ నుంచి హౌ-టు వీడియోల వరకు యువతరంలో ఎంతో మందిని ఫేమ్ చేసింది.

యూ ట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్ (2011) లాంచ్‌తో ఎంతోమంది క్రియేటర్‌లకు ఒక వేదిక దొరికింది. ఈ ఫస్ట్ వేవ్ క్రియేటర్‌లు తమ విజయాలతో ఎంతోమందిని ప్రభావితం చేశారు. మ్యూజిక్, సినిమాలు ఆరాధించే మన దేశంలో యూట్యూబ్ వేదికగా యువతరం చేతిలో కంటెంట్ క్రియేషన్ అనేది కొత్త పుంతలు తొక్కింది. కంటెంట్ క్రియేషన్‌కు సంబంధించి యూట్యూబ్ అడ్వాన్సింగ్ టూల్స్‌ను తీసుకువచ్చింది. ఫార్మట్‌లను విస్తరించింది. క్రియేటర్‌లు తమ వీడియోలను ఇతర భాషల్లోకి తీసుకువచ్చే ఏఐ పవర్డ్ డబ్బింగ్ టూల్‌ను తీసుకురానుంది. భవిష్యత్‌లో ఈ టూల్ ద్వారా వాయిస్ ప్రిజర్వేషన్, లిప్ రీ-యానిమేషన్, ఎమోషన్ ట్రాన్స్‌ఫర్... మొదలైనవి చేయవచ్చు. ఫిల్మ్ స్టూడియోలు, మ్యూజిక్ కంపెనీలు కూడా యూట్యూబ్ చానల్స్‌ను స్టార్ట్ చేయడం మొదలు పెట్టాయి. దీని ద్వారా యువతలో క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్స్ ఉన్న ఎంతోమంది వెలుగులోకి వచ్చారు.

'యూట్యూబ్ తొలిసారిగా పరిచయం అయినప్పుడు అది టైమ్‌పాస్ మాత్రమే. అయితే మన టైమ్‌ను కూడా మార్చుకొని ఎదగవచ్చని ఎంతో మంది నిరూపించారు' అంటుంది బెంగళూరుకు చెందిన ప్రజ్వల.

స్ఫూర్తినిచ్చే సూపర్‌స్టార్స్

మన దేశంలోని మోస్ట్ పాపులర్ యూట్యూబ్ స్టార్‌ల స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని 'ది యూట్యూబ్ స్టార్స్ ఆఫ్ ఇండియా' పేరుతో పుస్తకంగా తీసుకువచ్చాడు ఢిల్లీకి చెందిన అజితాభ బోస్. ఇది బోస్ నాన్-ఫిక్షన్ బుక్. ఈ పుస్తకంలో సక్సెస్‌ఫుల్ యూట్యూబర్‌ల వ్లాగుల్‌ను కళ్లకు కట్టేలా రాశాడు. అశిష్, అమిత్ బదన, ప్రజక్త కోలి, కునాల్ చాబ్రియ, శృతి, అర్జున్ ఆనంద్‌లాంటి పదిహేను మంది యూట్యూబర్‌ల గురించి రాశారు.

విజయం అనేది ఎంత కష్టపడితే వస్తుంది అనేది వీరి గురించి చదివితే బోధపడుతుంది.

అహ్మదాబాద్‌కు చెందిన హర్ష్ పమ్నానీ వృత్తి పరంగా బ్రాండ్ ఎక్స్‌పర్ట్. ప్రవృత్తి పరంగా స్టోరీ టెల్లర్. 'బూమింగ్ బ్రాండ్స్' పేరుతో పుస్తకం రాసి పేరు తెచ్చుకున్న హర్ష్ 'బూమింగ్ డిజిటల్ స్టార్స్' పేరుతో సక్సెస్‌ఫుల్ యూ ట్యూబ్ స్టార్స్ గురించి మరో పుస్తకం రాశాడు. క్రియేటర్ ఎకనామీలో భాగం కావడానికి వారి పరిచయాలు పాఠాలుగా ఉపయోగపడతాయని అంటాడు రచయిత. కవితా సింగ్, ఉజ్వల్ చౌరాసియ, యశ్వంత్ ముఖ్తే... లాంటి పదకొండుమంది యూట్యూబ్ స్టార్‌ల గురించి ఈ పుస్తకంలో రాశాడు హర్ష్.





టెస్టులకు గుడ్‌బై చెప్పిన హసరంగ

శ్రీలంక ఆల్‌రౌండర్ వనిందు హసరంగ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్ కెరీర్‌ను సుదీర్ఘంగా కొనసాగించాలనే ఉద్దేశంతోనే టెస్టులకు గుడ్‌బై చెబుతున్నానని 26 ఏళ్ల లంక క్రికెటర్ చెప్పాడు. 2020లో దక్షిణాఫ్రికాతో సంప్రదాయ కెరీర్‌కు శ్రీకారం చుట్టిన అతను కేవలం నాలుగు టెస్టులే ఆడాడు. అయితే ఐపీఎల్‌లో బెంగళూరు ఫ్రాంచైజీతో పాటు విశ్వ వ్యాప్తంగా జరుగుతున్న టి20 లీగ్‌లతో అతను బిజీగా ఉన్నాడు. 48 వన్డేల్లో 67 వికెట్లు తీసిన హసరంగ 58 అంతర్జాతీయ టి20ల్లో 91 వికెట్లు పడగొట్టాడు.



భారత్‌తో సిరీస్‌కు సిద్ధంగా వుంటా: కమిన్స్

గాయంతో ఆటకు దూరమైన ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ భారత పర్యటనకు సిద్ధంగా ఉంటాననే ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. యాషెస్ సిరీస్ ఐదో టెస్టులో అతని ఎడమచేతి మణికట్టుకు ఫ్రాక్చరైంది. దీంతో 6 వారాల పాటు విశ్రాంతికే పరిమితమై దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. అయితే ప్రపంచకప్‌కు ముందు భారత్‌తో సెప్టెంబర్ 22, 24, 27 తేదీల్లో జరిగే మూడు వన్డేల సిరీస్‌తో పునరాగమనం చేస్తానని ఆసీస్ సీమర్ చెప్పాడు.



అన్ని మ్యాచ్‌లు 'ఫ్యాన్ కోడ్' యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌కు వేళాయె...

- నేటి నుంచి విశాఖలో టోర్నీ
- బరిలో ఆరు జట్లు, 19 మ్యాచ్‌లు
- ఆగస్టు 27న ఫైనల్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండో సీజన్ సమరానికి నేడు తెరలేవనుంది. మొత్తం ఆరు ఫ్రాంచైజీ జట్లు కోస్టల్ రైడర్స్, బెజవాడ టైగర్స్, రాయలసీమ కింగ్స్, గోదావరి టైటాన్స్, వైజాగ్ వారియర్స్, ఉత్తరాంధ్ర లయన్స్ మెరుపులతో టి20లో సత్తా చాటేందుకు సిద్ధమయ్యాయి. డిఫెండింగ్ చాంపియన్ కోస్టల్ రైడర్స్, రన్నరప్ బెజవాడ టైగర్స్‌ల మధ్య బుధవారం జరిగే పోరుతో రెండో సీజన్ మొదలవుతుంది. ప్రతి రోజు రెండేసి మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ నెల 27న టైటిల్ పోరు నిర్వహిస్తారు. పోటీలన్నీ విశాఖలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలోనే జరుగుతాయి. తొలి సీజన్‌లో ఆఖరి మెట్టుపై తడబడి టైటిల్ కోల్పోయిన బెజవాడ టైగర్స్ ఈ సారి టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. హిట్టర్ రికీ భుయ్‌పై గంపెడాశలు పెట్టుకున్న ఈ ఫ్రాంచైజీ రూ.8.10 లక్షలతో అతన్ని రిటెయిన్ చేసుకుంది. ఏపీఎల్‌లో ఇదే అత్యధిక మొత్తం కాగా, ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌లో నిరూపించుకున్న ఆంధ్ర క్రికెటర్లు హనుమ విహారి, కోన శ్రీకర్ భరత్‌లు


భరత్


విహారి


భుయ్

కూడా ఈ లీగ్‌లో ఆడుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. విహారి రాయలసీమ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. రూ. 6.60 లక్షలతో కింగ్స్ అతన్ని సొంతం చేసుకుంది. ఈ జట్టులో అతనిదే అత్యధిక పారితోషికం. భారత టెస్టు జట్టు వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ ఉత్తరాంధ్ర లయన్స్ తరఫున స్టార్‌గా బరిలో ఉన్నాడు. అతన్ని రూ. 6 లక్షలకు లయన్స్ కొనుగోలు చేసింది. వీళ్లతో పాటు ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) అకాడమీలలో రాణించిన కుర్రాళ్లు ఈ లీగ్‌తో ఏసీఏ సెలక్టర్ల కంట పడాలని ఆశిస్తున్నారు. 'మన ఆంధ్ర–మన ఏపీఎల్' అనే నినాదంతో పూర్తిగా స్థానిక కుర్రాళ్లకే అవకాశమిచ్చిన ఈ లీగ్‌ను చూసే ప్రేక్షకులకు కూడా నిర్వాహకులు బంపరాఫర్ ప్రకటించారు. ఏపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా తిలకించేందుకు వచ్చే ప్రేక్షకులకు లక్కీ డ్రాను ఏర్పాటు చేశారు. విజేతగా నిలిచిన క్రికెట్ అభిమానులకు ఈ స్టేడియంలో భారత్, ఆస్ట్రేలియాల మధ్య నవంబర్ 23న జరిగే టి20 మ్యాచ్ టికెట్లను ఉచితంగా బహూకరించనున్నారు.



అర్జున్ ఇరిగేశి విజయం

కార్ల్‌సన్‌కు తలవంచిన గుకేశ్

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచ కప్ చెస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో తెలంగాణ ఆటగాడు అర్జున్ ఇరిగేశి కీలక విజయాన్ని అందుకున్నాడు. మంగళవారం జరిగిన తొలి గేమ్‌లో అర్జున్ 53 ఎత్తుల్లో భారత్‌కే చెందిన ఆర్. ప్రజ్ఞానందను ఓడించాడు. నల్లపావులతో ఆడిన అర్జున్‌కు ఈ విజయంతో ఆధిక్యం దక్కింది. నేడు తెల్ల పావులతో ఆడి రెండో గేమ్‌ను 'డ్రా' చేసుకు న్నా అతను సెమీస్ చేరతాడు. మరో క్వార్టర్స్ పోరులో వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) జోరు ముందు భారత ఆటగాడు డి.గుకేశ్ నిలవలేకపోయాడు. నల్ల పావులతో ఆడిన కార్ల్‌సన్ 48 ఎత్తుల్లో గుకేశ్ ఆట కట్టించాడు. మరో రెండు క్వార్టర్ ఫైనల్ సమరాల తొలి గేమ్‌లు 'డ్రా'గా ముగిశాయి. విదిత్ గుజరాతీ (భారత్), నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్) మధ్య గేమ్ 109 ఎత్తుల్లో... ఫాబియానో కరువానా (అమెరికా), లీనియర్ డొమినెగ్వెజ్ పెరెజ్ (అమెరికా) మధ్య గేమ్ 71 ఎత్తుల్లో 'డ్రా' అయ్యాయి. మరోవైపు నలుగురు భారత ఆటగాళ్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరడం పెద్ద విశేషమని దిగ్గజ క్రీడాకారుడు విశ్వనాథన్ ఆనంద్ వ్యాఖ్యానించాడు. 'భారత చదరంలో ఇదో చారిత్రక ఘట్టం' అని ఆనంద్ విశ్లేషించాడు. 'ఒకరు కానీ ఇద్దరు కానీ క్వార్టర్ ఫైనల్ వరకు వెళ్లగలరని నేను అంచనా వేశాను. కానీ నలుగురు ముందంజ వేయగలిగారు. వారి ఆట చూస్తే ఇంకా ముందుకు వెళ్లగల సామర్థ్యం ఉందని నమ్ముతున్నా' అని ఆనంద్ అభిప్రాయ పడ్డాడు.

ఫుట్‌బాల్ దిగ్గజం హబీబ్ కన్నుమూత

70వ దశకంలో మెరిసిన హైదరాబాదీ



సాక్షి, హైదరాబాద్: భారత మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు, 70వ దశకంలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న మొహమ్మద్ హబీబ్ మంగళవారం కన్నుమూశారు. ఆయన వయసు 74 సంవత్సరాలు. హైదరాబాద్‌కు చెందిన హబీబ్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 1970లో మరో హైదరాబాదీ సయ్యద్ నయీముద్దీన్ నాయకత్వంలో బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో కాంస్యం గెలిచిన భారత జట్టులో హబీబ్ కీలక సభ్యుడు. అయితే హబీబ్ కెరీర్ అత్యుత్తమ దశ కోల్‌కతాలోనే గడిచింది. 1966నుంచి 1984 వరకు దాదాపు 18 ఏళ్ల పాటు ఆయన అక్కడ ప్రధాన ఆటగాడిగా కొనసాగడం విశేషం. మిడ్‌ఫీల్డర్‌గా మూడు ప్రఖ్యాత క్లబ్‌లు మోహన్‌బగాన్, ఈస్ట్ బెంగాల్, మొహమ్మదాన్ స్పోర్టింగ్‌లకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. హబీబ్ కెరీర్‌లో చిరస్మరణీయ క్షణం 1977లో వచ్చింది. కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఒక ఫ్రెండ్లీ మ్యాచ్‌లో హబీబ్ మోహన్‌బగాన్ తరఫున బరిలోకి దిగగా...ప్రత్యర్థి టీమ్ కాస్మోస్ క్లబ్‌లో ఆల్‌టైమ్ గ్రేట్ ఆటగాళ్లు పీలే, కార్లోస్ ఆల్బర్టో ఉన్నారు. మ్యాచ్ 2–2తో 'డ్రా'గా ముగియగా, ఇందులో హబీబ్ కూడా ఒక గోల్ చేశారు. మ్యాచ్ అనంతరం పీలే ప్రత్యేకంగా హబీబ్‌ను పిలిచి ఆయన ఆటను ప్రశంసించడం విశేషం. ప్రతిష్టాత్మక డ్యురాండ్ కప్ మూడు వేర్వేరు ఫైనల్ మ్యాచ్‌లలోనూ గోల్ చేసిన ఏకైక ఆటగాడిగా ఇప్పటికీ హబీబ్ రికార్డు నిలిచి ఉంది. జాతీయ ఫుట్‌బాల్ టోర్నీ 'సంతోష్ ట్రోఫీ'ని ఏకైక సారి ఆంధ్రప్రదేశ్ జట్టు 1966లో గెలుచుకుంది. నాడు ఏపీ తరఫున చెలరేగిన హబీబ్...ఫైనల్లో బెంగాల్‌నే ఓడించడం ప్రధాన పాత్ర పోషించడం గమనార్హం. పదేళ్ల పాటు (1965–75) భారత జట్టు తరఫున ఆడిన హబీబ్‌ను కేంద్ర ప్రభుత్వం 1980లో 'అర్జున' పురస్కారంతో గౌరవించింది. ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత టాటా ఫుట్‌బాల్ అకాడమీకి, భారత్ ఫుట్‌బాల్ సంఘానికి చెందిన అకాడమీకి కూడా కోచ్‌గా వ్యవహరించారు.



'ఆసియా' నుంచి తప్పుకున్న వినేశ్

అంతిమ్‌కు లైన్ క్లియర్



న్యూఢిల్లీ: ట్రయల్స్ లేకుండా ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు మినహాయింపు పొందిన మహిళా స్టార్ రెజ్లర్, డిఫెండింగ్ చాంపియన్ వినేశ్ ఫొగాట్ తాజాగా ఈ మెగా ఈవెంట్ నుంచి తప్పుకుంది. మోకాలు గాయం వల్ల హాంగ్జౌ ఈవెంట్‌లో పాల్గొనడం లేదని మంగళవారం ఆమె ప్రకటించింది. దీంతో మినహాయింపు అనుచితమంటూ కోర్టుకెక్కిన అంతిమ్ పంఘాల్‌కు 53 కేజీల కేటగిరీలో లైన్ క్లియరైంది. ఆ విభాగంలో ట్రయల్స్‌లో నెగ్గి ఆసియా ఈవెంట్‌కు అర్హత సంపాదించినప్పటికీ... వినేశ్ బరిలో ఉండటం వల్ల ఆమె స్టాండ్‌బైగా కూర్చోవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు వినేశ్ తనంతట తానుగా తప్పుకోవడంతో ఇక ఏ గొడవా లేకుండా అంతిమ్ ఆసియా క్రీడల్లో పాల్గొననుంది. 'ట్రెయినింగ్‌లో ఎడమ మోకాలుకు గాయమైంది. స్కానింగ్‌లో గాయం తీవ్రత దృష్ట్యా సర్జరీ తప్పనిసరని వైద్యులు సూచించడంతో ఈ నెల 17న ముంబైలో ఆపరేషన్ చేయించుకుంటాను. దీనివల్ల జకార్తా ఆసియా క్రీడల్లో (2018) సాధించిన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకోవాలనుకున్న నా ఆశలు ఆవిరయ్యాయి' అని వినేశ్ వాపోయింది. రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులపై వినేశ్, భజరంగ్, సాక్షి మాలిక్ తదితరులు పలుమార్లు జంతర్‌మంతర్ వద్ద నిరసనకు దిగారు. డబ్ల్యూఎఫ్ఐ అడ్‌హక్ కమిటీ వినేశ్, భజరంగ్‌లకు నేరుగా ఆసియా క్రీడల్లో పాల్గొనే అవకాశమివ్వడం వివాదానికి కారణమైంది. దీనిపై ట్రయల్స్ గెలిచిన అంతిమ్ కోర్టును ఆశ్రయించింది.

ఐర్లాండ్ గడ్డపై భారత జట్టు

డబ్లిన్: మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడేందుకు భారత జట్టు ఐర్లాండ్ చేరుకుంది. రాజధాని డబ్లిన్ శివారులోని మలహైడ్ మూడు టి20లకు వేదిక కానుంది. విండీస్‌తో టి20 సిరీస్ ఆడి ఈ సిరీస్‌కు కూడా ఎంపికైన ఆటగాళ్లు అక్కడినుంచి నేరుగా డబ్లిన్ ప్రయాణించారు. అయితే ఈ సిరీస్ కోసమే జట్టులోకి వచ్చిన కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిధ్ కృష్ణ, రుతురాజ్ గైక్వాడ్, వాషింగ్టన్ సుందర్, రింకూ సింగ్, శివమ్ దూబే నేరుగా భారత్‌నుంచి డబ్లిన్‌కు వెళ్లారు. ఈ నెల 18, 20, 23 తేదీల్లో మ్యాచ్‌లు జరుగుతాయి. సిరీస్ ఫలితంకంటే అందరి దృష్టీ ప్రధానంగా బుమ్రాపైనే నిలిచింది. గాయాల నుంచి కోలుకొని దాదాపు సంవత్సరం కాలం తర్వాత అతను మళ్లీ మ్యాచ్ బరిలోకి దిగబోతున్నాడు. కీలకమైన ఆసియా కప్, ప్రపంచ కప్‌కు


బుమ్రా

అతని బౌలింగ్ ప్రాక్టీస్‌తో పాటు మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరీక్షించేందుకు ఇది కీలకం కానుంది. బుమ్రా చివరిసారిగా గత ఏడాది సెప్టెంబర్ 25న హైదరాబాద్‌లో ఆస్ట్రేలియాతో టి20 మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత టి20 వరల్డ్ కప్ సహా ఇతర సిరీస్‌లతో పాటు ఈ సీజన్ ఐపీఎల్‌కు కూడా అతను దూరమయ్యాడు.

సినిమా


కమల్‌హాసన్

కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో 1996లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కమల్, శంకర్ కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' రూపొందుతోంది. దేశభక్తి నేపథ్యంలో సాగే చిత్రం కావడంతో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం 'ఇండియన్ 2' కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. లైకా ప్రొడక్షన్స్, ది రెడ్ జెయింట్ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

లవ్ ఆల్ అందరికీ కనెక్ట్ అవుతుంది

- పుల్లెల గోపీచంద్


సంజయ్, కేకే మీనన్, గోపీచంద్, సుధాంశు, దిలీప్సోని, ఎం. రమేశ్

''క్రీడాకారులుగా రాణించాలని కల కని మధ్యలోనే వదిలేసేవారు చాలామంది ఉంటారు. 'లవ్ ఆల్' సినిమా చూసినవారు ఇది మన కలే కదా అనుకుంటారు. బ్యాడ్మింటన్ గురించే కాదు.. మొత్తం క్రీడల గురించిన చిత్రం ఇది. ఈ చిత్రం అందరికీ కనెక్ట్ అవుతుంది'' అన్నారు భారత మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్. కేకే మీనన్ లీడ్ రోల్‌లో, స్వస్తిక ముఖర్జీ, శ్రీ స్వర, సుమిత్ అరోరా, ఆర్క్ జైన్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ డ్రామా 'లవ్ ఆల్'. మహేష్ భట్, ఆనంద్ పండిట్, పుల్లెల గోపీచంద్ సమర్పణలో సుధాంశు శర్మ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రమిది'. దిలీప్సోని జైస్వాల్, రాహుల్ వి. దూబే, సంజయ్ సింగ్ సహనిర్మాతలుగా, ఎం. రమేష్ లక్ష్మీ గణపతి ఫిల్మ్స్ ద్వారా ఈ చిత్రం హిందీ, తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, బంగ్లా, ఒడియాతో సహా ఆరు భారతీయ భాషలలో ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో కేకే మీనన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మెయిన్ స్టార్ బ్యాడ్మింటన్'' అన్నారు. ''ఈ చిత్రం చూశాక బ్యాడ్మింటన్ క్రీడపై ఆసక్తిని పెంచుకుంటారని నా నమ్మకం'' అన్నారు సుధాంశు శర్మ.

మీ నవ్వులు చూడాలనుకుంటున్నా

- విజయ్ దేవరకొండ



రవిశంకర్, శివ నిర్వాణ, సమంత, విజయ్ దేవరకొండ, గోవర్ధన్, నవీన్ యెర్నేని, హేషమ్ అబ్దుల్ వాహబ్

''నేను ఇండస్ట్రీకి వచ్చినప్పటి నుంచి నా సక్సెస్‌లో, ఫెయిల్యూర్స్‌లో ఇంత ప్రేమ ఇచ్చిన మీకు(ఫ్యాన్స్) థ్యాంక్స్. జీవితంలో చాలా మారాయి. ఎత్తు, పల్లాలు చూస్తున్నా. నా చుట్టూ మనుషులు మారుతున్నారు.. నా గురించి ఏదో మాట్లాడతారు. కానీ, మీ (ఫ్యాన్స్) ప్రేమ స్థిరంగా ఉంటుంది.. అందుకే సెప్టెంబర్ 1న మీ మొహాల్లో నవ్వులు చూడాలనుకుంటున్నా'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 1న విడుదలవుతోంది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన 'ఖుషి మ్యూజికల్ కన్సర్ట్' లో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''నీ మొహంలో నవ్వు చూడాలని మాత్రమే పనిచేస్తున్నా' అంటూ గత నెల రోజులుగా చెబుతున్నాడు శివ నిర్వాణ. నాక్కూడా నవ్వులు చూడాలని ఉంది. కానీ, నాకంటే ఎక్కువగా సమంత మొహంలో నవ్వులు చూడాలని ఉంది. తను ఈ సినిమా కోసం ఎంతో కష్టపడింది. అలాగే శివ నిర్వాణలోనూ నవ్వులు చూడాలనుంది'' అన్నారు. సమంత మాట్లాడుతూ–''మీ కోసం(అభిమానులు, ప్రేక్షకులు) కష్టపడుతున్నాను.. తిరిగి ఆరోగ్యంగా వస్తాను.. 'ఖుషి'తో బ్లాక్ బస్టర్ ఇస్తానని మీకు మాట ఇస్తున్నాను'' అన్నారు. శివ నిర్వాణ మాట్లాడుతూ–''ఖుషి' చూస్తే మీకు(ప్రేక్షకులు) విజయ్, సమంత కనిపించరు.. విప్లవ్, ఆరాధ్య మాత్రమే కనిపిస్తారు. సినిమా చూసి బయటికెళ్లేటప్పుడు ఈ మూవీని మరోసారి చూద్దామనిపిస్తుంది'' అన్నారు. ''డియర్ కామ్రేడ్' మేము అనుకున్నంత విజయం సాధించలేదు. కానీ 'ఖుషి' పెద్ద హిట్ కాబోతోంది'' అన్నారు నవీన్ యెర్నేని. ''శివ నిర్వాణతో మా బ్యానర్‌లో మరో సినిమా చేయనున్నాం'' అన్నారు వై.రవిశంకర్. ''ఖుషి మ్యూజికల్ కన్సర్ట్'కి విచ్చేసిన విజయ్, సమంతలకి థ్యాంక్స్. ఈ వేడుకని గ్రాండ్‌గా చేసేందుకు సహకారం అందించిన నవీన్, రవిశంకర్, దినేశ్‌గార్లకు కృతజ్ఞతలు'' అన్నారు చిత్ర సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్. ఈ కార్యక్రమంలో మైత్రీ మూవీస్ సీఈవో చెర్రీ, కెమెరామేన్ జి.మురళి, డైరెక్టర్ అనిల్ రావిపూడి తదితరులు పాల్గొన్నారు.

నిజం షూ లేస్ కట్టుకునే లోపే..!


అజ్మల్

దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కిస్తున్న చిత్రం 'వ్యూహం'. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హఠాన్మరణం తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రను అజ్మల్ పోషిస్తున్నారు. దాసరి కిరణ్ కుమార్ నిర్మిస్తున్న 'వ్యూహం' నుంచి రెండో టీజర్‌ని మంగళవారం రిలీజ్ చేశారు. 'నిజం తన షూ లేస్ కట్టుకునే లోపే అబద్ధం ప్రపంచమంతా ఓ రౌండ్ వేసి వస్తుంది' (అజ్మల్), 'ఎప్పుడో ఒకప్పుడు మీరు కల్యాణ్‌ను కూడా వెన్నుపోటు పొడుస్తారుగా' (ఓ పాత్రధారి), 'వాడికంత సీన్ లేదు. తనను తానే పొడుచుకుంటాడు' (మరో పాత్రధారి) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''వ్యూహం' చిత్రీకరణ 50 శాతానికి పైగా పూర్తయింది'' అన్నారు దాసరి కిరణ్ కుమార్.

సవాల్‌గా తీసుకున్నాం

- నిర్మాత అప్పిరెడ్డి


రవీందర్ రెడ్డి, అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి

సయ్యద్ సోహైల్ రియాన్, రూపా కొడవాయుర్ జంటగా శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్టర్ ప్రెగ్నెంట్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో అప్పిరెడ్డి మాట్లాడుతూ– ''మేల్ ప్రెగ్నెన్సీ' కథ అనగానే.. కత్తి మీద సాములాంటిది, సినిమా చేయొద్దని కొందరు సలహా ఇచ్చారు. కానీ మేం సవాల్‌గా తీసుకుని చేశాం. ఇండస్ట్రీలో సుదీర్ఘమైన ప్రయాణం చేయాలనే ప్రణాళికతో వచ్చాం. ప్రస్తుతం ఐదారు సినిమాల వర్క్ జరుగుతోంది. వీటిలో రెండు సినిమాల చిత్రీకరణ పూర్తయింది'' అని చెప్పారు. రవీందర్ రెడ్డి సజ్జల మాట్లాడుతూ– ''ఈ సినిమాలో సందేశంతో పాటు వాణిజ్య పరమైన అంశాలు కూడా ఉన్నాయి. శ్రీనివాస్ మంచి అనుభవం ఉన్న వ్యక్తిలా ఈ సినిమాను తెరకెక్కించారు'' అన్నారు. ''భావోద్వేగం, వినోదం.. వంటి అంశాలతో ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా కథనం ఉంటుంది'' అన్నారు వెంకట్ అన్నపరెడ్డి.

ఆ రోజు వ్యాక్సిన్ వార్


నానా పటేకర్

'ది కశ్మీర్ ఫైల్స్' (2022) చిత్రం తర్వాత దర్శక–నిర్మాత వివేక్ రంజన్ అగ్నిహోత్రి తెరకెక్కించిన చిత్రం 'ది వ్యాక్సిన్ వార్'. ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్, నానా పటేకర్, సప్తమి గౌడ, పరితోష్ శాండ్, స్నేహ మిలాండ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటించడంతో పాటు అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అసోసియేషన్‌తో పల్లవి జోషి నిర్మిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్లింప్స్‌ను రిలీజ్ చేసి, ఈ సినిమాను సెప్టెంబరు 28న రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ''దేశంలో జరిగిన కోవిడ్–19 వ్యాక్సిన్ డ్రిల్స్ ఆధారంగా ఈ సినిమా ఉంటుంది. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ, భోజ్‌పురి, బెంగాలీ, అస్సామీ, ఇంగ్లిష్‌లతో సహా పదికి పైగా భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

రీల్స్

వాళ్లందరికీ సెల్యూట్

– సాయిధరమ్ తేజ్


'దిల్' రాజు, సాయిధరమ్ తేజ్

''మన రేపటి కోసం తమ నేటి రోజుని త్యాగం చేస్తున్న సైనికులకు సెల్యూట్. సోల్జర్స్‌కి నివాళులర్పిస్తూ 'సోల్ ఆఫ్ సత్య' పాట చేసినందుకు హ్యాపీగా ఉంది'' అని సాయిధరమ్ తేజ్ అన్నారు. నవీన్ విజయకృష్ణ దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్, కలర్స్ స్వాతి జంటగా రూపొందిన షార్ట్ ఫీచర్ ఫిల్మ్ 'సత్య'. దిల్ రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్, హన్షిత నిర్మించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలుగు, తమిళ, హిందీలో 'సోల్ ఆఫ్ సత్య..' మ్యూజికల్ షార్ట్‌ను రామ్ చరణ్ షేర్ చేశారు. ''ఎన్నో కలలు ఉండే అమ్మాయికి మిలటరీ వ్యక్తి భర్తగా వస్తే ఎలా ఉంటుంది? అనేదే 'సోల్ ఆఫ్ సత్య'' అన్నారు 'దిల్' రాజు. మ్యూజిక్ డైరెక్టర్ శ్రుతి రంజని, నిర్మాతలు హర్షిత్, హన్షిత మాట్లాడారు.

ముప్పై కథలు విన్నాం!


శివ ప్రసాద్

సంతోష్ శోభన్, రాశీ సింగ్, రుచిత సాధినేని హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమ్ కుమార్'. రైటర్ అభిషేక్ మహర్షి దర్శకత్వంలో శివ ప్రసాద్ పన్నీరు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో శివ ప్రసాద్ మాట్లాడుతూ– ''సంతోష్, అభిషేక్‌లతో ఓ సినిమా చేయాలనుకుని 30 కథలు విన్నాం. చివరిగా 'ప్రేమ్‌కుమార్' కథను ఎంపిక చేసుకున్నాం. పీటల మీద పెళ్లి రద్దు కావడం, ఆ తర్వాత కథానాయిక దృష్టి కోణంలో సినిమా సాగడం చాలా సినిమాల్లో చూశాం. అయితే ఓ పెళ్లి రద్దయితే ఆ పెళ్లికొడుకు జీవితం ఎలా సాగుతుందనే కోణంలో 'ప్రేమ్ కుమార్' సాగుతుంది'' అన్నారు.

ఎమోషనల్ పిజ్జా


అశ్విన్, పవిత్ర

''పిజ్జా 3' కథ ఆసక్తిగా ఉంటుంది. ఈ సినిమాని ఫ్యామిలీతో కలసి చూడండి.. తప్పకుండా ఎంజాయ్ చేస్తారు'' అని హీరో అశ్విన్ కాకుమణి అన్నారు. 'పిజ్జా' మూవీ ఫ్రాంచైజీలో రూపొందిన చిత్రం 'పిజ్జా 3'. అశ్విన్ కాకుమణి, పవిత్ర మారిముత్తు జంటగా మోహన్ గోవింద్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్‌పీపై మురళి, ఆశిష్ వేమిశెట్టి ఈ నెల 18న తెలుగులో విడుదల చేస్తున్నారు. ''పిజ్జా 3' ప్యూర్ హారర్ మూవీ. బలమైన కంటెంట్, ఎమోషన్స్ ఉంటాయి'' అన్నారు మోహన్ గోవింద్. ''ఈ సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు ఆశిష్ వేమిశెట్టి.

అందమైన ప్రేమకథ


జయకుమార్, సిరి

జయకుమార్, శీను, స్వీటీ, సిరి రావుల చారి, సునీత ప్రధాన పాత్రల్లో ప్రకాష్ పల్ల దర్శకత్వం వహించిన చిత్రం 'మదిలో మది'. నేముకూరి జయకుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న రిలీజవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో జయకుమార్ మాట్లాడుతూ– ''క్లయిమాక్స్‌లో ప్రేక్షకులు కంట తడిపెడతారు'' అన్నారు ''అందమైన ప్రేమకథా చిత్రమిది'' అన్నారు ప్రకాష్ పల్ల. తాగుబోతు రమేశ్ అతిథిగా పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
16-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 79	నిఫ్టీ ▲ 6
65,402	19,435

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,694	▽	94
డోజోన్స్	34,999	▽	308
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,390	▽	118
డాక్స్	15,764	▽	137
షాంఘై	3,176	▽	2
నికాయ్	32,239	▲	179

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

‘జీవీకే’ ఈక్వల్ ప్లాట్‌ఫామ్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ: వ్యాపార దిగ్గజం జీవీకే గ్రూప్ వైస్ చైర్మన్ సంజయ్ రెడ్డి కుమారుడు కేశవ్ రెడ్డి కొత్తగా ఈక్వల్ పేరిట ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిజిలాకర్, పబ్లిక్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండియా స్టాక్ భాగస్వామ్యంతో దీన్ని రూపొందించారు. యూజర్లు తమ డిజిటల్ పత్రాలను భద్రపర్చుకునేందుకు, ఒక్క క్లిక్‌తో సురక్షితంగా, నిరాటంకంగా షేర్ చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇందులో సుమారు 10 లక్షల బీటా యూజర్లు ఉన్నారని కేశవ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డి వెంచర్స్, అరాజెన్ లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ ఫౌండేషన్ జీవీకే ఏఎంఆర్‌ఐ బోర్డుల్లో ఆయన సభ్యుడిగా ఉన్నారు.

అదానీ చేతికి క్వింటిలియన్

మిగతా 51% వాటా కొనుగోలుకు ఒప్పందం

న్యూఢిల్లీ: మీడియా దిగ్గజం రాఘవ్ బెహల్ నెలకొల్పిన డిజిటల్ న్యూస్ ప్లాట్‌ఫామ్ క్వింటిలియన్ బిజినెస్ మీడియాలో (క్యూబీఎంఎల్) మిగతా 51 శాతం వాటాను వ్యాపార దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేయనుంది. తమ అనుబంధ సంస్థ ఏఎంజీ మీడియా నెట్‌వర్క్స్ (ఏఎంఎన్ఎల్) ఇందుకు సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. లావాదేవీ పూర్తయ్యాక ఏఎంఎన్ఎల్‌కు క్యూఎంఎల్ పూర్తి అనుబంధ సంస్థగా మారుతుందని పేర్కొంది. బీక్యూ ప్రైమ్ పేరిట మీడియా ప్లాట్‌ఫామ్‌ను నిర్వహించే క్యూబీఎంఎల్‌లో ఏఎంఎన్ఎల్ గతంలో రూ. 48 కోట్లకు 49% వాటాలను కొనుగోలు చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-8-2023	
విశాఖ	470-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	460-00
విజయవాడ	460-00
రిటైల్ ధర (డజను)	72.00
15-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

మహీంద్రా నుంచి చిన్న ట్రాక్టర్లు

- ధర రూ. 5,64,500 నుంచి ప్రారంభం
- మూడేళ్లలో రెట్టింపు ఎగుమతులపై దృష్టి


కొత్త వాహనాల ఆవిష్కరణ కార్యక్రమంలో మహీంద్రా ఈడీ రాజేష్ జెజూరికర్ తదితరులు

కేప్‌టౌన్ (దక్షిణాఫ్రికా): ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) కొత్తగా మరిన్ని వాహనాలను ఆవిష్కరించింది. చిన్న ట్రాక్టర్లు, కార్లు వీటిలో ఉన్నాయి. చిన్న కమతాల రైతులు, వ్యక్తిగత ఫామ్‌హౌస్‌లున్న వారు మొదలైన వర్గాలకు ఉపయోగపడేలా తేలికపాటి, చిన్న ట్రాక్టర్లను ఫ్యూచర్‌స్కేప్ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో కంపెనీ ప్రవేశపెట్టింది. మహీంద్రా ఓజా పేరిట ఆవిష్కరించిన ఈ ట్రాక్టర్ల శ్రేణిలో ఏడు మోడల్స్ ఉంటాయి. వీటి ధర రూ. 5,64,500 నుంచి రూ. 7,35,000 వరకు (పుణె-ఎక్స్ షోరూమ్) ఉంటుంది. తెలంగాణలోని జహీరాబాద్ ప్లాంటులో తయారు చేసే ఈ ట్రాక్టర్లను దేశీయంగా విక్రయించడంతో పాటు ఉత్తర అమెరికా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, యూరప్ తదితర ప్రాంతాలకు కూడా ఎగుమతి చేయనున్నట్లు సంస్థ ఈడీ (ఆటో, ఫార్మ్ విభాగాలు) రాజేశ్ జెజూరికర్ తెలిపారు. వచ్చే మూడేళ్లలో ట్రాక్టర్ల ఎగుమతులను రెట్టింపు చేసుకోవాలని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో 18,000 పైచిలుకు ట్రాక్టర్లను ఎగుమతి చేసింది. ఓజా ప్లాట్‌ఫాంపై రూ. 1,200 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు జెజూరికర్ వివరించారు. మహీంద్రా రీసెర్చ్ వ్యాలీ, మిత్సుబిషి మహీంద్రా అగ్రికల్చర్ మెషినరీ కలిసి దీన్ని తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.

థార్.ఈ, గ్లోబల్ పికప్ ఆవిష్కరణ..

ఫ్యూచర్‌స్కేప్ కార్యక్రమంలో భాగంగా ఎంఅండ్ఎం ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ‘థార్.ఈ’ని కూడా ఆవిష్కరించింది. వినూత్నమైన డిజైన్, ఇంటీరియర్స్‌తో పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని దీన్ని రూపొందించినట్లు సంస్థ ఆటోమోటివ్ విభాగం ప్రెసిడెంట్ వీజే నక్రా తెలిపారు. మరోవైపు, అంతర్జాతీయ మార్కెట్ల కోసం గ్లోబల్ పికప్ వాహనాన్ని సైతం సంస్థ ఆవిష్కరించింది. రోజువారీ ప్రయాణ అవసరాలతో పాటు సాహస ట్రిప్‌లకు కూడా అనువుగా ఇది ఉంటుందని నక్రా వివరించారు. అటు, విద్యుత్ వాహనాల శ్రేణి కోసం నెలకొల్పిన మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్స్ (ఎంఈఏఎల్)కి కొత్త లోగోను కూడా కంపెనీ ఆవిష్కరించింది. దీనికి సంబంధించిన ‘లే ఛలాంగ్’ ప్రచార గీతాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ స్వరపర్చారు.

ఓలా ఈ-స్కూటర్ @ రూ.79,999

- ఎస్1ఎక్స్ సిరీస్ నుంచి మూడు వేరియంట్లు
- ఎస్1 ఎయిర్, ఎస్1 ప్రో పేర్లతో మరో రెండు




న్యూఢిల్లీ: ఓలా ఎలక్ట్రిక్ ఒకేసారి అయిదు ఈ-స్కూటర్లు విడుదల చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15) సందర్భంగా కస్టమర్ డే-2023 పేరిట నిర్వహించిన కార్యక్రమంలో వీటిని లాంచ్ చేసింది. తన ఎంట్రీ లెవల్ ఎస్1ఎక్స్ సిరీస్‌లో ఎస్1ఎక్స్ (2కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ), ఎస్1ఎక్స్(3కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ), ఎస్1ఎక్స్ ప్లస్ మూడు వేరియంట్లు ఉన్నాయి. అలాగే ఎస్1 ఎయిర్, ఎస్1 ప్రో పేరుతో మరో రెండు మోడళ్లను తీసుకొచ్చింది. ప్రారంభ ఆఫర్ కింద రూ.89,999గా ఉండే ఎస్1ఎక్స్ 2కిలోవాట్ బ్యాటరీ వేరియంట్‌ను రూ.79,999కే పొందొచ్చు. ఎస్1ఎక్స్ (3కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ) ప్రస్తుత ధర రూ.89,999గా ఉంది. దీన్ని సైతం ఆగస్టు 21 వరకు రూ.10 వేల తక్కువకే అందిస్తున్నారు. వీటి బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. డిసెంబర్‌లో డెలివరీ ఉంటుంది. ఎస్1ఎక్స్ ప్లస్ ప్రస్తుత ధర రూ.99,999 గా ఉంది. వారం తర్వాత రూ.1,09,999కి చేరుతుంది. బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. డెలివరీ సెప్టెంబర్ చివర్లో ఉంటుంది. ఎస్ 1 ఎయిర్ ఎక్స్ షోరూం ధరల రూ.1.19 లక్షలుగా ఉంది. సెకండ్ జనరేషన్ ఎస్1ప్రో ఎక్స్ షోరూం ధర రూ.1,47,499 గా ఉంది. అలాగే ఈవెంట్‌లో డైమండ్‌హెడ్, అడ్వెంచర్, రోడ్‌స్టర్, క్రూయిజర్ నాలుగు మోటార్ బైకులనూ ఆవిష్కరించింది. వచ్చే ఏడాది చివర్లో వీటిని మార్కెట్లోకి తెస్తున్నట్లు తెలిపింది.

45 గిగావాట్ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం లక్ష్యం!

2030 నాటికి అదానీ గ్రీన్ ఎనర్జీ ప్రణాళిక

న్యూఢిల్లీ: బిలియనీర్ గౌతమ్ అదానీ పునరుత్పాదక ఇంధన సంస్థ 2030 నాటికి 45 గిగావాట్ల (జీడబ్ల్యూ)పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఉద్గారాలను తగ్గించి, భారత్ తన కార్బన్ న్యూట్రాలిటీ లక్ష్యాన్ని చేరుకోవడానికి తన వంతు సహాయ సహకారాలను అందించాలని సంస్థ భావిస్తున్నట్లు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ వర్గాలు తెలిపాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 8,316 మెగావాట్ల (8.3 జీడబ్ల్యూ) పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రస్తుతం కలిగి ఉంది. మరో 12,118 మెగావాట్ల సామర్థ్యం నిర్మాణ దశలో ఉందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.



ఇన్ఫీకి రూ.13,650 కోట్ల కాంట్రాక్ట్

- లిబర్టీ గ్లోబల్‌తో డీల్..
- అయిదేళ్ల పాటు ఐటీ సేవలు



న్యూఢిల్లీ: దేశీ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తాజాగా వీడియో, బ్రాడ్‌బ్యాండ్, కమ్యూనికేషన్స్ సంస్థ లిబర్టీ గ్లోబల్ కాంట్రాక్టు దక్కించుకుంది. దీని కింద లిబర్టీ గ్లోబల్ డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్, కనెక్టివిటీ ప్లాట్‌ఫామ్‌లను మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన ఐటీ సేవలు అందించాల్సి ఉంటుంది. అయిదేళ్ల పాటు అమల్లో ఉండే ఈ డీల్ విలువ 1.5 బిలియన్ యూరోలు (సుమారు రూ. 13,650 కోట్లు). అవసరాన్ని బట్టి 8 ఏళ్ల వరకు దీన్ని పెంచితే ఇది 2.3 బిలియన్ యూరోల స్థాయికి కూడా చేరవచ్చు. ఇందుకు సంబంధించిన ఒప్పందం ప్రకారం లిబర్టీ గ్లోబల్‌కి చెందిన కొన్ని విభాగాల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, టెక్నాలజీ బృందాలను ఇన్ఫీకి బదలాయిస్తారు. దీనితో దాదాపు 400 మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ ఒప్పందం కారణంగా వ్యయాలు తగ్గించుకోవడం, టెక్నాలజీపై పెట్టుబడుల పరంగా లిబర్టీ గ్లోబల్‌కు ఏటా 100 మిలియన్ యూరోల పైగా ఆదా కాగలదని ఇన్ఫీ తెలిపింది. 2020 ఫిబ్రవరి నుంచి లిబర్టీకి ఇన్ఫీ సేవలు అందిస్తోంది. మరిన్ని మార్కెట్లకు విస్తరించేందుకు, కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇన్ఫోసిస్‌తో డీల్ ఉపయోగపడగలదని లిబర్టీ గ్లోబల్ సీఈవో మైక్ ఫ్రైస్ తెలిపారు. దీనివల్ల తమకు గణనీయంగా ఆదా కావడంతో పాటు తమ ఉద్యోగులు కెరియర్‌లో పురోగమించేందుకు అవకాశాలు కూడా లభించగలవని వివరించారు. లిబర్టీ క్లౌడ్ విభాగానికి ఇప్పటివరకు తమ కోబాల్ట్ సాధనంతో సేవలు అందించగా.. ఇకపై కృత్రిమ మేధకు సంబంధించి టోపాజ్ సాధనాన్ని కూడా జత చేయనున్నామని ఇన్ఫీ సీఈవో సలిల్ పరేఖ్ తెలిపారు.

ఫాక్స్‌కాన్ హైదరాబాద్ ప్లాంటులో ఎయిర్‌పాడ్స్ తయారీ



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం యాపిల్ కోసం వైర్‌లెస్ ఇయర్‌బడ్స్ (ఎయిర్‌పాడ్స్)ను ఫాక్స్‌కాన్ తమ హైదరాబాద్ ప్లాంటులో తయారు చేయనుంది. 2024 డిసెంబర్ నాటికి భారీ స్థాయిలో వీటి ఉత్పత్తిని ప్రారంభించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ ప్లాంటుపై ఫాక్స్‌కాన్ దాదాపు 400 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తోంది. ఐఫోన్ల తర్వాత యాపిల్ పోర్ట్‌ఫోలియోలో అత్యధికంగా అమ్ముడయ్యే ఉత్పత్తుల్లో ఎయిర్‌పాడ్‌లు రెండో స్థానంలో ఉన్నాయి. ట్రూ వైర్‌లెస్ స్టీరియో (టీడబ్ల్యూఎస్) మార్కెట్లో 36 శాతం వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి. మరోవైపు, తమ ప్రణాళికలను సక్రమంగా అమలు చేయగలిగితే భారత్‌లో బిలియన్ల కొద్దీ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టే అవకాశాలు ఉన్నాయని కంపెనీ రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా హోన్ హాయ్ టెక్నాలజీ గ్రూప్ (ఫాక్స్‌కాన్) చైర్మన్ యంగ్ లియు తెలిపారు. వార్షిక ప్రాతిపదికన భారత్‌లోని తమ విభాగం 10 బిలియన్ డాలర్ల పైగా టర్నోవరు సాధించినట్లు వివరించారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

ప్రధాని ప్రసంగాన్ని ‘బ్లూప్రింట్’గా అభివర్ణించిన పరిశ్రమ వర్గాలు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే బ్లూప్రింట్ వంటిదని పారిశ్రామిక వర్గాలు పేర్కొన్నాయి. మోదీ ప్రసంగంలో గత దశాబ్దంలో తమ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరిస్తూ, 2047 నాటికి భారతదేశం ‘వికసిత భారత్’ (అభివృద్ధి చెందిన దేశం)గా మారేందుకు బ్లూప్రింట్‌ను రూపొందించిందని పరిశ్రమల సంఘం సీఐఐ తెలిపింది. భారత్‌ను మూడో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించాలన్న ప్రధాని దార్శనికత వచ్చే ఐదేళ్లలో సులువుగా ఫలించగలదని సీఐఐ విశ్వసిస్తోందని డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ తెలిపారు. ప్రధాని తన ప్రసంగంలో వివరించిన విజయాలు, దార్శనికత అమృత్ కాలంలో భారతదేశం అగ్రగామిగా, ప్రపంచ సూపర్ పవర్‌గా ఎదిగేందుకు కావాల్సిన బలం, ధైర్యాన్ని అందిస్తాయి. ఇందుకు తగిన వేదికను ఏర్పాటు చేస్తాయి'' అని ఆయన అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మోదీ చేసిన ప్రసంగం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే జాతీయ సంకల్పాన్ని మరింత ముందుకు తీసుకువెళుతుందని అసోచామ్ సెక్రటరీ జనరల్ దీపక్ సూద్ అన్నారు.

భవిత

జాబ్ పాయింట్

భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌లో 45 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్).. వివిధ బీడీఎల్ కార్యాలయాలు/యూనిట్లలో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 45
» బీడీఎల్ యూనిట్/కార్యాలయాలు: కార్పొరేట్ ఆఫీస్(గచ్చిబౌలి), కంచన్‌బాగ్ యూనిట్(హైదరాబాద్), భానూర్ యూనిట్(సంగారెడ్డి జిల్లా), ఇబ్రహీంపట్నం (రంగారెడ్డి జిల్లా), విశాఖపట్నం యూనిట్.
» పోస్టుల వివరాలు:మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎలక్ట్రానిక్స్)-15, మేనేజ్‌మెంట్ ట్రైనీ(మెకానికల్)-12,మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎలక్ట్రికల్)-04, మేనేజ్‌మెంట్ ట్రైనీ(కంప్యూటర్ సైన్స్)-01, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సైబర్ సెక్యూరిటీ)-02, మేనేజ్‌మెంట్ ట్రైనీ(కెమికల్)-02, మేనేజ్‌మెంట్ ట్రైనీ (సివిల్)-02, మేనేజ్‌మెంట్ ట్రైనీ(బిజినెస్ డీఈవీ)-01,మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఆప్టిక్స్)-01,మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఫైనాన్స్)-02,వెల్ఫేర్ ఆఫీసర్-02,జేఎం(పబ్లిక్ రిలేషన్స్)-01.
» అర్హత:సంబంధిత విభాగంలో డిగ్రీ,పీజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 27.07.2023 నాటికి ఎంటీ(ఫైనాన్స్)/వెల్ఫేర్ ఆఫీసర్/జేఎం పోస్టులకు 28 ఏళ్లు, ఇతర పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు.
» పే స్కేల్: నెలకు ఎంట్రీ పోస్టులకు రూ.40,000 నుంచి రూ.1,40,000, వెల్ఫేర్ ఆఫీసర్/జేఎం పోస్టులకు రూ.30,000 నుంచి రూ.1,20,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష(కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్ష), ఇంటర్వ్యూ ఆధారంగా.
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది: 21.08.2023
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు తేది: 20.09.2023.
» రాతపరీక్ష తేది:డిసెంబర్ 2023/జనవరి2024
» వెబ్‌సైట్: https://bdl-india.in

సెయిల్ ఒడిశాలో 202 ట్రెయినీ పోస్టులు

ఒడిశా రాష్ట్రం రూర్కేలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్).. స్థానిక అభ్యర్థుల నుంచి ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 202
» విభాగాలు: క్రిటికల్ కేర్, అడ్వాన్స్‌డ్ నర్సింగ్ ట్రెయినింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, మెడికల్ ల్యాబ్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో మెట్రిక్యులేషన్ /జీఎన్ఎం/డిప్లొమా /బీబీఏ/ఎంబీఏ/పీజీ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 35 ఏళ్లు ఉండాలి. » స్టైపెండ్: నెలకు రూ.7,000 నుంచి రూ.15,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.08.2023
» వెబ్‌సైట్: www.sail.co.in

ఎన్ఐఏలో.. ఏఓ కొలువులు

ప్రభుత్వరంగ బీమా సంస్థల్లో ఒకటైన న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ.. జనరల్, స్పెషలిస్ట్ విభాగాల్లో.. 450 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఇందులో విజయం సాధించి నియామకం ఖరారు చేసుకుంటే.. ప్రారంభంలోనే రూ.80వేల వరకూ వేతనం అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ ఏవో పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

» జనరలిస్ట్, స్పెషలిస్ట్ కేడర్‌లో 450 ఉద్యోగాలు
» న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ నోటిఫికేషన్
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ
» ఎంపికైతే నెలకు రూ.80వేల వేతనం



మొత్తం 450 ఏవో పోస్టులు

న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ తాజా నియామక ప్రక్రియ ద్వారా జనరలిస్ట్ కేడర్‌తో పాటు మరో ఏడు స్పెషలిస్ట్ కేడర్లలో 450 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో జనరలిస్ట్ 120 పోస్టులు, రిస్క్ ఇంజనీర్స్ 36, ఆటోమొబైల్ ఇంజనీర్స్ 96, లీగల్ 70, అకౌంట్స్-30, హెల్త్-75, ఐటీ-23 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- జనరలిస్ట్ ఏఓ: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీలో ఉత్తీర్ణత ఉండాలి.
- రిస్క్ ఇంజనీర్స్: 60 శాతం మార్కులతో బీటెక్/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- ఆటోమొబైల్ ఇంజనీర్: ఆటోమొబైల్ బ్రాంచ్‌తో 60 శాతం మార్కులతో బీటెక్/ ఎంటెక్ ఉత్తీర్ణత సాధించాలి.
- లీగల్ ఆఫీసర్స్: 60 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ/ఎల్ఎల్ఎం ఉత్తీర్ణత ఉండాలి.
- అకౌంట్స్ ఏఓ: బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ) కోర్సు పాసవ్వాలి.
- హెల్త్ ఏఓ: ఎంబీబీఎస్/ఎండీ/మెడికల్ పీజీ/బీడీఎస్/ఎండీఎస్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్‌లలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- ఐటీ స్పెషలిస్ట్: కంప్యూటర్ సైన్స్/ఐటీ బ్రాంచ్‌తో 60 శాతం మార్కులతో బీటెక్ లేదా ఎంటెక్ ఉత్తీర్ణత ఉండాలి. లేదా ఎంసీఏలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- అన్ని పోస్ట్‌లకు సంబంధించి రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు సంబంధిత కోర్సుల్లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది.
- వయసు: ఆగస్ట్ 1, 2023 నాటికి 30 సంవత్సరాలలోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఆకర్షణీయ వేతనం

ఏఓగా పూర్తి స్థాయిలో కొలువుదీరిన వారికి ఆకర్షణీయ వేతనం లభిస్తుంది. స్కేల్-1 ఆఫీసర్ హోదాలో రూ.50,925-రూ.96,765 వేతన శ్రేణితో ప్రారంభ వేతనం ఉంటుంది. స్థూల వేతనం నెలకు రూ .80 వేలుగా ఉంటుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి మొత్తం మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. ప్రిలిమినరీ రాత పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ.

ప్రిలిమినరీ.. 100 మార్కులు

ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ రాత పరీక్ష మూడు విభాగాల్లో 100 మార్కులకు ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 ప్రశ్నలు-35 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ పరీక్ష నిర్వహిస్తారు.పరీక్ష సమయం ఒక గంట.

రెండో దశ మెయిన్ ఎగ్జామ్

ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. రెండో దశ మెయిన్ ఎగ్జామ్ నిర్వహిస్తారు. ప్రిలిమినరీ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు 15 మందిని చొప్పున మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్షను జనరలిస్ట్ కేడర్, స్పెషలిస్ట్ కేడర్ పోస్ట్‌లకు వేర్వేరుగా నిర్వహిస్తారు.

జనరలిస్ట్ ఏఓ మెయిన్

జనరలిస్ట్ ఏఓ మెయిన్ పరీక్ష నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. టెస్ట్ ఆఫ్ రీజనింగ్, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్, టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి 50 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.

స్పెషలిస్ట్ ఏఓ మెయిన్ పరీక్ష

స్పెషలిస్ట్ కేడర్ పోస్ట్‌లకు నిర్వహించే మెయిన్ ఎగ్జామ్ అయిదు విభాగాల్లో 200 మార్కులకు జరుగుతుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు, సంబంధిత సబ్జెక్ట్ నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. ఈ పరీక్ష కూడా పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది.

డిస్క్రిప్టివ్ పరీక్ష

- జనరలిస్ట్, స్పెషలిస్ట్ ఏఓ పోస్ట్‌లకు సంబంధించి మెయిన్ ఎగ్జామ్‌లో భాగంగానే ఆబ్జెక్టివ్ టెస్ట్ తోపాటు మరో 30 మార్కులకు డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు.
- డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో అభ్యర్థులు లెటర్ రైటింగ్(10 మార్కులు), ఎస్సే రైటింగ్(20 మార్కులు) రాయాల్సి ఉంటుంది.
- పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో 30 నిమిషాల వ్యవధిలో ఉండే ఈ డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో అభ్యర్థులు కంప్యూటర్ ద్వారా లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

మెయిన్ ఎగ్జామ్, డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపికైన వారికి చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలో అభ్యర్థులకు బీమా రంగంతోపాటు తాజా పరిణామాలపై అవగాహనను పరిశీలిస్తారు. దీంతోపాటు వారు దరఖాస్తు చేసుకున్న పోస్ట్, అర్హతలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.

వెయిటేజీ విధానం

మూడు దశల ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత నియామకాలు ఖరారు చేసే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు.మెయిన్ ఎగ్జామ్‌లో పొందిన మార్కులకు 75 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 25 శాతం వెయిటేజీ కేటాయిస్తారు. అభ్యర్థులు పొందిన మార్కులను ఈ వెయిటేజీకి అనుగుణంగా క్రోడీకరించి.. తుది జాబితా రూపొందించి నియామకం ఖరారు చేస్తారు.

ఏడాది ప్రొబేషన్

- ఎంపికైన అభ్యర్థులకు ఏడాది పాటు ప్రొబేషన్ పిరియడ్ ఉంటుంది. వీరు ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిర్వహించే నాన్-లైఫ్ లైసెన్సియేట్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ప్రొబేషన్ పూర్తయినట్లుగా పరిగణిస్తారు. లేదంటే మరో ఆరు నెలలు పొడిగిస్తారు.
- నియామకం ఖరారు చేసుకున్న అభ్యర్థులు కనీసం నాలుగేళ్ల పాటు సంస్థలోనే పని చేస్తామని సర్వీస్ బాండ్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

ఉన్నత హోదాలు

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన వారు భవిష్యత్తులో ఆయా విభాగాల్లో ఉన్నత హోదాలకు చేరుకునే అవకాశముంది. తొలుత అయిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నాక.. పదోన్నతికి అర్హత లభిస్తుంది. అసిస్టెంట్ మేనేజర్/బ్రాంచ్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్/డివిజనల్ మేనేజర్; సీనియర్ డివిజనల్ మేనేజర్, చీఫ్ మేనేజర్, రీజనల్ మేనేజర్; డీజీఎం, జీఎం వంటి హోదాలకు చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:21.08.2023.
- ప్రిలిమినరీ(ఫేజ్-1) రాత పరీక్ష తేదీ: సెప్టెంబర్ 9, 2023.
- మెయిన్(ఫేజ్-2) రాత పరీక్ష తేదీ: అక్టోబర్ 8, 2023.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://www.newindia.co.in/portal/readMore/Recruitment

విజయం సాధించాలంటే

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

రీజనింగ్

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో కీలకమైన రీజనింగ్ కోసం అభ్యర్థులు పక్కా ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి. సిరీస్,అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్,డైరెక్షన్స్,బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్,సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను సాధన చేయాలి.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగం కోసం అభ్యర్థులు మరింత ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ఇన్సూరెన్స్, ఆర్థిక రంగంలో మార్పులు, తాజా పథకాల గురించి తెలుసుకోవాలి. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్స్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

సబ్జెక్ట్, ప్రొఫెషనల్ నాలెడ్జ్

మెయిన్ పరీక్షలో ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగంలో మంచి స్కోర్ కోసం అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. అంతేకాకుండా ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

క్లుప్తంగా...

ఆర్టిలరీ సెంటర్‌లో 'వీర్ ధర్మ సరోవర్' నిర్మాణం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన బ్రిగేడియర్ రాజీవ్ చౌహాన్

సాక్షి, హైదరాబాద్: అమృత్ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా గోల్కొండ సమీపంలోని ఆర్టిలరీ సెంటర్‌లో నిర్మించిన 'వీర్ ధర్మ సరోవర్'ను ఆర్టిలరీ సెంటర్ కమాండెంట్ బ్రిగేడియర్ రాజీవ్ చౌహాన్ మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రారంభించారు. 1.31 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువును అభివృద్ధి చేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర సైనికులకు స్మృతిగా దీనిని ఏర్పాటు చేసినట్లు బ్రిగేడియర్ రాజీవ్ చౌహాన్ తెలిపారు.

తెలంగాణ భవన్‌లో పంద్రాగస్టు వేడుక



ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకల్లో మందా జగన్నాథం తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో స్వాతంత్ర్యదినం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధులు డా.మందా జగన్నాథం, కె.ఎం.సాహ్ని ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా గోదావరి బ్లాకులో అమరవీరులస్తూపానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం శబరి బ్లాక్‌కు చేరుకుని మందా జగన్నాథం జాతీయపతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

ప్రపంచానికే భారతదేశం అవసరం: మోహన్ భగవత్

శివాజీనగర: ప్రపంచానికే వెలుగు నిచ్చేందుకే భారతదేశం స్వాతంత్ర్యం పొందింది, నేడు ప్రపంచానికి భారతదేశ అవసరముందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. మంగళవారం బెంగళూరులో జాతీయ జెండావిష్కరణలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మనం భరతమాతకు, సూర్యునికి నమస్కరిస్తాం, స్వాతంత్ర్యం రోజున సూర్య నమస్కారం అత్యంత శ్రేష్ఠమైనది, ప్రపంచానికి భారతదేశ అవసరం ఎంతగానో ఉందన్నారు.

వచ్చే ఏడాది బాగుంటుంది!

దిగువ మధ్యతరగతి, అల్పాదాయవర్గాల ఆశాభావం

హోమ్ క్రెడిట్ ఇండియా ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడి

ఆయా వర్గాలకు 'బెస్ట్ సిటీ'హైదరాబాదే



ప్రస్తుతం దేశంలోని ఆర్థికరంగ స్థితిగతుల తీరును బట్టి.. వచ్చే ఏడాది తమ ఆదాయ స్థాయిల్లో మెరుగైన మార్పులు చోటుచేసుకుంటాయనే ఆశాభావం దిగువ మధ్యతరగతి, అల్పాదాయవర్గాల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా నగర, పట్టణ కేంద్రాల్లోని నాలుగింట మూడువంతుల దిగువ మధ్యతరగతి, అల్పాదాయవర్గాల వినియోగదారుల్లో ఈ నమ్మకం వ్యక్తమవుతోంది. రాబోయే సంవత్సరాల్లో తమ వేతనాలు గణనీయంగా పెరుగుతాయనే ధీమా వారిలో ఏర్పడడానికి దేశీయ ఆర్థికరంగం మరింత పుంజుకుంటుందనే లెక్కలే కారణమని నిపుణులు అంచనా వేస్తున్నారు. కోవిడ్ మహమ్మారి నుంచి కోలుకుంటున్న క్రమంలో... ఆర్థికరంగం బలపడుతుండడంతో గతేడాది 52 శాతం అల్పాదాయ వినియోగదారుల ఆదాయాలు పెరగగా, వచ్చే ఏడాది 76 శాతం మంది తమ ఆదాయాలు పెరుగుతాయని, ఆదాయంలో సేవింగ్స్ ఉంటాయని 64 శాతం ఆశిస్తున్నట్టు ఓ అంచనా.

- సాక్షి, హైదరాబాద్

హైదరాబాద్ మోస్ట్ ఫేవరబుల్ సిటీ

దిగువ మధ్యతరగతి, అల్పాదాయ వర్గాల జీవనానికి దేశంలోనే హైదరాబాద్ 'బెస్ట్ సిటీ'గా నిలుస్తున్నట్టుగా హోమ్ క్రెడిట్ ఇండియా ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన 'ద ఇండియన్ వ్యాలెట్ స్టడీ 2023–అండర్‌స్టాండింగ్ ఫైనాన్షియల్ బిహేవియర్ అండ్ వెల్‌బీయింగ్ ఆఫ్ కస్టమర్స్'' అధ్యయనంలో వెల్లడైంది. అల్పాదాయవర్గాల జనాభా జాతీయ సగటు నెలవారీ వేతనం రూ.30 వేలుగా ఉన్నట్టుగా ఈ సర్వే అంచనావేసింది. ఈ అధ్యయనంలో... నగరాల వారీగా డేటాను పరిశీలిస్తే మాత్రం టాప్–4 మెట్రోనగరాలను తోసిరాజని ప్రథమశ్రేణి నగరాల్లో హైదరాబాద్ లోయర్ ఇన్‌కమ్‌గ్రూప్‌నకు రూ.42 వేల నెలవారీ సగటు వేతనంతో (జాతీయ సగటు కంటే రూ.12 వేలు అధికంగా) 'మోస్ట్ ఫేవరబుల్ సిటీ'గా నిలిచినట్టు వెల్లడించింది.

మెట్రో నగరాలతో సమానంగా..

బెంగళూరు, పుణె, అహ్మదాబాద్ నగరాలు కూడా ఢిల్లీ (రూ.30వేలు), ముంబై (రూ.32 వేలు), చెన్నైతో సమానంగా, అంతకంటే ఎక్కువగా అల్పాదాయవర్గాలకు నెలవారీ వేతనాలు కల్పిస్తున్నట్టు తెలిపింది. ఎమర్జెన్సీ, వైద్యఖర్చులు, పిల్లలకు అనారోగ్యం, ఇంటి ఖర్చులు సమర్థవంతంగా ఎదుర్కొనేలా ఈ వర్గాలు సన్నద్ధమౌతున్నట్టు వెల్లడైంది.

- దేశవ్యాప్తంగా ఢిల్లీ, ముంబై, కోల్‌కత్తా, బెంగళూరు, హైదరాబాద్, భోపాల్, పట్నా, రాంచీ, అహ్మదాబాద్, చండీగఢ్, చెన్నై, డెహ్రాడూన్,జైపూర్, లక్‌నవూ, లూధియానా, కొచ్చి, పుణెలలోని 18–55 ఏళ్ల మధ్యలోని వార్షికాదాయం రూ.2 లక్షల నుంచి రూ.5లక్షల లోపున్న 2,200 మంది అల్పాదాయ వర్గాలకు చెందిన వారి నుంచి వివిధ అంశాలపై సమాచారం సేకరించారు.

ముఖ్యాంశాలు...

- ముంబై, ఢిల్లీ, చెన్నై, కోల్‌కత్తా వంటి మెట్రోనగరాల కంటే కూడా హైదరాబాద్, పుణె, అహ్మదాబాద్, బెంగళూరు వంటి ప్రథమ శ్రేణి నగరాల్లో (టైర్–1 సిటీస్) అల్పాదాయవర్గాలకు అధిక ఆదాయాలు వస్తున్నాయి
- ఈ టైర్–1 సిటీస్‌లోని దిగువ మధ్యతరగతి, అల్పాదాయవర్గాల వారు స్వయంగా షాపులకు వెళ్లి షాపింగ్ చేయడం ద్వారా వివిధ రకాల వినిమయ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు.

కొనుగోలు చేసిన వస్తువులకు చెల్లింపులు లేదా రుణాలు తీసుకునేపుడు డిజిటల్ పేమెంట్స్ వైపు మొగ్గు చూపుతున్నారు.

అల్పాదాయవర్గాల వినియోగదారుల నెలవారీ ఆదాయంలో 70 శాతం దాకా ఇంటి అద్దె(11శాతం), నిత్యావసర వస్తువులు (41 శాతం), ఆఫీసులకు రాకపోకలకు (14 శాతం) ఖర్చు అవుతోంది

అదేసమయంలో 70 శాతం మంది అనవసర ఖర్చులు (నాన్-ఎసెన్షియల్ స్పెండింగ్)చేసేందుకు ఏమాత్రంగా సుముఖత వ్యక్తం చేయడం లేదు

- వీరికి లోకల్ సైట్ సీయింగ్, హోటళ్లలో తినడం, సినిమాలకు వెళ్లడం వంటివి ప్రధాన రిక్రియేషన్‌గా ఉంటున్నాయి
- ఈ కుటుంబాల్లో ఒకరికి మించి వేతనజీవులు ఉండడం వల్ల వీరంతా కుటుంబఖర్చులను పంచుకుంటున్నట్టుగా ఓ అంచనా. అందులో ఇంటిపెద్ద 80 శాతం దాకా కంట్రిబ్యూట్ చేస్తున్నారు



"వినియోగదారుల నాడిని పట్టుకోవడంలో భాగంగా నిర్వహించిన ఈ అధ్యయనంలో కస్టమర్లు చేసే ఖర్చుల తీరుతెన్నులపై దృష్టి పెట్టాం. కరోనా అనంతర పరిస్థితుల్లో ఆర్థికరంగం, వినియోగదారుల వ్యవహారశైలిలో వచ్చిన మార్పు, చేర్పులను పరిశీలించాం. ప్రధానంగా దాదాపు వందకోట్ల వినియోగదారులు (అర్బన్ లోయర్ మిడిల్‌క్లాస్)చేసే ఖర్చులు, ఇతర అంశాలపై దృష్టిపెట్టాం. ఈ వర్గం వినియోగదారుల్లో చేసే ఖర్చులు, సేవింగ్స్ విషయంలో సానుకూల దృక్పథం వ్యక్తమౌతోంది. – అశిష్ తివారీ, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, హోమ్ క్రెడిట్ ఇండియా


'తలసరి విద్యుత్'లో తెలంగాణది పదో స్థానం

కేవలం రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకున్నా 7వ స్థానంలోనే మనం

స్పష్టం చేస్తున్న సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ గణాంకాల నివేదిక

సాక్షి, హైదరాబాద్

దేశమైనా, రాష్ట్రమైనా ప్రగతిపథంలో ఉందని చెప్పడానికి తలసరి ఆదాయం, తలసరి విద్యుత్ వినియోగాన్ని ప్రామాణిక సూచికగా తీసుకుంటారు. అయితే ఈ రెండింటిలోనూ తెలంగాణ దేశంలో నంబర్ 1 స్థానంలో నిలిచింది. రూ.3,12,398 తలసరి ఆదాయంతో, 2,126 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగంతో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది..'అని ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు మంగళవారం గోల్కొండ కోట సాక్షిగా చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో పేర్కొన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగానూ సీఎం ఇదే ప్రకటన చేశారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నిజంగానే దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. ఈ విషయాన్ని కేంద్రం స్వయంగా పార్లమెంట్‌లో ప్రకటించింది. అయితే, తలసరి విద్యుత్ వినియోగంలో మాత్రం తెలంగాణ అగ్రస్థానంలో లేదు. 2126 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగంతో మన రాష్ట్రం జాతీయస్థాయిలో 10వ స్థానంలో ఉంది. గత ఫిబ్రవరి 17న సెంట్రల్ ఎలక్ట్రిసిటీ ఆథారిటీ(సీఈఏ) ప్రకటించిన 'అఖిల భారత విద్యుత్ గణాంకాలు–2022'నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. దేశంలోని మొత్తం 37 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని 2020–21 వార్షిక విద్యుత్ సరఫరా గణాంకాల ఆధారంగా సీఈఏ తాజా నివేదిక ప్రకటించింది. జాతీయస్థాయిలో ఏటా వార్షిక విద్యుత్ గణాంకాలను సీఈఏ ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. రాష్ట్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నా తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగంలో ఏడో స్థానంలో ఉందని సీఈఏ నివేదిక పేర్కొంటోంది.



ఆయా కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాల్లో తలసరి విద్యుత్ వినియోగం ఇలా (యూనిట్లలో)

1	దాద్రా- నగర్‌హవేలీ	12,250
2	దామన్ & దయ్యూ	5914
3	గోవా	3736
4	పంజాబ్	2350
5	ఒడిశా	2264
6	గుజరాత్	2239
7	ఛత్తీస్‌గఢ్	2211
8	హరియాణా	2186
9	పుదుచ్చేరి	2136
10	తెలంగాణ	2126

- భారత దేశ తలసరి విద్యుత్ వినియోగం 1161 యూనిట్లు ఉండగా, అంతకు మెరుగైన పరిస్థితిలో తెలంగాణ ఉంది.)

తప్పుదోవ పట్టిస్తున్న అధికారులు..?

తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని, బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో చేసిన ప్రసంగంలో సీఎం కేసీఆర్ అన్నారు. సీఎం ప్రసంగం కోసం సీఎంఓ ఎప్పటికప్పుడు అన్ని శాఖల నుంచి సమాచారం సేకరిస్తుండగా, అధికారులు తప్పుడు వివరాలు అందించి తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శలున్నాయి.

వ్యవసాయ విద్యుత్‌లో రాష్ట్రం అగ్రస్థానం

- రాష్ట్రాల్లో వివిధ కేటగిరీల వారీగా తలసరి విద్యుత్ వినియోగాన్ని పరిశీలిస్తే.. 592.24 యూనిట్ల తలసరి వ్యవసాయ విద్యుత్ వినియోగంతో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది.
- గృహ కేటగిరీలో 813.94 యూనిట్ల తలసరి వినియోగంతో గోవా అగ్రస్థానంలో ఉండగా, 340.62 యూనిట్లతో తెలంగాణ 5వ స్థానంలో ఉంది.
- వాణిజ్య కేటగిరీలో 273.11 యూనిట్ల వినియోగంతో గోవా అగ్రస్థానంలో, 128.81 యూనిట్ల వినియోగంతో తెలంగాణ రెండో స్థానంలో ఉంది.
- హెచ్‌టీ కేటగిరీలో పారిశ్రామిక విద్యుత్ వినియోగంలో 1163.99 యూనిట్ల వినియోగంతో గోవా ప్రథమ స్థానంలో ఉండగా, తెలంగాణ 299.19 యూనిట్ల వినియోగంతో పదోస్థానంలో ఉంది.

తెలుగుజాతి మంచి ఉద్యమకారుడిని కోల్పోయింది



గద్దర్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న నారా చంద్రబాబునాయుడు

గద్దర్ కుటుంబ సభ్యులకు చంద్రబాబు పరామర్శ

అల్వాల్ (హైదరాబాద్) : ప్రజాయుద్ధనౌక గద్దర్ మృతితో తెలుగు జాతి మంచి ఉద్యమకారుడిని కోల్పోయిందని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. గద్దర్ కుటుంబ సభ్యులను ఆయన మంగళవారం పరామర్శించారు. ఈ మేరకు అల్వాల్‌లోని వెంకటాపురం భూదేవినగర్‌లోని గద్దర్ నివాసానికి వచ్చిన చంద్రబాబు గద్దర్ భార్య విమలాగద్దర్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గద్దర్ ఒక వ్యక్తి కాదని, వ్యవస్థని అభివర్ణించారు. ఆయన పాట, ఆయన కృషి ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్రపార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అధికార ప్రతినిధి జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హార్స్ రైడింగ్





సాక్షి, హైదరాబాద్: ఈ నెల 12, 13 తేదీల్లో అజీజ్‌నగర్‌లోని హెచ్‌పీఆర్‌సీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన 16వ హైదరాబాద్ హార్స్ షో సందర్శకులను, హార్స్‌రైడింగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. వివిధ హార్స్ క్లబ్బులు, విభాగాలకు చెందిన 80 గుర్రాలు, రైడర్లు ఈ ప్రదర్శనలో పాల్గొని అద్భుతమైన విన్యాసాలను ప్రదర్శించారు. కోవిడ్ తరువాత నిర్వహించిన మొట్టమొదటి ప్రదర్శన కావడంతో అనూహ్యమైన స్పందన లభించింది. తెలంగాణ స్టేట్ ఎక్వెస్ట్రైన్ అసోసియేషన్, హైదరాబాద్ పోలో అండ్ రైడింగ్ క్లబ్ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించాయి. ఈ ప్రదర్శనలో జంపింగ్, డ్రెసేజ్, టాప్‌స్కోర్, హాక్స్ తదితర ప్రదర్శనల్లో పాల్గొన్న రైడర్లు అద్భుతమైన నైపుణ్యాన్ని, ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. హైదరాబాద్ పోలో అండ్ రైడింగ్ క్లబ్, నాసర్‌పోలో, రాయల్ కాబెల్లాస్, రాంకో డి కాబెల్లాస్, తెలంగాణ హార్స్ రైడింగ్ క్లబ్, ఇండియన్ హార్స్ రైడింగ్ స్కూల్, ఎస్‌వీపీ నేషనల్ పోలీస్ అకాడమీ, గ్యాంగ్స్‌వ్యాలీ స్కూల్, కింగ్స్ హార్స్‌మెన్‌షిప్ రాంచ్, ఈజీసీ స్టేబుల్స్, థెక్, కింగ్స్ ఇక్వెస్ట్రైన్ తదితర సంస్థలకు చెందిన రైడర్లు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మంత్రి మల్లారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కార్మిక శాఖమంత్రి చామకూర మల్లారెడ్డికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. 'ది విజనరీ విత్ అన్ పారెల్డ్ మాస్టరీ'గా గుర్తిస్తున్నట్లు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఫౌండర్ ఎడిటర్ వివేకానందబాబు ప్రకటించారు. ప్రజాసేవలో ఆయన నాయకత్వ లక్షణాలకు గుర్తింపుగా ఒడియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.

త్రివర్ణ ఇడ్లీ.. పూరీ



పరకాల: ఇదేంటి అనుకుంటున్నారా..ఒక్కొక్కరు ఒక్కో రకమైన దేశాభిమానం ప్రదర్శిస్తుంటారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా పరకాలలోని శ్రీరామ ఉడిపి హోటల్ యాజమాని జాతీయ పతాకాలు, బెలూన్లతో అలంకరించడంతోపాటు మూడు రంగుల ఇడ్లీ.. పూరీలతో కస్టమర్లను ఆకట్టుకున్నాడు. పంద్రాగస్టు స్పెషల్ టిఫిన్ అంటూ కస్టమర్లు హాయిగా తినేశారు.

పార్టీలు, సంఘాలన్నీ ఒకేసారి..



బీబీపేట: కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఒకేసారి 15 జెండాలు ఆవిష్కరించడం పలువురిని ఆకర్షించింది. చౌరస్తాలో ఒకే దగ్గర బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, ఆయా కుల సంఘాలు, తాపీ మేస్త్రీ సంఘం, దివ్యాంగుల సంఘం, ఆటో యూనియన్ సంఘం తదితర సంఘాలకు సంబంధించి గద్దెలు ఏర్పాటు చేసుకొని ప్రతిసారి జాతీయ జెండాలను అందరూ ఒకే సమయానికి ఎగురవేస్తారు. ప్రతిఒక్కరూ పలకరించుకొని స్నేహపూరితంగా మాట్లాడుకుంటూ పార్టీలు, కులాలు అన్ని పక్కన పెట్టి కలిసిమెలిసి జెండా పండుగ జరుపుకుంటారు. అలాగే బీబీపేటలోని ప్రభుత్వ కార్యాలయాల వద్దకు గుంపుగా వెళ్లి జెండాలను ఆవిష్కరించే సమయానికి హాజరవుతారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.